PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 262 | విజయవాడ, శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Friday 25 April 2025 | Rs

SSC చరిత్రలోనే తొలిసారి

సరికొత్త రికార్డు ఆవిష్కరించాం

భాష్యం® ఒక గొప్ప ఎంపిక

AP SSC-2025 ఫలితాలలో ఇక పై వేరెవ్వరూ అధిగమించలేనంతగా ...



600 / 600

Y. Nehanjani HT No. 2507103274

599 A. Likitha HT No. 2504105131

598 S. Shalini Samhita HT No. 2517126536

599 K. Harshith HT No. 2509104147

598 P. V S S Sri Hasini HT No. 2514111076

599 K. Prema S Likitha HT No. 2507120893

598 M. Priya Joshini HT No. 2523108674

AP SSC-2025 ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన మా "భాష్యం" విద్యార్థులు

Marks	Name	HT. No.
597	Chaathurya Thukivakam	2519116030
597	Vagaruru Harini	2521124204
596	Durga Geethika T	2514104736
596	Manasa Intur	2516103866
596	Sana Tahseen Nathad	2521126276
596	Lakshmi Sai Harshitha B.	2507110848
596	B.S.S.Manikanta Viswesh	2508120755
595	Jwalitha Bollineni	2514106010
595	Lekhya Sri Tumati	2514101791
595	Diya Koyi	2516117885
595	V. Chaitra Nikitha Reddy	2517125555
595	Lasya Priya Banda	2517103077
595	M. Gayathri	2518105798
595	Jerubandi Harika	2521124808
595	Ch. Sai Lakshmi Prasanna	2507102869
595	Shresta Medapati	2510113265
595	Kyathi Sri Maddala	2510112447
595	M. Raja Harsha Sri	2506100906
594	Maahi Zaara Syed	2514105854
594	Yamini Vidhyadari Alla	2514106890
594	Nirupama Danda	2514107154
594	Charan Tej Gaddam	2514102863
594	Arshiya Shaik	2516117891
594	Sahithi Natur	2521118186
594	L.Vema Naga Durga Devi	2508121722
594	Yuva Raj Sing R.	2510123234
594	Ruchitha Gurram	2504110724
594	P. Abhisrikhari	2506107944
594	B. Monika	2501101142
594	K. Vishal	2504117437
593	Dhatri Kata	2514105066
593	Pallavi Bellam	2514101193
593	Dudi Divya Sri D.	2514103633
593	Alekhya Siyyadri	2514100171
593	Charunya Pittu	2514113555
593	Kusuma Nagandla	2514112368
593	Netra Vardini B	2515101299
593	Dharani Puchakayala	2517111251
593	Prudvi Kamisetty	2517126629
593	Bhargavi Rodda	2517126581
593	Yagna Priya Tharugu	2523115324
593	Harshith Chowdary P.	2521107238
593	Rishitha Medikondu	2523108377
593	Srihitha Evuri	2523108531
593	Hemantha Sindhu Karri	2509109371
593	Nagalakshmi Sruthi G.	2508117994
593	Rithesh Larson K.	2510113504
593	Venkata Sathvik Sanka	2510113650
593	Hari Teja Pamulapati	2511108548
593	Mukku Rudhra Hasini	2511121595
593	Sushanth kannam	2504117303
593	Teegela Navyasri	2504102733
593	Laxmi Ramu Tekkali	2506101173
593	Tulugu Mytri	2502103322
593	Manaswini Paluru	2503101094
593	Taqweem Ameer MD.	2503101277
593	Sivala Satwik	2501100983
593	Sidhartha T	2513108707
592	Aman Rasool Shaik	2514107418
592	Ananya Sanhita Ch	2514103138
592	Arjun Tej Reddy M.	2514101203
592	Glory Anusya Chelli	2514107953
592	Ithihas Kilari	2514102299
592	Pranavi Muramalla	2514101007
592	Raghavendra K.	2514102876
592	Raghavendra Reddy T	2514106984
592	Sesi Pritham P.	2514105800
592	Niharika Dadi	2514101672
592	Divya Sai Sree Ch	2514105023
592	Siri Dhulipalla	2514107184
592	K. V Praveen Kumar Reddy	2514109852
592	Devi Sricharan M	2514101200
592	Pranathi Molabanti	2514109599
592	Sravya Hiranmayi Ch.	2515101635
592	Akshaya Sri Lakshmi D	2515100628
592	Rohitha Kapu	2515100997
592	Harshitha Bolleddu	2518123089
592	Mahalakshmi Y.	2518123167
592	Chakradhara Reddy N.	2517125515
592	Krishna Sai Mekala	2517100239
592	Kowshika Chowdary V.	2517101509
592	Yashaswini Pocha	2521107216
592	Janani Borra	2513111132
592	Sruthi Sai Prasanna Lakshmi G	2513112773
592	Laasya Priya Dandu	2512101337
592	Devi Prasanna Bandi	2507101425
592	Bhuvana Dadala	2507101427
592	Mahi Sri Veera Vaishnavi N	2507101885
592	Vivek Vardhan Chakka	2511116725
592	Pallavi Nagasai Veerla	2511116839
592	Mukesh Sai Gangajala K R	2508121107
592	Krishna Sai Padmaja M.	2508121670
592	Sai Saravana Kumar D.	2510107186
592	Parvatham M R L N Sri	2510105155
592	Sudeepa Medapati	2510123018
592	Drakshayani Pederedla	2504117801
592	Manjusha Boddu	2504118560
592	Supriya Erothi	2504117803
592	Mrudula Kota S.	2506116619
592	A. Durga Prasad	2506107174
592	Kalla Hemal	2506107052
592	Deekshika Prasanna K	2506107596
592	Jahnavi Bevara	2504121912
592	Kaushik Badvety	2504105888
592	Padali Dhanu Sri	2502103175

ఇంకా మరెన్నో...

'భాష్యం' విద్యార్థుల మార్కుల అనాలసిస్

మార్కులు సాధించినవారు	సంఖ్య
590 ఆ పైగా మార్కులు సాధించినవారు	206
580 ఆ పైగా మార్కులు సాధించినవారు	953
570 ఆ పైగా మార్కులు సాధించినవారు	1889
550 ఆ పైగా మార్కులు సాధించినవారు	3585
500 ఆ పైగా మార్కులు సాధించినవారు	6635

	మ్యాథ్స్ అనాలసిస్	సైన్స్ అనాలసిస్
100 కు 100 మార్కులు సాధించినవారు	1088	724
100 కు 95 ఆ పైగా సాధించినవారు	3223	4331
100 కు 90 ఆ పైగా సాధించినవారు	4675	6685

ఈ ఘన విజయాలు సాధించిన మా విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు. సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు.

- భాష్యం రామకృష్ణ, చైర్మన్

BHASHYAM EDUCATIONAL INSTITUTIONS — SHEELENA SHOBHATE VIDYA

BHASHYAM®

మా పూర్తి ఫలితాలు www.bhashyam.in లో చూడవచ్చు

హాస్టల్ వసతి : గుంటూరు : 98485 36951, 98485 36970 | హైదరాబాద్ : 88866 68985 / 96 | వైజాగ్ : 98488 84697 | తిరుపతి : 99488 55592

ఆన్‌లైన్‌లో ఉచితంగా డిఎస్‌సి కోచింగ్

- యాప్‌ను ప్రారంభించిన మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు బిసి స్టడీ సర్కిల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ఆచార్య యాప్ రూపొందించామని, దీని ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ యాప్‌ను సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె ప్రారంభించారు. బిసి, ఇడబ్ల్యుఎస్, కాపు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులందరికీ ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. 26 జిల్లాల్లోనూ బిసి స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ కేంద్రాలను నిర్వహించామన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.1500 స్టయిఫండ్‌తోపాటు పుస్తకాల కొనుగోలు కోసం మరో రూ.1000 అందిస్తామని చెప్పారు.

సమీకరణకు అంగీకరించకపోతే సేకరణ

- రాజధాని అదనపు భూములపై మంత్రి నారాయణ
- ప్రధాని సభకు మూడు వేదికలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అదనపు భూముల విషయంలో ప్రజలు అంగీకరిస్తే సమీకరణ చేస్తామని, లేనిపక్షంలో భూసేకరణ చేస్తామని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. వెలగపూడిలో ప్రధాని మోడీ పర్యటన, సభా వేదిక ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అక్కడే మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సభ కోసం మూడు వేదికలు ఏర్పాటు చేస్తున్నామని, పనులు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. వేదికపై రైతులను గౌరవించే కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. సభావేదిక వద్దకు వచ్చేందుకు అవసరమైన రోడ్లను బాగుచేస్తున్నామని, 11 పార్కింగు స్థలాలనూ గుర్తించామని చెప్పారు. ప్రస్తుతం అమరావతి అభివృద్ధి చెందాలంటే అదనపు భూమి అవసరం ఉందని అన్నారు. ఎయిర్ పోర్టులు, ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. దీనికోసం ప్రస్తుతం అమరావతిలో ఉన్న భూమి చాలదని అన్నారు. అదనపు భూమి కోసం స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. అంగీకరిస్తే పూలింగు ప్రక్రియ చేపడతామని, లేనిపక్షంలో సేకరణకు వెళ్లే అంశంపై ఆలోచన చేస్తున్నామని వివరించారు. ఈ ప్రాంతంలో ప్రజలు ఉండాలంటే స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని అన్నారు. భూముల విలువ పెరగాలన్నా, నిలవాలన్నా ప్రజలు ఉండాల్సిందేనని అన్నారు. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వస్తేనే స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తాయని, అందుకనే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

సంకల్పం ఉంటే సవాళ్లు అధిగమించొచ్చు

- పుస్తక ఆవిష్కరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



'మైండ్‌సెట్ షిఫ్ట్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చంద్రబాబు, చిరంజీవి, మంత్రి నారాయణ కుమార్తె శరణి

నమ్మకానికి సంకల్పం తోడైతే ఎటువంటి సవాళ్లనైనా అధిగమించవచ్చునని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మనిషి దృఢ సంకల్పం ఎంతలా పని చేస్తుందనడానికి ఎన్టీఆర్ జీవితమే ఒక ఉదాహరణ అని చెప్పారు. మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ కుమార్తె, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి శరణి రచించిన 'మైండ్‌సెట్ షిఫ్ట్' పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రబాబు పుస్తకాన్ని ఆవిష్కరించి, తొలి కాపీని సినీనటులు చిరంజీవికి అందజేశారు.

అనంతరం శరణి అడిగిన పలు ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరంజీవి తన జీవితంలో పాజిటివ్ మైండ్‌సెట్ అభివృద్ధి చేసుకుని లక్ష్యాన్ని ఛేధించేవరకు నిరంతరం కృషి చేశారని చెప్పారు. ఎన్‌టిఆర్ రాజకీయాల్లోకి వచ్చాక చిరంజీవి మహానటుడిగా ఎదిగారని చెప్పారు. తాను చదువుకునే సమయంలో ఐఎఎస్ అవ్వాలని కోరుకున్నట్లు చెప్పారని అన్నారు. విసి పిలిచి రిజిస్ట్రార్ పోస్ట్ ఇస్తానన్నా వేరొకరు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచావన్నారు. తనకు మంత్రి పదవి కావాలని అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డిని అడిగానని, తొలిసారి గెలిచి మంత్రి పదవి అడుగుతున్నావని అన్నారని అన్నారు. అర్హత ఉంటే ఇవ్వండని ఛాలెంజ్ చేసి వచ్చానని, ఆ తర్వాత రెండేళ్లకే సినిమాటోగ్రఫీ మంత్రి అయ్యానని వివరించారు. ఏ రాజకీయ నాయకుడికి రానన్ని సంక్షోభాలు తనకు వచ్చాయని, వాటిని బలంగా ఎదుర్కొని పైకి వచ్చానని వెల్లడించారు. అంబేద్కర్ అంటరానితనం, అవమానాలు భరించి రాజ్యాంగాన్ని రాసి భావితరాలకు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి చేరుకున్న మృతదేహాలు

- శ్రద్ధాంజలి ఘటించిన పవన్ కల్యాణ్
- మధుసూదనరావుకు తుది వీడ్కోలు
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి- యంత్రాంగం

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన మన రాష్ట్రానికి చెందిన ఇద్దరి మృతదేహాలూ ఆయా జిల్లాలకు గురువారం చేరుకున్నాయి. వారి భౌతికకాయాలను డిప్యూటీ సిఎం కె.పవన్‌కల్యాణ్ గురువారం సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. సోమిశెట్టి మధుసూదనరావు భౌతికకాయం నెల్లూరు జిల్లా కావలికి చేరుకుంది. ఆయన భౌతికకాయం వద్ద పవన్ కల్యాణ్ శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి అమాయకుల ప్రాణాలను బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా, వారిని నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మధుసూదనరావు భౌతికకాయాన్ని చూసేందుకు వేలాదిగా ప్రజలు పోటెత్తారు. స్థానిక శ్మశాన వాటిక వరకూ సాగిన అంతిమయాత్రలో మంత్రులు, జిల్లా అధికారులు ముందు భాగాన నిలిచారు. సాయంత్రం 5.30. గంటలకు ప్రభుత్వ లాంచనాలతో మధు సూదనరావు భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.


మధుసూదనరావు భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న పవన్ కల్యాణ్

విశాఖ చేరుకున్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి జెఎస్.చంద్రమౌళి భౌతికకాయం వద్ద పలువురు ప్రముఖులు నివాళ్లర్పించారు. జిల్లా పరిషత్ కూడలి సమీపంలోని కనకదుర్గ నర్సింగ్ హోమ్‌లో ఉంచిన ఆయన భౌతికకాయం వద్ద గురువారం రాత్రి పవన్ కల్యాణ్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పాండురంగాపురంలోని చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీ భరత్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉన్నారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెక్కును మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఎంపి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాండురంగాపురంలోని చంద్రమౌళి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉగ్రదాడి దేశం మెత్తాన్ని విషాదంలో నింపిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మోడీ, అమిత్ షా రాజీనామా చేయాలి : షర్మిల

ఉగ్ర దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల డిమాండ్ చేశారు. ఉగ్ర దాడిలో మరణించిన చంద్రమౌళి కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. తొలుత ఆయన భౌతికకాయం వద్ద నివాళ్లర్పించారు. అనంతరం మీడియాతో షర్మిల మాట్లాడుతూ కాల్పుల సంఘటనను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఉగ్రదాడిలో భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఆ సంస్థను పూర్తిగా మోడీకి నచ్చని వారిపై కేసులు పెట్టడానికి మాత్రమే వాడుకుంటున్నారని విమర్శించారు. మతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకోవడం బిజెపి నైజమన్నారు. ఆమె వెంట విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు తదితరులు ఉన్నారు.

ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపాలెం గ్రామానికి చెందిన వేమవరపు శ్రీను, కుమారి దంపతుల కుమారుడైన జస్వంత్ (9), పప్పుల యేసయ్య, నాగేంద్రం దంపతుల కుమారుడైన యేసురాజు (16) ఇద్దరూ కలిసి గ్రామ శివారులోని బావిలో ఈతకొట్టేందుకు మధ్యాహ్నం వెళ్లారు. కొద్దిసేపటికి అదే బావి వద్దకు యామర్తి అశోక్ అనే యువకుడు వెళ్లి ఈత కొడుతుండగా ఎవరివో కాళ్లు, చేతులు తగిలినట్లు అనిపించింది. దీంతో ఊళ్లోకి వెళ్లి గ్రామస్తులకు తెలపడంతో వారొచ్చి మృతదేహాలను వెలికి తీశారు. కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ విజయశేఖర్ తెలిపారు. జస్వంత్ స్థానిక పాఠశాలలో ఐదో తరగతి, అదేపాఠశాలలో యేసురాజు పదో తరగతి చదివి ఇటీవల ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు.


జస్వంత్ (ఫైల్)


యేసురాజు (ఫైల్)



డ్రీమ్ టెక్నాలజీ బ్రాండ్ అంబాసిడర్‌గా కృతి సనన్

న్యూఢిల్లీ : స్మార్ట్ హోమ్ టెక్నాలజీ కంపెనీ డ్రీమ్ టెక్నాలజీ తన బ్రాండ్ అంబాసీడర్‌గా బాలీవుడ్ నటి కృతి సనన్‌ను నియమించుకున్నట్లు ప్రకటించింది. తమ తొలి భారతీయ ప్రచారకర్త కృతి అని ఆ సంస్థ పేర్కొంది. భారత మార్కెట్‌కు వినూత్నమైన గృహ పరిష్కారాలను తీసుకురావాలనే డ్రీమ్ ప్రయాణంలో ఈ భాగస్వామ్యం ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుందని డ్రీమ్ ఇండియా ఎండి మను శర్మ పేర్కొన్నారు.

విజయవాడలో వీధి వ్యాపారులు ఎంతమంది ఉన్నారు?

- మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

విజయవాడ నగరంలోని బీసెంట్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు చేసుకుని ఎంతమంది వీధివ్యాపారులు ఉన్నారో తెలియజేయాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. అలాగే, విజయవాడలోని అన్ని జోన్లలో ఎంత మంది వీధి వ్యాపారులకు లైసెన్సులు మంజూరు చేశారో కూడా చెప్పాలంది. వారిలో ఎంత మందికి వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారో, వ్యాపార సమయాలు, వేళలు పూర్తి వివరాలు ఇవ్వాలంది. పూర్తి వివరాలను తమ ముందుంచాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం గురువారం ఆదేశించింది. వీధి వ్యాపారుల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురౌతున్నాయంటూ బీసెంట్ రోడ్ బిల్డింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం. వెంకట విజయప్రసాద్ వేసిన పిల్‌పై తదుపరి విచారణను జులై 16కి వాయిదా వేసింది.

వీధి వ్యాపారుల వల్ల ప్రజలందరూ పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని లాయర్ దొడ్డక హర్షవర్ధన్ గురువారం వాదనలు వినిపించారు. రోడ్డు మొత్తం ఆక్రమించడం వల్ల అత్యవసర సేవల వాహనాలకు కూడా సమస్యగా మారిందన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వెళ్లే పరిస్థితులు లేవన్నారు. దీనికి విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది ఎఎస్ సి బోస్ ప్రతివాదన చేస్తూ, పలు జోన్లు ఏర్పాటు చేసి వ్యాపారాల నిమిత్తం వీధి వ్యాపారులకు లైసెన్సులు ఇచ్చామన్నారు గ్రీన్ జోన్లో ఎవరైనా వ్యాపారం చేసుకోవచ్చునని చెప్పారు. అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్న 150 మందికి నోటీసులు ఇచ్చామన్నారు.

మదనపల్లె ఫైల్స్ దగ్ధం కేసులో మాధవరెడ్డి అరెస్టు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో దస్త్రాలు దగ్ధం కేసులో కీలక నిందితుడు, మదనపల్లెకు చెందిన రైలుమిల్లు యజమాని మాధవరెడ్డిని గురువారం సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు జిల్లా రొంపిచర్ల వద్ద ఫామ్‌హౌస్‌లో ఉన్న మాధవరెడ్డిని సిఐడి డిఎస్‌పి కొండయ్య నాయుడు బృందం అదుపులోకి తీసుకుని తిరుపతికి తరలించింది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని డిఎస్‌పి తెలిపారు. గతేడాది జులై 21న రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ దస్త్రాలు దహనమైన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే.

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 262 | విజయవాడ, శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 25 April 2025 | Rs

టారిఫ్‌లతో జిడిపికి దెబ్బ

- భారత వృద్ధి అర శాతం తగ్గొచ్చు
- ఆర్థిక కార్యదర్శి అంచనా

6

జూన్ 1న కానిస్టేబుల్ ఫైనల్ పరీక్ష



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన తుది పరీక్ష జూన్ 1వ తేదిన జరుగనుంది. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని పోలీస్ నియామక బోర్డు చైర్మన్ రాజీవ్ కుమార్ మీనా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం బోర్డు వెబ్‌సైట్ slprb.ap.gov.in వెబ్‌సైట్‌ను రెగ్యులర్‌గా సందర్శించాలని పేర్కొన్నారు. డిసెంబర్ 30 నుంచి ఫిబ్రవరి 1వ తేది వరకు నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌లో 95,208 మంది అర్హత సాధించగా, ఈవెంట్స్‌లో 38,910 మంది అర్హత సాధించారని తెలిపారు.



రాజమండ్రిలో నిరసన తెలుపుతున్న ఆదివాసీ నిరుద్యోగులు (ఫైల్)

మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు అన్యాయం

అల్లూరి, మన్యం జిల్లాల్లో వారికి దక్కేవి 45 పోస్టులే..

ప్రభుత్వ తీరుపై రగిలిపోతున్న గిరిజన నిరుద్యోగులు

ప్రత్యేక డిఎస్‌సి కోసం పట్టు

ప్రజాశక్తి- పాడేరు టౌన్, అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. డిఎస్‌సి నోటిఫికేషన్‌లోని 16,347 పోస్టుల్లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనులకు కేవలం 45 పోస్టులే దక్కనున్నాయి. ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పిన గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఆ మాటను నిలబెట్టుకోకపోవడంతో ఆదివాసీ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఉద్యోగాల విషయంలో తమకు జరుగుతున్న అన్యాయంపై రగిలిపోతున్నారు. ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే కల్పించే జిఒ 3 రద్దుపై పాలకపార్టీల తీరుపైనా వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న ఆదివాసీ యువత ఈ రెండు జిల్లాల్లో భారీగా ఉంది. బిఇడి, డైట్, వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పొంది సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం వయసు సడలింపు ఇవ్వడంతో తాజా డిఎస్‌సికి మరింత పోటీ పెరిగింది. మన్యం, అల్లూరి జిల్లాల్లో 889 పోస్టులు ఉంటే గిరిజనులకు తాజా నోటిఫికేషన్‌లో కేవలం 45 పోస్టులే దక్కనున్నాయి. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో 400 పోస్టులకు గాను కేవలం 24, రంపచోడవరం డివిజన్‌లో 112 పోస్టులకుగానూ ఆరు పోస్టులు మాత్రమే కేటాయించారు. దీంతో, తమ ప్రాంతంలో తమకు దక్కాల్సిన ఉద్యోగాలు దక్కకుండా పోతుండడంతో గిరిజన యువత ఆగ్రహంతో ఉన్నారు.

ప్రత్యేక డిఎస్‌సితోనే న్యాయం

ఏజెన్సీలో గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించి స్థానిక గిరిజన నిరుద్యోగ యువతతో ఆ పోస్టులను భర్తీ చేస్తేనే వారికి న్యాయం జరుగుతుంది. సాధారణంగా నిర్వహించే డిఎస్‌సి ద్వారా గిరిజన అభ్యర్థులకు ప్రయోజనం బహు స్వల్పం. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక డిఎస్‌సి ద్వారా 640 పోస్టులను భర్తీ చేస్తామని జిఒ 233 జారీ చేసింది. కానీ, అది అమలుకాలేదు. గిరిజన సంఘాలు, గిరిజన నిరుద్యోగులు ఆందోళనలు చేసినా ఫలితం లేకపోయింది. 2015లో అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రావెల కిశోర్‌బాబు గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహిస్తామని ప్రకటించారు. మూడేళ్లపాటు నోటిఫికేషన్ వెలువడలేదు. 2019 ఫిబ్రవరిలో మిగతా 6లో

భద్రతా వైఫల్యాల బాధ్యత ఎవరిది?

అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల ప్రశ్న

పహల్గాంలో ఉగ్రదాడి మృతులకు సంతాపం

ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్రానికి ప్రతిపక్షాల సంపూర్ణ మద్దతు



అఖిలపక్ష సమావేశానికి వస్తున్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భద్రతా వైఫల్యాల బాధ్యత ఎవరిదని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. భద్రతా లోపానికి గల కారణాలేంటో తెలుసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. అదే విధంగా ఉగ్రవాదాన్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతునిస్తున్నట్టు స్పష్టం చేశాయి. గురువారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో పహల్గాం ఉగ్రదాడిపై అఖిల పక్ష సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. తొలుత పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన అమాయక ప్రజలకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

సమావేశానంతరం ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని అన్ని ప్రతిపక్ష పార్టీలు ఖండించాయని, అవసరమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వానికి పూర్తి మద్దతునిచ్చాయని అన్నారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ "దేశం మొత్తం ఈ ఘటనపై కోపంగా, విచారంగా ఉంది. దేశం, కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులకు వారి భాషలో తగిన సమాధానం ఇవ్వాలని కోరుకుంటోంది. వారు అమాయక ప్రజలను చంపిన విధంగా వారి శిబిరాలను నాశనం చేయాలి. పాకిస్తాన్‌పై కూడా చర్యలు తీసుకోవాలి. ఈ సంఘటన ఏప్రిల్ 22న జరిగింది. ఏప్రిల్ 20న భద్రతా సంస్థలకు ఎటువంటి సమాచారం లేకుండానే ఆ స్థలాన్ని తెరిచారు. జవాబుదారీ ఎవరనేది నిర్ధారించాలి. భద్రతా లోపం ఎందుకు జరిగిందో చర్య తీసుకోవాలని మేము డిమాండ్ చేశాం" అని అన్నారు.

సిపిఎం ఎంపి బికాష్ రంజన్ భట్టాచార్య మాట్లాడుతూ ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలను తమ పార్టీ కేంద్ర ప్రభుత్వానికి మద్దతునిస్తుందని, అయితే తమకు కొన్ని సందేహాలు ఉన్నాయని అన్నారు. ఉగ్రవాద దాడి జరిగిన స్థానంలో ఒక్క భద్రతా సిబ్బంది లేకపోవడానికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఇలా అనేక భద్రతాపరమైన సందేహాలు ఉన్నాయని తెలిపారు. వీటికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పుల్వామా దాడికి సంబంధించిన రిపోర్టు ఎక్కడుంది? దాని గురించి ఎవరికీ తెలియదు. దాని నుంచి ప్రభుత్వం ఎటువంటి గుణపాఠం నేర్చుకుంది? అని ప్రశ్నించారు. ప్రభుత్వం జింగోయిజాన్ని ఆపాలని సూచించారు. అలాగే దాడి జరిగిన తరువాత జమ్మూకాశ్మీర్‌తో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ముక్తకంఠంతో ఖండించారని, ఉగ్రవాదాన్ని వ్యతిరేకించారని తెలిపారు. కానీ కాశ్మీర్ ప్రజలకు వ్యతిరేకంగా కొంత మంది ద్వేషాన్ని ప్రచారం చేస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. దోషులను న్యాయస్థానం ముందుంచాలన్నారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ "పహల్గాంలో జరిగిన ఘటన గురించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సిసిఎస్) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తెలియజేశారు. ఈ సంఘటన చాలా విచారకరం. దీని కారణంగా దేశంలోని ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కూడా మరింత కఠిన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశాన్ని వ్యక్తం చేసింది" అని అన్నారు. ఈ ఘటన కాశ్మీర్‌లోని ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసిందని, అందరూ దీనిపై తమ ఆందోళనను వ్యక్తం చేశారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను స్పష్టం చేశాయని, దేశం ఐక్యంగా మిగతా 6లో

భద్రతా లోపాలపై ప్రభుత్వం అంగీకారం!

ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో భద్రతా లోపాలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. జమ్మూకాశ్మీర్‌లో భద్రతాబలగాలు, పోలీసులు కేంద్రం ఆధీనంలోనే ఉంటాయి. ఈ నేపథ్యంలోనే అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్ష నేతలతో సీనియర్ కేంద్ర మంత్రి భద్రతా లోపాలను అంగీకరించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. "ఏమీ తప్పు జరగకపోతే, మనం ఇక్కడ ఎందుకు కూర్చుంటాం? మనం కనుగొనాల్సిన చోట లోపాలు ఉన్నాయి. భద్రతా వైఫల్యానికి కారణాలు తెలుసుకోవాలి" అని కేంద్ర మంత్రి అన్నారు. అఖిలపక్ష సమావేశంలో పలువురు ప్రతిపక్ష పార్టీల నేతలు భద్రతా ప్రోటోకాల్‌ల వైఫల్యం గురించి ప్రశ్నలు అడిగారు. "భద్రతా దళాలు ఎక్కడ ఉన్నాయి? సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఎక్కడ ఉంది?" అని పలువురు నాయకులు అడిగారని ఆ వర్గాలు తెలిపాయి. దీనికి ప్రతి స్పందిస్తూ సీనియర్ కేంద్ర మంత్రి అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్ సమీపంలోని బైసరన్ ప్రాంతాన్ని తెరవడానికి ముందు స్థానిక అధికారులు భద్రతా సంస్థలకు సమాచారం ఇవ్వలేదని చెప్పినట్లు తెలుస్తోంది. ఇది సాంప్రదాయకంగా జూన్‌లో అమర్‌నాథ్ యాత్ర వరకు పరిమితం చేయబడిందని తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఆలస్యంగా స్పందించడంపై కూడా ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి స్పందిస్తూ ఆ ప్రదేశానికి వెళ్లాలంటే 45 నిమిషాల సేపు ఎత్తుగా ఉన్న ప్రాంతానికి నడిచి వెళ్లాల్సి ఉంటుందని, అటువంటి అత్యవసర పరిస్థితులను త్వరగా నిర్వహించడానికి ఎటువంటి ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (ఎస్‌ఒపి) అమలులో లేదని ప్రభుత్వ అధికారులు వివరించారు.



వెబ్‌సైట్‌లో పాలిసెట్ హాల్ టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(పాలిసెట్)-2025 హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. ఈ నెల 30వ తేదిన జరగనున్న ఈ పరీక్ష హాల్ టిక్కెట్లను polycetap.nic.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు రాష్ట్ర సాంకేతిక విద్య డైరెక్టర్ గణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని వెల్లడించారు.కేవలం ఆన్‌లైన్ విధానంలో మాత్రమే హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పోస్టు ద్వారా గానీ, ఇతర ఆన్‌లైన్‌లో పద్ధతిలో గానీ పంపబడవని వెల్లడించారు.అభ్యర్థులు చివరి నిమిషం వరకు ఉండకుండా ముందుగానే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌న్ సందర్శించడం గానీ, సమీపంలోని సహాయ కేంద్రాలను గానీ సంప్రదించాలని తెలిపారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

రాష్ట్రంలో డేటా లేక్

- ఎఐ వర్క్‌షాపులో సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టెక్నాలజీని ప్రజల కోసం ఉపయోగపెట్టాలని, దీనికోసం రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అంశంపై గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన వర్క్‌షాపును సిఎం ప్రారంభించారు. ఎఐ, ఎమర్జింగ్ టెక్నాలజీ అవసరం, పాలనలో వాటి వినియోగంపై సిఎం మాట్లాడారు. 2ఎంబిపిఎస్ ఇంటర్నెట్ కోసం ఎదురు చూసిన రోజుల నుండి డేటా ఆధారిత పాలన దిశగా ఎపిని తీర్చిదిద్దిన తన ప్రయాణాన్ని సిఎం గుర్తు చేసుకున్నారు. 30 ఏళ్లనాటి ప్రయత్నంతో నేడు ఎఐ టెక్నాలజీలో ముందుందని పేర్కొన్నారు. మేథా సంపత్తి ఉన్నవారు కూడా ఇప్పటికీ పాత విధానాలను అనుసరిస్తున్నారని, పాలన తీరులో మార్పు రావాలని సిఎం తెలిపారు. అలాగే ప్రజల నుండి వచ్చే వినతుల్లో అత్యధిక భాగం భూ సంబంధితమైనవే ఉన్నాయని ఆ సమస్యల పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలని సిఎం చెప్పారు. ఒకప్పుడు ఇస్రో ఉపగ్రహాలను మిగతా 6లో



విజయవాడ లెనిన్ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన

కాశ్మీర్‌ను కాపాడుకోవాలి

8

- రాష్ట్రవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు
- ఉగ్రవాదానికి మతం రంగు పులమొద్దు : వి.శ్రీనివాసరావు

దద్దరిల్లుతున్న దండకారణ్యం

- కర్రెగుట్టల్లో ఎదురుకాల్పులు
- ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

నిర్మానుష్యంగా ఉండే కర్రెగుట్టల దండకారణ్యం బాంబుల మోత, తుపాకీ గుళ్ల వర్షంతో దద్దరిల్లుతోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ధర్మ తార్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్రిగుట్టలపై మావోయిస్టుల ఏరివేత కొనసాగుతోంది. బస్తర్ ఐజి సుందర్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో బుధవారం ఉదయం భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరుగ్రూపుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. గురువారం వరకూ కొనసాగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఈ ప్రాంతంలో ఇంకా భారీగా గాలింపు కొనసాగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

5 వేల మందితో కొనసాగుతున్న కూంబింగ్

మరోవైపు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, నూగూరుతోపాటు బీజాపూర్ జిల్లా ఊసూరు, తార్లగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలోని కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. సుమారు ఐదు వేల మందికిపైగా పోలీస్, సిఆర్‌పిఫ్, కోబ్రా, డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్ భద్రత దళాలు అడవుల్లో జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టు కీలక నాయకులు హిడ్మా, పిఎల్‌జిఎ నెంబర్ ఒన్ దళం కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

'బచావో కర్రెగుట్టలు' పేరుతో సుమారు 80 గంటల పాటు పోలీసుల స్పెషల్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇటు తెలంగాణ.. అటు ఛత్తీస్‌గఢ్‌లో విస్తరించి ఉన్న కర్రెగుట్టలు సుమారు 250 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. ఈ ప్రాంతం పూర్తిగా భద్రతా బలగాలు తన ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అటవీ ప్రాంతంతోపాటు కర్రెగుట్టలపైన హెలికాప్టర్లు తిరుగుతున్నాయని, కాల్పుల శబ్దాలు కూడా వినిపిస్తున్నాయని, తెలంగాణలోని వెంకటాపురం, వాజేడు గ్రామాల ప్రజలు, ఆలుబాకా ఎదిర సూరవీడు కాలనీ వాసులు, చత్తీస్‌గఢ్‌లోని రాంపురం తదితర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఏ క్షణాన ఏమి జరుగుతుందోననే భయంతో ఈ గ్రామాల ప్రజలు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు.

కొత్తగా 89 వేల పింఛన్లు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

కొత్తగా రాష్ట్ర వ్యాప్తంగా 89,788 వితంతు పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీరికి మే నుంచి రూ.4 వేల వంతున పింఛన్లు పంపిణీ చేస్తారు.

ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు జీతం పెంపు

రాష్ట్రంలో ముఖ్యమైన ఆలయాల్లోని కళ్యాణకట్టల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణుల జీతాలను ప్రభుత్వం పెంచింది.

నెలకు రూ.20 వేల నుంచి 25 వేలకు పెంచుతూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖలో (44) (6ఎ) సంస్థల్లో పని చేసే వారికి కనీస గ్యారంటీ కమిషన్ సిఫారసు మేరకు జీతం పెంచారు. ఏడాదిలో వంద రోజులు కనీసం పని ఉన్న సంస్థల్లో ఈ పెంపు వర్తిస్తుంది.

ప్రభుత్వాలుగా స్థానిక సంస్థలు

- పంచాయతీరాజ్ దినోత్సవంలో పవన్‌కల్యాణ్
- పంచాయతీ ఆస్తులు ఆడిట్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్థానిక సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా మారాలని, ఆర్థిక, రాజకీయ, సామాజిక పటుత్వం, స్వయం ప్రతిపత్తి, స్వావలంబనతో స్వర్ణ గ్రామాలుగా ఎదగాలని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మంగళ గిరిలోని సికె కన్వెన్షన్లో జరిగిన కార్యక్రమానికి పవన్ హాజరయ్యారు. స్టాళ్లను పరిశీలించారు. తనకు పల్లెలంటే ప్రాణమని, అక్కడే బతకాలని బలంగా ఉన్నా సాధ్యపడలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఇష్టంగా పంచాయతీ రాజ్‌శాఖను తీసుకున్నానని, రెండు నెలల సమగ్ర పరిశీలన తరువాత ఏ పనికి నిధులు కేటాయిస్తే ఆ పనికే వినియోగించాలని స్పష్టంగా చెప్పానని పేర్కొన్నారు. మళ్లింపులు, వృథాఖర్చులు ఉండకూడదని, వసతులు, సౌకర్యాలు సమకూరాలని పేర్కొన్నారు. పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు కూడా బిల్లులు వెంటనే చెల్లిస్తామని వివరించారు. కేంద్రంలో ఆర్థిక పరమైన అంశాల వల్ల ఆలస్యం అయిందని, త్వరలోనే చెల్లించేస్తామని వివరించారు. పంచాయతీ నిధులను గత ప్రభుత్వం ఇష్టానికి వాడేసిందని వివరించారు. ఆర్థిక సంఘం పెండింగ్ నిధులను నేరుగా పంచాయతీల ఖాతాల్లో వేశామని, ఆర్థికంగా బలోపేతం చేయడంపైనే దృష్టి సారిస్తున్నామని వివరించారు. ఉపాధి కూలీ అనొద్దని, శ్రామికుడు లేదా నేస్తంగా పిలవాలని సూచించారు. కూటమి తొమ్మిది నెలల పాలనలో రూ.10,669 కోట్లవిలువైన పనులు చేశామని వివరించారు. అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా రూ.1,005 కోట్లతో 1069 కిలోమీటర్ల మేర రోడ్లను వేసి, డోలీ రహిత ఎపి సాకారానికి ముందడుగు వేస్తున్నామని పేర్కొన్నారు. పంచాయతీ ఆస్తులపై ఆడిట్ జరగాలని డిప్యూటీ సిఎం సూచించారు. ప్రతి గ్రామంలోనూ జాతీయ సమగ్రతా ప్రాంగణం ఉండాలని తెలిపారు. సర్పంచుల గౌరవ వేతనాలు పెంచాలని కోరతానన్నారు. అంతకు ముందు కాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, అధికారులు ముత్యాల రాజు, నాగలక్ష్మి అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

6,7 తేదీల్లో..

'గోద్రా రైలు' దోషుల పిటిషన్లు విచారణ

న్యూఢిల్లీ : గోద్రా రైలు దగ్ధం కేసు 2002లో దోషులు, గుజరాత్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను మే 6,7 తేదీల్లో సుప్రీంకోర్టు విచారించనుంది. ఈ విషయాన్ని దోషుల తరుపు న్యాయవాదుల్లో ఒకరైన సంజయ్ హెగ్డేకు జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం గురువారం తెలిపింది. అలాగే, ఈ కేసులో దిగువ కోర్టులు ఇచ్చిన తీర్పులు, ఇతర వివరాలతో కూడిన రికార్డులను మే 3 నాటికి సమర్పించాలని కూడా న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. గుజరాత్ ప్రభుత్వానికి కూడా ఇదే విధమైన ఆదేశాలు జారీ చేసింది. 'ఈ పిటిషన్ల విచారణకు కనీసం రెండు వారాల సమయం పడుతుంది. మేం ముందుగా మే 6,7 తేదీల్లో రోజంతా వీటిని విచారణ చేస్తాం. ప్రత్యేకమైన కేసులు ఉంటే తప్ప ఈ రోజుల్లో ఇతర కేసులను విచారణ చేయం' అని జస్టిస్ మహేశ్వరి తన ఉత్తర్వుల్లో తెలిపారు. అవసరమైతే ఈ విషయంలో ప్రధాన న్యాయమూర్తి నుంచి ఆదేశాలు తీసుకోవాలని రిజిస్ట్రీని ధర్మాసనం కోరింది.

సంపాదకీయం


ప్రజాస్వామ్యంపై దాడి

మన రాజ్యాంగ పునాది భావనలనపై ఇటీవల కాలంలో తరచూ తీవ్ర దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత తదితర అంశాలను లక్ష్యంగా చేసుకుని సంఘపరివార్ శక్తులు ఒక వ్యూహం ప్రకారం ఈ దాడులు చేస్తున్నాయి. తాజాగా బిజెపి ఎంపి నిశికాంత్ దుబే మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషి గురించి చేసిన వ్యాఖ్యలను కూడా ఈ కోణంలోంచే చూడాలి. 'కొందరు మతపరమైన గుర్తింపు ద్వారా ఎదుగుతారంటూ ఖురేషిని 'ముస్లిం కమిషనర్' అని దుబే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. న్యాయ వ్యవస్థపైన, సర్వోన్నత న్యాయస్థానంపైన కూడా ఆయన కొన్ని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జడ్జీలను నియమించే అధికారాలున్న రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఆదేశాలిస్తోందని, సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే పార్లమెంటు భవనాన్ని మూసుకోవాల్సిందేనంటూ చేసిన మరికొన్ని వ్యాఖ్యల ద్వారా భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై తీవ్ర దాడి చేశారు. ఇవే వ్యాఖ్యలు ఇంకెవరు చేసినా క్రమశిక్షణా చర్యలు తప్పేవి కావు. కాని, కమలం పార్టీ మాత్రం కిమ్మనడం లేదు.

నిజానికి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం దేశంలోని ప్రతి పౌరుడు చట్టం ముందు సమానమే! ఆర్టికల్ 14 మతం, కులం, ప్రాంతం, లింగ వివక్షలను పూర్తిగా నిషేధించింది. న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా పనిచేయాల్సిన ఆవశ్యకతలను 124, 217 అధికరణాలు ధృవీకరించాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 50 కార్యనిర్వాహక వ్యవస్థకు, న్యాయవ్యవస్థకు మధ్య ఉండాల్సిన సంబంధాలు, వాటికున్న పరిమితులను వివరించింది. రాజ్యాంగ నిర్మాతలు తమ విచక్షణతో, ఎంతో ముందు చూపుతో నిర్దేశించిన నిబంధనలను సైతం దుబే వంటి వ్యక్తులే లెక్కచేయకుండా నోటికి ఎంత వస్తే అంత మాట్లాడటం రాజకీయ దురుద్దేశం తప్ప మరొకటి కాదు. ఏదోరకంగా ప్రజలను రెచ్చగొట్టడం, మత పరంగా వారిని విడదీయడం, అధికారంలో తిష్ట వేయడం, కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెట్టడం వీరి లక్ష్యం! దీనికోసం ఏ అడ్డదారులు తొక్కడానికైనా వీరు సిద్ధం! న్యాయ వ్యవస్థనుద్దేశించి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ కోవలోవే! రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లులను తన ఇష్టం ప్రకారం చెత్తబుట్టలో పడేసి, నిబంధనలను అడ్డగోలుగా వాడుకోచూసిన తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునుద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైనాయి. పూర్వాశ్రమంలో తాను గవర్నర్‌గా ఉన్నప్పుడు అదే విధంగా వ్యవహరించిన ధన్‌ఖడ్ సాక్షత్తు దేశ ఉపరాష్ట్రపతిగా ఉంటూ 'ప్రజాస్వామ్య వ్యవస్థలపై అణు క్షిపణులను ప్రయోగించాలనుకోవడం...' అంటూ చేసిన వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థపై యుద్ధం చేయడమే!

సుప్రసిద్ధమైన కేశవానంద భారతి కేసు (1973)లో అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగ మౌలిక స్వరూప స్వభావాలను (బేసిక్ స్ట్రక్చర్)ను నిర్దేశించింది. రాజ్యాంగ విరుద్ధమైన చట్టాలను, చర్యలను తిరస్కరించడం కూడా ఈ భావనలో భాగమే! అంతేకాదు. ఆర్టికల్ 129, 215లు న్యాయస్థానాలకు తమ గౌరవాన్ని పరిరక్షించుకునే హక్కును కూడా కల్పించాయి. ఈ విశేషాధికారాలను అత్యున్నత న్యాయస్థానం వినియోగించడం లేదు. అయినప్పటికీ, అధికార సాధన కోసం మతాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకునే చర్యలను, న్యాయ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బ తీసేందుకు చేసే ప్రయత్నాలను ఏమాత్రం సహించకూడదు. ఈ దేశపు ప్రజలందరు ఒక్కటై, ఉమ్మడిగా తమకు తాము రాజ్యాంగాన్ని సమర్పించుకున్నారు. కొందరు రాజకీయ నాయకులో, అధికారులో తమ స్వార్థం కోసం దాన్ని అడ్డగోలుగా వాడుకోవడానికో, మార్చుకోవడానికో అనుమతించరాదు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మనందరి హక్కులు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను మనం అనుభవించడమే కాదు, పరిరక్షించి భావి తరాలకు భద్రంగా అందించడం కూడా మన బాధ్యత! అందుకే, దుబే, ధన్‌ఖడ్ వంటి వారు ప్రజాస్వామ్యంపైనా, లౌకికతత్వంపైనా, న్యాయవ్యవస్థపైనా చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించి తీరాలి.

మంచి మాట



రైతు పంటకు ఎరువు వేసి, నీరు పెట్టి ఊరుకోడు. ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు తీసేస్తాడు. కలుపు తీయని యెడల మంచి పంట రాదని అతనికి తెలుసు. అలాగే మానవ సమాజంలో మంచిని ప్రోత్సహించినంత మాత్రాన చాలదు. చెడు నిరోధించాలి.

- గాంధీజీ

విశ్లేషణ

పార్టీ ప్రజలకు మరింత చేరువ కావాలి



ఎం.ఎ. బేబీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ అఖిల భారత మహాసభ ఏప్రిల్ 6న మదురైలో ముగిసింది. బిజెపి-ఆర్.యస్.యస్ లను ఒంటరిపాటు చేసి ఓడించడమే లక్ష్యమని ఈ మహాసభ రాజకీయ తీర్మానం స్పష్టం చేసింది. గత పదకొండేళ్ళ మోడీ పాలనలో నయా ఫాసిస్టు లక్షణాలు సంతరించుకున్న మితవాద, మతతత్వ, నిరంకుశాధికారం సంఘటితపడిందని మహాసభ నిర్దిష్టంగా విశ్లేషించింది. హిందుత్వ శక్తుల, బడా బూర్జువాల చెలిమికి మోడీ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహిస్తున్నదని నొక్కివక్కాణించింది. అందుకే బిజెపి-ఆర్.యస్.యస్, కార్పొరేట్-హిందుత్వ అపవిత్ర చెలిమికి వ్యతిరేకంగా పోరాడి ఓడించి తీరడమే ప్రధాన లక్ష్యంగా ప్రకటించింది.

మతతత్వ శక్తుల కార్యకలాపాలకు, దాని సిద్ధాంతానికి వ్యతిరేకంగా నికరంగా, నిరంతరాయంగా పోరాడడం ద్వారా మాత్రమే బిజెపిని, హిందుత్వ శక్తులను ఓడించడం సాధ్యపడుతుందని విస్పష్టంగా ప్రకటించింది. హిందుత్వ మతతత్వ ప్రమాదానికి వ్యతిరేకంగా దేశంలోని లౌకిక శక్తులు అన్నింటినీ విశాల ప్రాతిపదికన కూడగట్టడానికి కృషి చేస్తూనే, హిందుత్వ-నయా ఉదారవాద పరిపాలనకు వ్యతిరేకంగా చేసే పోరాటం విజయవంతం కావాలంటే సి.పి.ఐ(యం) స్వతంత్రంగా తన బలాన్ని పెంచుకోవాలని, వామపక్ష శక్తులు మరింత బలోపేతం కావాలని సి.పి.ఐ (యం) భావిస్తున్నది.

గత కొంత కాలంగా పార్టీ, వామపక్ష శక్తుల బలం, ప్రభావశక్తి ప్రతిష్టంభనకు గురికావడం, ఆపై తగ్గుముఖం పట్టడం ఆందోళనకరంగా మారింది. పార్టీకి ఒకప్పుడు కంచుకోటలుగా ఉన్న బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగలడం, తత్పర్యవసానంగా ప్రజా పునాది బలహీనపడడం జరిగింది.

బిజెపికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను విశాల ప్రాతిపదికన కూడగట్టడంతో విజయవంతం అయినా 23వ మహాసభలో నిర్దేశించుకున్నట్లు సి.పి.ఐ.(యం), వామపక్ష శక్తులు బలం, రాజకీయ ప్రభావం పెంచుకోవాలన్న లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యామని రాజకీయ సమీక్షా నివేదికలో ఆత్మ విమర్శనా పూర్వకంగా పేర్కొన్నది.

23వ అఖిల భారత మహాసభ నిర్దేశించిన రాజకీయ-ఎత్తుగడల పంథా సరైనదే అని పునరుద్ఘాటిస్తూ ఆర్.యస్.యస్ దాని అనుబంధ హిందుత్వ సంస్థల ప్రభావాన్ని, కార్యకలాపాలను తిప్పికొట్టడానికి రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక రంగాలలో పార్టీ నికరంగా పోరాటాలు నిర్వహించాలని 24వ మహాసభ పిలుపునిచ్చింది. బిజెపి-ఆర్.యస్.యస్ లను ఒకదాని నుండి మరొకదానిని ఒంటరిపాటు చెయ్యలేమని, కేవలం ఎన్నికల ద్వారా మాత్రమే వీటిని ఓడించడం సాధ్యపడదని సి.పి.ఐ(యం) భావిస్తున్నది. గత దశాబ్దకాలంలో హిందుత్వ శక్తులు సైద్ధాంతికంగా ప్రభావితం చెయ్యగల గణనీయమైన పునాదిని ఏర్పరుచుకోగలిగాయి. కాబట్టి ఈ శక్తులను ఓడించడానికి సమగ్రమైన ప్రణాళిక ఉండాలని పార్టీ భావిస్తున్నది.

ఇందులో భాగంగా కార్మికవర్గంలో, కార్మికవర్గ నివాస ప్రాంతాల్లో, కార్మిక సంఘాల్లో, ప్రజా సంఘాల్లో ఇతరత్రా వేదికల్లో సామాజిక-సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా మతతత్వ వ్యతిరేక కృషిని పెంపొందించడం మీద పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నది. మత విశ్వాసానికి, మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగపరచడానికి మధ్య ఉన్న తేడాను విశ్వాసులకు అర్థం చేయించే కృషిని కూడా చేపడుతుంది. పండుగలు, ఇతర సామూహిక సమావేశాల్లో మతతత్వ శక్తులు జొరబడి రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చెయ్యడాన్ని నిలవరించడానికి కూడా ప్రయత్నిస్తుంది. పండుగలు / తదితర సందర్భాలలో మతాతీత, కులాతీత మేలు కలయికల కోసం కృషి చేస్తుంది. మనువాద ఛాందసవాద విలువలకు వ్యతిరేకంగా లౌకిక, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడానికి ప్రజా సైన్సు ఉద్యమాలలోను సామాజిక సేవా కార్యక్రమాలలోను పాల్గొంటుంది.

> **మతతత్వ శక్తుల కార్యకలాపాలకు, దాని సిద్ధాంతానికి వ్యతిరేకంగా నికరంగా, నిరంతరాయంగా పోరాడడం ద్వారా మాత్రమే బిజెపిని, హిందుత్వ శక్తులను ఓడించడం సాధ్యపడుతుందని విస్పష్టంగా ప్రకటించింది. హిందుత్వ మతతత్వ ప్రమాదానికి వ్యతిరేకంగా దేశంలోని లౌకిక శక్తులు అన్నింటినీ విశాల ప్రాతిపదికన కూడగట్టడానికి కృషి చేస్తూనే, హిందుత్వ-నయా ఉదారవాద పరిపాలనకు వ్యతిరేకంగా చేసే పోరాటం విజయవంతం కావాలంటే సి.పి.ఐ(యం) స్వతంత్రంగా తన బలాన్ని పెంచుకోవాలని, వామపక్ష శక్తులు మరింత బలోపేతం కావాలని సి.పి.ఐ (యం) భావిస్తున్నది.**

బెంగాల్, త్రిపుర లలో పార్టీని, వామపక్ష శక్తులను పునర్నిర్మించి బలోపేతం చేసుకోవడం అత్యున్నత కర్తవ్యంగా మదురై మహాసభ నిర్దేశించుకున్నది. పశ్చిమ బెంగాల్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంత పేద ప్రజానీకం మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టి వారిని సంఘటితపరచి నిర్మాణంలో ఇముడ్చుకోవాలి. త్రిపురలో క్షేత్ర స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలని, గిరిజనుల ప్రత్యేక సమస్యల మీద దృష్టి పెడుతూనే కష్ట జీవులందరినీ ఐక్యం చేసేందుకు తగిన కార్యాచరణ చేపట్టాలని మహాసభ నిర్దేశించింది.

బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో ప్రజావిశ్వాసాన్ని తిరిగి చూరగొనడానికి శాయశక్తులా కృషి చేస్తూనే మిగిలిన రాష్ట్రాల్లో పార్టీ ప్రభావాన్ని త్వరితంగా విస్తరింపచేయడానికి కృషి చేపడుతుంది. ఈ కర్తవ్య నిర్వహణలో భాగంగా పార్టీ పునాది వర్గాల్లో కృషిని పెంపొందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని మహాసభ నొక్కిఒక్కాణించింది. గ్రామీణ ప్రాంత సంపన్న వర్గాల కూటమి దోపిడీకి వ్యతిరేకంగా గ్రామీణ పేదలను ఉద్యమింపచేయడంలో ఎదుర్కొంటున్న బలహీనతలను అధిగమించాలని పార్టీ మహాసభ పిలుపునిచ్చింది. పార్టీ స్వతంత్ర, రాజకీయ కార్యాచరణకు, ప్రజా సమీకరణకు ప్రాధాన్యతనివ్వాలని మదురై మహాసభ స్పష్టం చేసింది. ఎన్నికల అవగాహన, పొత్తుల కారణంగా పార్టీ స్వతంత్ర ఉనికిని గానీ, కార్యాచరణను గానీ పెంపొందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మసకబార కూడదని మహాసభ స్పష్టీకరించింది.

కులం, జెండర్ తదితర సామాజిక సమస్యలపై సంప్రదాయంగా ఆయా ప్రజా సంఘాలు చేస్తున్న కృషి మీదనే ఆధారపడకుండా పార్టీ నేరుగా ఈ ప్రజా సమస్యల్లో జోక్యం చేసుకుని పోరాటాలు పెంపొందించాలని, ఆయా పోరాటాలను దోపిడికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలతో అనుసంధానించాలని గత కొంత కాలంగా సూచిస్తూ ఉన్నది.

సమాజంలో సామాజిక అణిచివేతకు, దోపిడికి గురవుతున్న బడుగు, బలహీన వర్గాల వారు తమ హక్కుల కోసం పోరాడుతూ తమ అస్తిత్వాన్ని చాటుకుంటున్నారు. ఇలాంటి పోరాటాలకు సంఘీభావం ప్రకటించడంతో సరిపెట్టుకోకుండా పార్టీ ప్రత్యక్షంగా వీటిలో చురుగ్గా పాల్గొనాలని మహాసభ నిర్దేశించింది. సమాజంలో తీవ్రమైన అణిచివేతకు గురవుతున్న అణగారిన వర్గాలు, దళితుల ఆకాంక్షలను, వారి ప్రజాస్వామిక చైతన్యాన్ని కొన్ని దశాబ్దాల క్రితమే పార్టీ కార్యక్రమం గుర్తించింది. వికలాంగులు గౌరవప్రదమైన జీవితాలు గడిపేందుకు తగిన హక్కుల సాధన కోసం పార్టీ కృషి చేస్తుందని వాగ్దానం చేసింది. గిరిజన ప్రజానీకం సమస్యల మీద కూడా మహాసభ చర్చించింది. యల్.జి.బి.టి.క్యూ సహా సమాజంలో అణగారిన, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని మదురై మహాసభ తీర్మానించింది.

పార్టీ బలోపేతం కావాలన్నా, భవిష్యత్తులో మరింతగా విస్తరించాలన్నా యువ తరాన్ని పార్టీ ప్రభావంలోకి మరింతగా తీసుకురాగలగాలి. పార్టీ వైపునకు యువతరాన్ని ఆకర్షించాలంటే బూర్జువా పార్టీలకు భిన్నంగా, వారిని ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన నినాదాన్ని, కార్యాచరణను రూపొందించాలని పార్టీ గుర్తించింది. ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తున్న యువతరం ఆకాంక్షలను అందుకోవాలి. ఇందులో భాగంగా పార్టీ ఎదుర్కొంటున్న బలహీనత ఏమిటో రాజకీయ సమీక్షా నివేదిక స్పష్టం చేసింది.

మన రాజకీయ, సైద్ధాంతిక ప్రచారంలో సోషలిజం సాధనే లక్ష్యంగా పెద్దఎత్తున ప్రచారం కాకపోవడం ఒక బలహీనత. మనం ప్రచారం చేసే వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని సోషలిజంతో అనుసంధానించాలి. సోవియట్ సోషలిస్టు రష్యా పతనానంతరం, సోషలిజానికి ఎదురు దెబ్బలు తగిలిన కాలానంతరం యువతరానికి ఈ లక్ష్యం మరింత చేరువ కావడం అత్యావశ్యకమని ఆ నివేదిక పేర్కొన్నది.

> **పార్టీ వైపునకు యువతరాన్ని ఆకర్షించాలంటే బూర్జువా పార్టీలకు భిన్నంగా, వారిని ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన నినాదాన్ని, కార్యాచరణను రూపొందించాలని పార్టీ గుర్తించింది. ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తున్న యువతరం ఆకాంక్షలను అందుకోవాలి. ఇందులో భాగంగా పార్టీ ఎదుర్కొంటున్న బలహీనత ఏమిటో రాజకీయ సమీక్షా నివేదిక స్పష్టం చేసింది. మన రాజకీయ, సైద్ధాంతిక ప్రచారంలో సోషలిజం సాధనే లక్ష్యంగా పెద్దఎత్తున ప్రచారం కాకపోవడం ఒక బలహీనత. మనం ప్రచారం చేసే వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని సోషలిజంతో అనుసంధానించాలి. సోవియట్ సోషలిస్టు రష్యా పతనానంతరం, సోషలిజానికి ఎదురు దెబ్బలు తగిలిన కాలానంతరం యువతరానికి ఈ లక్ష్యం మరింత చేరువ కావడం అత్యావశ్యకమని ఆ నివేదిక పేర్కొన్నది.**



/ వ్యాసకర్త సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి /
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

కవిత్వం

రాజకీయ మత రక్తసింధూరం

దట్టమైన అరణ్యాలు ఎం4
కార్బన్ కేంద్రాలయ్యాయి !
మంచు పూల లోయలు
ఏకే 47లతో ప్రతిధ్వనించాయి!
అందమైన నేలలో
రక్త వర్ణ పుష్పాలై
రాలి పడిన దేహాలు!?
విహార ప్రదేశాలు ఇప్పుడు
ఉగ్రవాద శిబిరాలు!
పుల్వామా! పుల్వామా!
నిన్నటి నెత్తుటి తడి ఆరకముందే
పహల్గాం బైసరన్! పహల్గాం
బైసరన్ !
రెసిస్టెంట్ ఫ్రంట్! లష్కరి తోయిబా!
కల్మా! కాల్మా!!
ఈ కాలానికి ఏం పేరు పెట్టను?
ఈ చరిత్రను ఏ కన్నీళ్ళతో
రక్తంతో లిఖించను?!
ఈ ఉన్మాదం పేరు వర్తమానమా?!
ఈ ఉగ్రవాదం జోరు భూతల స్వర్గ సౌందర్యమా?!
ప్రాంతాలు.. కులాలు.. మతాలు
మరి మనుషులెక్కడ?
ఖండ ఖండాలవుతున్న దేహాలు!
రక్త వర్ణ కుంకుమ పూల తునకలు!
నా దేశం ఇప్పుడు సౌందర్యవంతమైన గాయం!
ఏ మత గ్రంథాలు మార్చగలవీ అరాచక వాదాల్ని?
ఈ అప్రజాస్వామిక సిద్ధాంతాల్ని?
ఎన్నికల రాజకీయ కుట్రల్ని?
భూమంత విస్తరించిన
మరణ ఋతువు!
ఉగ్రవాద విధ్వంసపు హత్యా క్రతువు.
రక్త వర్ణ శోభిత కుంకుమ పూల వాన!
విద్వేషపు మంటలను ఎగదోసి
రాజకీయ ద్రోహుల ఎన్నికల కుట్రలు
మతవాదపు మరకలు
నిజం మీద అబద్ధపు గెలుపు!
మంచు పూల కన్నీళ్లు!?

- శిఖా-ఆకాష్, సెల్ : 9381522247

(జమ్మూ కాశ్మీర్ విహారయాత్రకు వచ్చిన భారతీయులపై జరిగిన కాల్పులకు నిరసనగా)

వ్యాఖ్య

సంపన్నుల దయాదాక్షిణ్యాలపై పేదరిక నిర్మూలనా!



డా॥ కె.వసుంధర

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం, విప్లవాత్మకం, ఆదర్శం అని చెప్తున్న పి4 అంటే 'పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్'. ఇంకా 'సున్నా పేదరికం' సాధించడం. స్వర్ణాంధ్ర-2047 'పది సూత్రాలు'లో ఇదొకటి. 2047 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడం ఈ విధానం లక్ష్యం.

మొత్తంగా పి4 కార్యక్రమం చూడడానికి ఒక వినూత్న ఆలోచనగా కనిపించవచ్చు. అరిచేతిలో స్వర్గం లాగా ఉండొచ్చు. కానీ దీనితో పేదరిక నిర్మూలన పూర్తిగా సాధ్యమవుతుందా? అన్నదే ప్రశ్న.


పేదరిక నిర్మూలన అంటే ఆ ప్రాంత ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడం, ఉచిత విద్య, వైద్యంతో పాటు వారికి పని కల్పించడం వంటి బాధ్యతలు ప్రభుత్వాలపై ఉంటాయి. ఇప్పుడు ఇలాంటి పనులన్నీ కార్పొరేట్లకు (సంపన్నులకు) కట్టబెడితే రేపు వాళ్లను ప్రభుత్వం ఎలా నియంత్రించగలుగుతుంది? వారు తప్పులు చేస్తే ఎలా ప్రశ్నిస్తుంది? పరిశ్రమలు పెరిగితే నిధులు పెరుగుతాయి. ఉద్యోగితా పెరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలి తప్ప దానాలు, దత్తతల మీద పేదరిక నిర్మూలన ఏ విధంగా సాధ్యం?

పేదరిక సూచీలో ఎక్కడున్నాం?

నీతి ఆయోగ్ రూపొందించిన బహుముఖ పేదరిక సూచీ (మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్-ఎం.పి.ఐ)లో ఆంధ్రప్రదేశ్ 20వ స్థానంలో ఉండగా, రాష్ట్రంలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. అంటే ఈ జిల్లాలో పేదరికం ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో విభిన్న రంగాల్లో 12.31 శాతం మంది పేదరికంలో మగ్గిపోతున్నట్టు ఈ నివేదికలో వెల్లడైంది. ఎం.పి.ఐ ప్రకారం అత్యంత ఎక్కువగా పేదరికం ఉన్న జిల్లాలు కర్నూలు, విజయనగరం, ప్రకాశం, విశాఖపట్నం, శ్రీకాకుళం. ఈ మొదటి ఐదు జిల్లాల్లో మూడు ఉత్తరాంధ్రవే కావడం గమనార్హం. అలాగే రాయలసీమలోని కర్నూలు మొదటి స్థానంలో ఉంది. గుంటూరు, తూర్పు గోదావరి, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పేదరికం తక్కువగా ఉంది.

కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా ఉంటూ అత్యంత బలహీనమైన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది మన రాష్ట్రమే. సర్దుకు పోడానికి, సాగిల పడడానికి చాలా తేడా ఉన్నది. మన పాలకులు కేంద్ర ప్రభుత్వంతో సర్దుకుపోవడం కాదు సాగిల పడ్డారు. ఇది నడుస్తున్న నిజం. రాష్ట్ర విభజన తరువాత కేంద్ర ప్రభుత్వం అనేక విభజన హామీలు ఇచ్చింది. అమలులో రిక్త హస్తం. వెనుకబడిన ఏడు జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామన్నారు. వాటి గురించి అడిగే సాహసం కూడా చేయలేదు. పేద కుటుంబాలను బంగారు కుటుంబాలను చేసేది ఇలాగేనా!

> **పేదరిక నిర్మూలనలో పి4 విజయవంతం అవుతుందా అనేది పెద్ద ప్రశ్న. ఈ కార్యక్రమంలో పాల్గొనాలా వద్దా అనేది ధనవంతుల ఇష్టం. అది వాళ్ల ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. ఎంతమంది పారిశ్రామికవేత్తలు దీనికి సిద్ధపడతారు? కొంతమంది దాతల సహకారంతో కొన్ని కుటుంబాలకు పి4 వల్ల ప్రయోజనం చేకూర్చవచ్చు. కానీ 30 లక్షల కుటుంబాల సమస్యను పరిష్కరించడం సాధ్యమేనా? అనేది పెద్ద సందేహం. బిల్‌గేట్స్, వారెన్ బఫెట్ వంటి ధనవంతుల దాతృత్వాన్ని చంద్రబాబు ఉదాహరణగా చెప్పారు. కానీ ఆ దేశాల్లో ప్రభుత్వాలు ప్రాథమిక సౌకర్యాలను అందిస్తాయి. దాతృత్వం అదనపు సహాయంగా ఉంటుంది.**



సూపర్ 6 పేదరిక నిర్మూలన కోసమే కదా

సూపర్ సిక్స్ హామీల్లో నగదు బదిలీతో ముడిపడిన పథకాలు ఐదు ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని మినహాయిస్తే తల్లికి వందనం, మహిళలకు ప్రతి నెలా భృతి, యువతకు నిరుద్యోగ భృతి, రైతులకు ఏటా ఆర్థిక సాయం, ఏడాదికి ఉచితంగా మూడు వంట సిలిండర్ల హామీలు..నగదు బదిలీ పథకాలే. ప్రభుత్వం తన బాధ్యతను పూర్తిగా నెరవేర్చకుండా దాతృత్వంపై ఆధారపడడం దీర్ఘకాల పరిష్కారం కాదు. సంపద సృష్టి, సమాన పంపిణీ కోసం నిర్మాణాత్మక విధానాలు అవసరం. కేవలం ధనవంతుల దయాదాక్షిణ్యాలపై పేదరికం తగ్గుతుందా???

పేదరిక నిర్మూలన అనేది ప్రభుత్వ బాధ్యత కాదా? రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని ప్రభుత్వమే గుర్తించింది. వీరికి ఇళ్లు, గ్యాస్ కనెక్షన్లు, మంచినీరు, ఇంటర్నెట్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. వీటిని ప్రైవేటు వ్యక్తుల పైకి నెట్టడమంటే ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకున్నట్టే.

ఆచరణలో అసాధ్యం

పేదరిక నిర్మూలనలో పి4 విజయవంతం అవుతుందా అనేది పెద్ద ప్రశ్న. ఈ కార్యక్రమంలో పాల్గొనాలా వద్దా అనేది ధనవంతుల ఇష్టం. అది వాళ్ల ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. ఎంతమంది పారిశ్రామికవేత్తలు దీనికి సిద్ధపడతారు? కొంతమంది దాతల సహకారంతో కొన్ని కుటుంబాలకు పి4 వల్ల ప్రయోజనం చేకూర్చవచ్చు. కానీ 30 లక్షల కుటుంబాల సమస్యను పరిష్కరించడం సాధ్యమేనా? అనేది పెద్ద సందేహం. బిల్‌గేట్స్, వారెన్ బఫెట్ వంటి ధనవంతుల దాతృత్వాన్ని చంద్రబాబు ఉదాహరణగా చెప్పారు. కానీ ఆ దేశాల్లో ప్రభుత్వాలు ప్రాథమిక సౌకర్యాలను అందిస్తాయి. దాతృత్వం అదనపు సహాయంగా ఉంటుంది.

సంపద మొత్తం కొద్దిమంది చేతులలో ఉన్న మాట వాస్తవం. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రథమ లక్ష్యమని తెలిసిందే. ఆర్థిక అంతరాల తగ్గింపు కోసం ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో మదింపు చర్యలు, ఇంకెన్నో ఉద్యమాలు జరుగుతుండడం చూస్తున్నాం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థికంగా స్థితిమంతులు, ఉదార స్వభావం కలవారు తమ పరిధులలో పేదలకు సహాయం చేయడమనేది భూమి పుట్టినప్పటి నుంచి ఉన్న ఒక సాంప్రదాయ ప్రక్రియ. ఇది శాశ్వతం కాదు, పూర్తిగా వారి దయ మీద ప్రాధాన్యత మీద ఆధారపడిన ప్రక్రియ. గాంధీజీ ధర్మకర్తృత్వ బోధన, వినోభా భావే భూదాన యజ్ఞం అన్నీ దీనిలో భాగమే. ఈ దాతృత్వమే రూపాంతరం చెంది నేడు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్)గా మారింది. సి.ఎస్.ఆర్ లక్ష్యాలను పి4 కార్యక్రమంగా చూపించడమే ప్రభుత్వం చేస్తున్న పని. అంటే "కొత్త సీసాలో పాత సారా" అన్నమాట. ప్రభుత్వం ప్రజలను ముఖ్యంగా పేద ప్రజలను మోసగించడమే కాదు మభ్యపెట్టడమే. పేదవాళ్ళు ఆత్మగౌరవంతో బతకాలని కోరుకొంటారు తప్ప మరొకరి దయాదక్షిణ్యాల మీద బతకాలనుకోరు. ఆ రోజులు ఎపుడో అంతరించి పోయాయి. ఆర్థిక స్వావలంబన వారి హక్కు, ఎవరి దయో కాదు.

ప్రజలకు పని కల్పన దిశగా ఉద్దీపన చర్యలు చేపట్టాలి. పరిశ్రమలు స్థాపించాలి. మద్దతు ధరల స్థిరీకరణ చేసి వ్యవసాయం లాభసాటిగా చెయ్యాలి. లఘు పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇచ్చి చేతి పరిశ్రమలకు చేయూతనివ్వాలి. 975 కి.మీ తీరప్రాంతమున్న రాష్ట్రం మనది. ఎంతో సహజ సంపద ఉన్న రాష్ట్రం. పేదరిక నిర్మూలన మీద ప్రభుత్వం చేసిన ఈ ప్రకటన అత్యంత నిర్లక్ష్యపూరితమైనది. బాధ్యతా రహితమైనది. పేద ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసేది. పేదరికానికి ఎవరు కారణం అని ప్రశ్నించే స్థాయికి ప్రజలు చైతన్యవంతులు అయ్యారు. మన కళ్ళ ముందు వచ్చిన గొప్ప సామాజిక మార్పు ఇది. దీనిని గుర్తించక పోవడం అవివేకం.

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పథకాల గురించి పదే పదే చెప్పడం వల్ల పేదలలో మేమేమైనా ముష్టివాళ్లమా, ఇస్తున్నది ప్రభుత్వ సొమ్మే కదా అనే ఆత్మాభిమానంతో కూడిన ఆగ్రహం కలిగింది. నిజానికి మౌలిక అంశాలను పట్టించుకోకుండా నవరత్నాలను నమ్ముకొని ఇచ్చిన ఘనత ఉన్నా...11 సీట్లకు పరిమితం చేశారు. ఓటమికి అనేక కారణాలు ఉన్నా పథకాల మీద అధిక ప్రచారం కూడా ఆయన ఓటమికి ఒక కారణం. ఈ సత్యాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి గుర్తించి ఉంటే ఆత్మహత్యా సదృశ్యమైన పి4 కార్యక్రమానికి ఇంత ప్రాచుర్యం కల్పించి ఉండే వారు కాదు.

/ వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు /

ప్రజాశక్తి
www.prajasakti.com

26న కొల్లేరు గ్రామాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు ప్రజల సమస్యలపై ఈ నెల 26న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కొల్లేరు ప్రాంతంలో పర్యటించనున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 26న ఉదయం తొమ్మిది గంటలకు గుడివాకలంకలో కొల్లేరు ప్రజలతో సమావేశం నిర్వహిస్తారని, అనంతరం పది గంటలకు పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు పరిశీలన, 11 గంటలకు కొవ్వాడలంకలో కొల్లేరు ప్రజలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కొల్లేరును ఐదో కాంటూరు నుండి మూడో కాంటూరుకు కుదించడం ద్వారా కొల్లేరు ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అందుకు సిపిఎం కృషి చేస్తుందని వివరించారు. ఇటీవల కొల్లేరు ప్రజల సమస్యలపై సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించిందని గుర్తు చేశారు. 26న జరుగుతున్న సిపిఎం రాష్ట్ర నాయకత్వ బృంద పర్యటనలో కొల్లేరు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కార్మికురాలు మృతి

ప్రజాశక్తి - నిడమర్రు (ఉంగుటూరు)

ఉపాధి హామీ పనికి వెళ్లిన మహిళా కార్మికురాలు మృతి చెందిన సంఘటన ఏలూరు జిల్లా నిడమర్రు మండలంలోని పెదనింద్రకొలనులో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... పెదనింద్రకొలనుకు చెందిన కొరపాటి నాగమణి (48) గురువారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లారు. బోదెలో పూడిక తీస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. తోటి కార్మికులు ఆమెను స్థానిక పిహెచ్‌సికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాగమణి కుటుంబసభ్యులకు ప్రభుత్వ పరంగా పరిహారం అందించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

యూట్యూబ్‌లో అన్నమయ్య సంకీర్తనలు : టిటిడి ఇఒ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను ప్రజలందరికీ, ముఖ్యంగా యువతకు యూట్యూబ్ ద్వారా చేరువచేయాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతి టిటిడి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో ఈవో, వివిధ విభాగాల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, వారి సలహాలు, సూచనలతో వేగవంతంగా సంకీర్తనలను యూట్యూబ్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

తిరుపతిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వేసవి సందర్భంగా టిటిడి స్థానిక ఆలయాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, భక్తుల అధిక రద్దీ నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై జేఈఓ వీర బ్రహ్మంకు పలు సూచనలు చేశారు. టిటిడి ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలోని వివిధ ప్రాజెక్టులలో జరుగుతున్న కార్యక్రమాలపై అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం తిరుపతిలోని ఆరోగ్య విభాగం, శ్వేత, టీటీడీ కొనుగోళ్ల విభాగం, స్విమ్స్, విద్యా, వైద్యం, తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వేద విశ్వవిద్యాలయం విసి రాణి సదాశివమూర్తి, ఎఫ్ ఎ అండ్ సిఎవో బాలాజి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- జీతాలు పెంచి బకాయిలు చెల్లించాలి
- పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ధర్నా
- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాయబారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఉపముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యాన గురువారం ధర్నా జరిగింది. ముందుగా మంగళగిరి నుంచి క్యాంపు కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం అక్కడే ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులతో ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు మారుతున్నా కార్మికుల జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. పవన్ కళ్యాణ్ పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి పది నెలలు గడుస్తోందని, ఇప్పటివరకు కార్మికుల సమస్యలపై ఒక్కసారి కూడా స్పందించలేదని విమర్శించారు.

గుర్తింపు కార్డు, కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం 1999, 2019 సంవత్సరాల్లో ఉత్తర్వులు విడుదల చేసినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. మున్సిపల్ కార్మికులు మాదిరిగా విధులు నిర్వహిస్తున్నా వారితో సమానంగా(రూ.21 నుంచి రూ24,500)జీతాలు చెల్లించడం లేదని, కేవలం రూ.4 నుంచి 12వేలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు 18 నెలలుగా జీతాలు లేని చెప్పారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన కార్మికులే ఎక్కువగా ఉన్నారని, వీరికి ప్రభుత్వాలు తీరని అన్యాయం చేయడం సరికాదన్నారు. తక్షణమే పవన్ కళ్యాణ్ స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కార్మికుల నుంచి సేకరించిన వేలాది సంతకాల పత్రాలను జనసేన ఎమ్మెల్సీ పి హరిప్రసాద్‌కు అందజేస్తున్న నాయకులు

యూనియన్ అధ్యక్షులు డి వెంకట్రామయ్య మాట్లాడుతూ 35 ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నామని, కరోనా, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల్లో ప్రజలకు అండగా నిలబడి గ్రామాలను పరిశుభ్రం చేసి ప్రజల ఆరోగ్యం కాపాడుతున్నామని చెప్పారు. టెండర్ల పేరుతో ప్రతి ఏటా అక్రమ వసూళ్లు చేస్తున్నారని, వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఉపాధ్యక్షులు ఎం పోలి నాయుడు, జి రామాంజనేయులు, కోశాధికారి కె శ్రీనివాసరావు, నాయకులు బి లక్ష్మణరావు, ప్రసంగించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శివప్రసాద్, సిహెచ్ సుబ్బారావు, వి రాము, నాయకులు శ్రీనివాసరావు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు రాయబారం అందజేత

సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల నుంచి సేకరించిన వేలాది సంతకాల పత్రాలను జనసేన ఎమ్మెల్సీ పి హరిప్రసాద్‌కు యూనియన్ నాయకులు అందజేశారు. ఉపముఖ్యమంత్రితో ఐదు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హరిప్రసాద్ వారికి హామీఇచ్చారు. అనంతరం పంచాయితీ రాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

తప్పనిసరి వ్యయానికీ తిప్పలే...!

- ఆర్థికశాఖ మల్లగుల్లాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తప్పనిసరిగా చేయాల్సిన ఖర్చుకు కూడా తిప్పలు పడక తప్పనిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురవుతోంది. కొన్ని నెలల్లో సొంత వనరుల ద్వారా సమకూరుతున్న ఆదాయం కన్నా ఈ ఖర్చే ఎక్కువగా ఉంటోంది. దీంతో నిధుల సర్దుబాటుకోసం ఆర్థికశాఖ మల్లగుల్లాలు పడుతోంది. చేసిన అప్పులకు చెల్లించాల్సిన అసలు వాయిదా, వడ్డీ చెల్లింపులు, ఉద్యోగులకు జీతాలు, పింఛన్ల వంటివి ఈ కోవలోకి వస్తాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ తరహా ఖర్చులు 1.03 లక్షల కోట్ల రూపాయలకు చేరినట్లు సమాచారం. అయితే, సొంత వనరుల ద్వారా 93 వేల కోట్ల రూపాయల మాత్రమే. దీవో మిగిలిన 10 వేల కోట్ల రూపాయల మొత్తాన్ని రుణాలు, ఇతర శాఖల నుండి నిధుల మళ్లింపు వంటి ప్రక్రియ ద్వారా భర్తీ చేశారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 127 శాతం కన్నా ఎక్కువగా ఆదాయ, వ్యయాల మధ్య అంతరం ఉన్నట్లు తేలింది. తప్పనిసరి ఖర్చులకు, సొంత ఆదాయానికి మధ్య ఈ స్థాయిలో అంతరం నెలకొనడం ఆర్థికశాఖ అధికారుల్లో చర్చనీయాంశంగామారింది. ఈ అంతరాన్ని ఎలా భర్తీ చేయాలో అర్థం కావడం లేదని అధికారులు వాపోతున్నారు..కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల అధికారులను ఆదేశించారు. అయితే, ఆ మార్గాలేమిటన్నది అంతుపట్టడం లేదని అధికారులు అంటున్నారు.

గత ఆరేళ్ల కాలంలో తప్పనిసరి వ్యయం, ఆదాయం వివరాలు (రూ. కోట్లలో)

ఏడాది	తప్పనిసరి వ్యయం	సొంత ఆదాయం	అంతరం(%)
2018-19	65,830	62,486	105.5
2019-20	71,217	60,916	116.9
2020-21	77,481	60,804	127.4
2021-22	83,401	75,997	109.7
2022-23	97,497	83,443	116.9
2023-24	1,03,225	93,410	110.6

ట్రిపుల్ ఐటి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

- డైరెక్టర్ అమరేంద్ర కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) పరిధిలోని ట్రిపుల్ ఐటి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నూజివీడు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ పదో తరగతి మార్కుల ఆధారంగా ఆరు సంవత్సరాల బీటెక్ ఇంజినీరింగ్ కోర్సులో నేరుగా ప్రవేశాలు కల్పించేందుకు ఆర్‌జియుకెటి 2025 - 26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లాలోని నూజివీడు, డాక్టర్ వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్‌కె.వ్యాలీ(ఇడుపులపాయ), ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, శ్రీకాకుళం జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటి క్యాంపస్లు కొనసాగుతున్నట్లు చెప్పారు. పదో తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థులు ఈ నెల 27వ తేదీ నుంచి మే 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి వెబ్ సైట్ https://www.rgukt.in లేదా ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసేందుకు జనరల్ అభ్యర్థులు రూ.300, రిజర్వ్ అభ్యర్థులకు రూ.200, ఇతర రాష్ట్రాల అభ్యర్థులు రూ.వెయ్యి రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజర్వేషన్ విధానాలను అనుసరించి పదో తరగతిలో మెరిట్, అర్హత పరీక్షలో ప్రతి సబ్జెక్టులో పొందిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి దశకు సంబంధించి పారదర్శకంగా వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు తెలిపారు.

30కి ఐపిఎస్ జాషువా కేసు వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి డబ్బు వసూలు చేశారని ఎసిబి నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ ఐపిఎస్ అధికారి పి.జాషువా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 30కి వాయిదా పడింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది సూర్యనారాయణ చేసిన వాదనలు గురువారం పూర్తయ్యాయి. తదుపరి విచారణ వరకు పిటిషనర్‌పై ఎసిబి కఠిన చర్యలు తీసుకోరాదన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. క్వాష్ పిటిషన్‌లో ఆ తరహా ఉత్తర్వులు ఇవ్వలేమని, ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని చెప్పింది. ఎసిబి తరఫు వాదనలు ఈ నెల 30న విచారిస్తామని జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ప్రాథమిక విచారణ లేకుండా విజిలెన్స్ నివేదికను ప్రాతిపదికగా చేసుకుని కేసు నమోదు చెల్లదని పిటిషనర్ తరుపు న్యాయవాది వాదనలు వినిపించారు.

ఎసిబి రిమాండ్ అన్యాయం

- హైకోర్టులో కసిరెడ్డి తండ్రి పిటిషన్

ప్రజాశక్తి, అమరావతి

మద్యం కొనుగోళ్ల అక్రమాల కేసులో తన కొడుకు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి కింది కోర్టు విధించిన రిమాండ్ చట్ట వ్యతిరేకమంటూ ఆయన తండ్రి కసిరెడ్డి ఉపేందర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తన కొడుకు నిర్బంధం అక్రమమని, ఎసిబి కోర్టు విధించిన రిమాండ్ చట్ట వ్యతిరేకమని, వెంటనే విడుదల చేయాలంటూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ రిపోర్టులో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు జత చేయడం అన్యాయమన్నారు. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 47 ప్రకారం అరెస్టుకు కారణాలు నిందితునికి చెప్పాలన్నారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణ చేయనుంది.

భానుడి భగభగలు

- సీలేరులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి-సీలేరు: ఏజెన్సీలో గురువారం భానుడు భగభగ మండిపోయాడు. జీకే వీధి మండలం సీలేరులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో నిప్పుల కొలిమిగా మారింది. జనసంచారం లేక రోడ్లు, ఏపీ జెన్కో కాలనీ పురవీధులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు బయటికి రావడానికి బెంబేలెత్తిపోయారు. సూర్యుడు ఉదయం 6.30 గంటల నుంచే తన ప్రతాపాన్ని చూపాడు. క్రమంగా మధ్యాహ్నం 12 గంటల సమయానికి నిప్పులు కక్కడంతో ఉష్ణోగ్రత అధికమయ్యాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావడానికి సాహసించలేదు. సాయంత్రం 4 గంటలైనా ఉష్ణోగ్రతలో ఎటువంటి మార్పులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉష్ణోగ్రత ప్రభావం ఎక్కువగా ఉండడంతో సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఉన్న గిరిజనులు సైతం బెంబేలెత్తిపోయారు. సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి చెట్లు కింద సేద తీరారు.

నేటి నుండి మార్టేరు-పెనుగొండ రోడ్డు మూసివేత

- జూన్ 11 నుంచి మళ్లీ రాకపోకలు పునరుద్ధరణ

ప్రజాశక్తి-పెనుమంట్ర (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా నెగ్గిపూడిలో కల్వర్టు నిర్మాణం, పెనుగొండలో వంతెన మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25 నుంచి జూన్ 10వ తేదీ వరకూ మార్టేరు-పెనుగొండ మధ్య రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆర్అండ్‌బి ఇఇ ప్రసాద్ తెలిపారు. రూ.కోటీ నాలుగు లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ రీత్యా విశాఖపట్నం, రాజమండ్రి, రావులపాలెం వైపు వెళ్లే వాహనాలను మార్టేరు నుండి ఆచంట, సిద్ధాంతం మీదుగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. అలాగే తణుకు, పెరవలి, నిడదవోలు వైపు వెళ్లే వాహనాలు మార్టేరు నుండి ఆలమూరు, కంతేరు మీదుగా దారి మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

పిపిపి విధానంతోనే అభివృద్ధి

- అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎపిఎండిసి ద్వారా రూ.9వేల కోట్లు
- ఎపిఐఐసి ద్వారా రూ.5 వేల కోట్లు రుణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పిపిపి విధానంలో రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులను పెద్దఎత్తున చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. స్వర్ణాంధ్ర విజన్ -2047 లక్ష్యాలు సాధించాలన్నా, పెట్టుబడులు రావాలన్నా పిపిపి విధానమే ఉత్తమమని తెలిపారు. గురువారం సచివాలయంలో పిపిపి విధానంపై సిఎం సమీక్ష నిర్వహించారు. జిల్లా ఒక యూనిట్‌గా తీసుకుని జాతీయ రహదారులను అనుసంధానిస్తూ రహదారుల నిర్మాణం, పోర్టులు, వైద్యరంగం, పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పనలో పిపిపి విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మొత్తం వ్యయంలో మూలధన వ్యయం వాటా మరింత పెంచేందుకు పిపిపి విధానం దోహదం చేస్తుందని అన్నారు. కేంద్రం ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రాష్ట్రాలను పిపిపి ప్రణాళికలు రూపొందించుకునేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. విధానం అమల్లో భూ కేటాయింపులు, అనుమతుల్లో ఆలస్యం, వివాదాలు పరిష్కరించకపోవడం వంటి సవాళ్లను అధిగమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఒప్పందాలను గత ప్రభుత్వం గౌరవించకపోవడం, ప్రైవేటు భాగస్వాములను అభివృద్ధి కారకులుగా చూడకపోవడం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం కలిగించిందన్నారు.

రాష్ట్రంలో 1,422 కిలోమీటర్ల పొడవైన 20 రహదారులను పిపిపి పద్ధతిలో చేపట్టేందుకు డిపిఆర్‌లను ప్రభుత్వం సిద్ధం చేసింది. దీన్ని 8893 కిలోమీటర్లకు పెంచే అవకాశం కల్పించారు. నూతన ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎన్ఎబిఎఫ్ఐడి, ఎన్ఐఐఎఫ్ కింద వివిధ సంస్థల సహాయం కోరేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఖనిజ వనరులను మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.9 వేల కోట్లు ఆదాయం పొందే అవకాశం ఉందని అంచనా వేసింది. పరిశ్రమలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు ఎపిఐఐసి మద్దతుతో రూ.5000 కోట్లు రుణాలు సేకరించాలని లక్ష్యం నిర్దేశించుకుంది. రాజధానిని అభివృద్ధి చేయాలని, తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకునేలా పర్యాటకం, లాజిస్టిక్స్‌ను ప్రోత్సహించాలని నిర్ణయించారు.

విలీనం 'వెనక్కి'..!

- పోరాడి గెలిచిన విద్యార్థులు
- కాటూరు యూపి స్కూల్ యథాతథం
- రేపో మాపో రానున్న ఉత్తర్వులు
- తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ (తిరుపతి జిల్లా)

మోడల్ స్కూల్స్ పేరిట చంద్రబాబు సర్కారు అమలు చేస్తున్న ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియపై రాష్ట్రమంతటా వ్యతిరేక పవనాలు వీస్తున్న సంగతి తెలిసిందే. కొన్నిచోట్ల తమ పాఠశాలలను కాపాడుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఉద్యమ బాట పట్టారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిగ మండలం కాటూరు గ్రామస్తులూ ఇదే బాటలో నడిచారు. పలుమార్లు పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలియజేశారు. ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. డీఈఓ కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే నుంచి ఎంపీ వరకు తమ పాఠశాలను కాపాడాలంటూ విన్నవించారు. ఎట్టకేలకు వారి ప్రయత్నం ఫలించింది. చంద్రబాబు సర్కారు విలీన ప్రక్రియ విచ్చిన్నమైంది. పాఠశాలను యధాతథంగా ఉంచేందుకు రేపో మాపో విద్యాశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు రానున్నాయి. ఆ మేరకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ స్వయంగా హామీ ఇచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ గిరీష్ యాదవ్ తెలిపారు. దీనిపై తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. యూపీ స్కూల్ గా ఉన్న తమ పాఠశాలను మరింత మోడరైజేషన్ చేసేందుకు తామే ఆర్థిక సాయం చేస్తామంటూ గ్రామస్తులు ముందుకు వస్తుండడం గమనార్హం. వివరాల్లోకి పోతే..

తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కాటూరు గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఇక్కడ 1 నుంచి 8 తరగతి వరకు సుమారు 70 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు సర్కార్ తీసుకున్న విలీన ప్రక్రియలో ఇక్కడ 6,7,8 తరగతి విద్యార్థులను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లమాల హైస్కూల్లో విలీనం చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. కాటూరు యూపీ స్కూలును మోడల్ ప్రైమరీ స్కూల్ గా తీర్చిదిద్ది పద్మావతి పురం ప్రాథమిక పాఠశాల, ఓటివాని చెరువు ప్రాథమిక పాఠశాల, కాటూరు యానాది కాలనీ ప్రాథమిక పాఠశాలను కాటూరులో విలీనం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఇందుకు ఒప్పుకోవాల్సిందిగా ప్రధానోపాధ్యాయుల ద్వారా పేరెంట్స్ కమిటీపై ఒత్తిడి తెచ్చారు. దీంతో తిరగబడ్డ తల్లిదండ్రులు బంగారం లాంటి తమ స్కూల్ ను వదిలి ఎక్కడో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లమాలకు తమ పిల్లల్ని ఎందుకు పంపించాలంటూ ఎదురు తిరిగారు. పోరాడారు. అంతిమంగా నైతిక విజయానికి చేరువయ్యారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ

యధాతథమే!: రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంఇఒ, బుచ్చినాయుడు కండ్రిగ

కాటూరు యూపీ స్కూలును యధాతథంగా ఉంచే అవకాశాలే మెండుగా ఉన్నాయి. విలీన ప్రక్రియపై తల్లిదండ్రుల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. యూపీ పాఠశాలను యధాతథంగా ఉంచుతున్నట్లు డీఈఓ నుంచి మౌఖిక ఆదేశాలు మాత్రమే వచ్చాయి. అధికారిక ఆదేశాలు జిల్లా విద్యాశాఖ కమిషనర్ నుంచి రావాల్సి ఉంది.

పర్యావరణాన్ని ధ్వంసం చేసి ఉర్సాకు వత్తాసా?

- డొల్ల కంపెనీకి 60 ఎకరాలు కేటాయింపా ?
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం
- విశాఖలో ఉర్సాకు కేటాయించిన భూముల పరిశీలన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



ఉర్సాకు కేటాయించిన భూములను పరిశీలిస్తున్న కె.లోకనాథం, జగ్గునాయుడు, గంగారావు, మూర్తి తదితరులు

అత్యంత విలువైన, పర్యావరణ రక్షణకు కవచాల్లా ఉండే విశాఖలోని ఐటి హిల్స్, కాపులుప్పాడ కొండలపై 'డొల్ల' కంపెనీ ఉర్సాకు సుమారు 60 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం దారుణమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన ప్రభుత్వమే పర్యావరణాన్ని విధ్వంసం చేయడం సరికాదన్నారు. విశాఖలోని ఐటి హిల్ నెంబర్ 3లో టిసిఎస్‌కు కేటాయిచిన 21 ఎకరాలను, ఆ పక్కనే 'ఉర్సా' కంపెనీకి కేటాయించిన మూడున్నర ఎకరాలను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉర్సా కంపెనీకి విశాఖలో ఐటి హిల్ - 3లో 3.5 ఎకరాలు, కాపులుప్పాడలో మరో 56.36 ఎకరాల భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని, వీటి విలువ సుమారు రూ.3 వేల కోట్లు అని తెలిపారు. ఈ కంపెనీ సుమారు రూ.5278 కోట్లు పెట్టుబడితో డేటా సెంటర్ నెలకొల్పుతోందని, దీని ద్వారా 2500 మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రకటించిందని, ఆ విషయాలు నమ్మశక్యంగా లేవని తెలిపారు. ఐటి రంగంలో కనీస అనుభవంలేని, రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్న 'ఉర్సా' డేటా సెంటర్‌కు చంద్రబాబు ప్రభుత్వం ఎలా భూములిస్తుందని, తక్షణమే కేటాయింపులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఇది పూర్తిగా రాజకీయ అవినీతి

డేటా సెంటర్ ప్రాజెక్టు ముసుగులో రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఉర్సా క్లస్టర్స్ ప్రయివేట్ లిమిటెడ్ అనే డొల్ల సంస్థకు ఏకంగా 60 ఎకరాల విలువైన భూమిని ఎకరా 0.99 పైసల చొప్పున ఇవ్వడమంటే ఇది పూర్తిగా రాజకీయ అవినీతని లోకనాథం విమర్శించారు. అభివృద్ధి పేరిట కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున విలువైన భూములను బడా సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. రూ.70 వేల కోట్లతో డేటా సెంటర్ నెలకొల్పుతారనే పేరిట 2019లో చంద్రబాబు మధురవాడలో సుమారు 134 ఎకరాలను అదానీకి కేటాయించారని, దానికి ఇప్పటికీ అతీగతీ లేదని విమర్శించారు. ఇటీవల భీమిలి దగ్గర రిసార్ట్స్, హోటల్ పేర వందల ఎకరాలను కేటాయింపులు చేశారని, విశాఖ నగర నడిబొడ్డులో ఉన్న రెండు వేల కోట్ల విలువ కలిగిన 13.50 ఎకరాల భూమిని అప్పనంగా లులూ మాల్‌కు కట్టబెట్టారని అన్నారు. ఇలా అభివృద్ధి, ఉద్యోగాల ముసుగులో పెద్దఎత్తున భూదోపిడీ, భారీ అవినీతి చోటు చేసుకున్నాయని తెలిపారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత విశాఖలో వివిధ ప్రైవేట్ సంస్థలకు జరిగిన భూ కేటాయింపులు, ప్రస్తుత పరిస్థితి, అలాగే ఇప్పటి వరకు ఐటి సంస్థలకు కేటాయించిన భూములు, స్థాపించిన సంస్థలు, వచ్చిన ఉద్యోగాలు, వారి వేతనాలు, ఎంఒయులు, ఉల్లంఘనలు, ఖాళీగా ఉన్న భూములు, తీసుకున్న చర్యలు తదితర వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం భూకేటాయింపులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉర్సా పూర్తిగా డొల్ల కంపెనీ అని, టిడిపి కూటమి ప్రభుత్వంలో ఉన్న బడా నాయకునికి చెందిన బినామీ అని కూడా ప్రచారం జరుగుతోందని, ఇప్పటికే మీడియా ఈ సంస్థ యాజమాన్యం, దాని మూలాలు, అక్రమ రాజకీయ బంధాలను బట్టబయలు చేసిందని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే ఆఘమేఘాల మీద అమెరికాలో గత ఏడాది సెప్టెంబర్ 27న, ఈ ఏడాది ఫిబ్రవరి 12న హైదరాబాద్‌లో కంపెనీని రిజిస్టర్ చేశారని, పైపెచ్చు ఆ కంపెనీ కేవలం అధీకృత పెట్టుబడిగా రూ.10 లక్షలు మాత్రమే చూపిందని అన్నారు. దీంతోనే ప్రభుత్వంలోని కొందరి బినామీ సంస్థని స్పష్టంగా తేలిపోయిందని తెలిపారు. ఈ సంస్థ రూ.5278 కోట్లు పెట్టుబడి పెడుతుందని చెప్పడం వెనుక ఖరీదైన భూములను అప్పనంగా కొట్టేయడానికేనన్న విషయం దాగి ఉందన్నారు. ఇప్పటికే ఆ సంస్థ వెనుక విజయవాడ టిడిపి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఉన్నారని, ఆయన బినామీ అయిన అబ్బూరి సతీష్ ఈ డొల్ల కంపెనీలో డైరెక్టర్ అని, గతంలో ఆయన చేసిన మోసాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. వీటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షిస్తాం : ప్రధాని మోడీ



పాట్నా : జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడికి పాల్పడిన వారిని, కుట్రదారులను వారి ఊహకు మించి శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్‌లోని మధుబని జిల్లాలో ఝుంఝుపూర్‌లో జరిగిన బహిరంగ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'భారతీయుల ఆత్మ'పై జరిగిన ఉగ్రదాడికి బాధ్యులు శిక్షకు గురికాకుండా తప్పించుకోజాలరని మోడీ పేర్కొన్నారు. దేశ ఐక్యతా స్ఫూర్తిని ఉగ్రవాదం ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదని చెప్పారు. అలాగే అండగా నిలిచిన దేశాలకు మోడీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బీహార్‌కు రూ.13,480 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులను మోడీ ప్రారంభించారు. ఈ సభలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కూడా ప్రసంగించారు.

ఘనంగా ఎకెజి భవన్ ప్రారంభోత్సవం

తిరువనంతపురం : కేరళలోని తిరువనంతపురంలో అత్యాధునికంగా నిర్మించిన సిపిఎం రాష్ట్ర కార్యాలయం (ఎకెజి భవన్) ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ, రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ తదితరుల సమక్షంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. పర్యావరణహితంగా 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో తొమ్మిది అంతస్తులు నిర్మించిన ఈ భవనంలో అవసరమైన విద్యుత్ మొత్తం సౌరశక్తితో ఉత్పత్తి చేసేలా ఏర్పాట్లు చేశారు.

గ్రీన్ రేటింగ్ - 4 సాధించిన రెండో భవనంగా ఎకెజి భవన్ రికార్డులకెక్కింది. దీనిని కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆమోదించింది. 1979లో ప్రారంభించబడిన పాత ఎకెజి సెంటర్‌లో కేరళ అధ్యయనాలపై అంతర్జాతీయ కాంగ్రెస్‌ను నిర్వహించే పార్టీ పరిశోధన మరియు అధ్యయన కేంద్రాన్ని కొనసాగిస్తుంది. కాగా ఈ కార్యాక్రమానికి ముందు పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి బాధితులకు, పోప్ ఫ్రాన్సిస్ సంస్మరణార్థం నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ భవన నిర్మాణంలో కీలక పాత్ర పోషించినందుకు మాజీ రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకష్ణన్‌ను విజయన్ కొనియాడారు.





ఎకెజి భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్

అనంతరం జరిగిన సభలో ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ మాట్లాడుతూ ప్రస్తుతం దేశాన్ని శాశిస్తున్న నయా-ఫాసిస్ట్ లక్షణాలున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు వామపక్షాలను, సిపిఎంను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. వామపక్ష శక్తులకు దిశానిర్దేశం చేయడంలో కేరళ ముందంజలో ఉంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మాట్లాడుతూ, ఆధునిక కేరళ నిర్మాణంలో సిపిఎం గణనీయమైన పాత్ర పోషించిందన్నారు.

ఉగ్రవాద దాడికి ముస్లిం పర్సనల్ లా బోర్డు ఖండన

- బాధిత కుటుంబాలకు సంఘీభావం
- వక్ఫ్ వ్యతిరేక నిరసనలకు మూడు రోజుల విరామం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని అఖిల భారత ముస్లీం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) తీవ్రంగా ఖండించింది. బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపింది. ఈ మేరకు ఎఐఎంపిఎల్‌బి అధ్యక్షులు మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ ప్రకటన విడుదల చేశారు. ఈ విషాద సంఘటనలో మరణించిన, తీవ్రంగా గాయపడినవారి కుటుంబాలకు తీవ్ర విచారం, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరిహద్దుల్లో భద్రతా దళాలు భారీగా ఉండి, గట్టి నిఘా ఉన్నప్పటికీ ఇలాంటి దాడులు పునరావృతం అవుతుండటంపై రెహమానీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇది నిస్సందేహంగా భద్రతా యంత్రాంగం యొక్క తీవ్ర వైఫల్యం' అని ఆయన తెలిపారు. స్థానికులకు, పర్యాటకులకు భద్రతపై భరోసా కల్పించేలా అక్కడి భద్రతా వ్యవస్థను పటిష్టం చేయాల్సివుందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ ఘటనలో చనిపోయినవారికి సంతాపం తెలియజేస్తూ, వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలను మూడు రోజుల పాటు నిలిపివేసినట్లు ఆయన తెలిపారు.. అనంతరం ఆందోళనలు యథావిధిగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కేంద్రానికి మద్దతుగా వుంటాం

- జమ్మూ కాశ్మీర్ అఖిలపక్షంలో నేతల స్పష్టీకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో ఇందుకు కారకులైన వారిపై తీసుకునే చర్యలకు కేంద్రానికి మద్దతుగా నిలుస్తామని జమ్మూకాశ్మీర్‌లోని అన్ని పార్టీలు ముక్త కంఠంతో స్పష్టం చేశాయి. గురువారం శ్రీనగర్‌లో జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అధ్యక్షతన ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో పహల్గాం దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించాయి. 'కాశ్మీరీల విలువలు, భారతదేశ ఆలోచనా ధోరణిపై ప్రత్యక్ష దాడి' ఇదని తీర్మానం పేర్కొంది.

సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఈ దాడి నేపథ్యంలో కాశ్మీరీలకు రక్షణ కల్పించాలని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలను కోరారు. అమాయకులపై ఇలాంటి పిరికిపంద దాడులకు సమాజంలో స్థానం లేదని అన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిని న్యాయ స్థానం ముందు నిలబెట్టడానికి చేసే అన్ని ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి జమ్మూ కాశ్మీర్‌లోని అన్ని పార్టీలు నిబద్ధతతో ఉన్నాయని అబ్దుల్లా ప్రకటించారు. ఇలాంటి ఏ ఉగ్రవాద చర్యలు కూడా తమ దృఢ సంకల్పాన్ని బలహీనపరచలేదన్నారు. బాధిత కుటుంబాలకు నేతల తరపున ముఖ్యమంత్రి సంతాపం తెలిపారు. పహల్గామ్‌లో తన గుర్రంపై పర్యాటకులను తీసుకెళ్లి, ఉగ్రవాదులతో పోరాడి పర్యాటకులను రక్షించే ప్రయత్నంలో మరణించిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా త్యాగానికి కూడా సమావేశం నివాళులర్పించింది. "ఆయన శౌర్యం, నిస్వార్థత అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అబ్దుల్లా పేర్కొన్నారు.

జమ్మూ కాశ్మీర్ అంతటా పట్టణాలు, గ్రామాలలో ఆకస్మికంగా శాంతియుతంగా జరిగిన ప్రదర్శనలను అభినందించినట్లు అబ్దుల్లా పేర్కొన్నారు. శాంతి, మత సామరస్యం పట్ల, చట్ట పాలన పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తూ, పరస్పర గౌరవాన్ని పెంపొందించడానికి, రాజ్యాంగ విలువలను నిలబెట్టడానికి, జమ్మూ కాశ్మీర్ శ్రేయస్సు కోసం సహకారంతో పనిచేయడానికి సమిష్టి సంకల్పాన్ని అఖిల పక్షం ఆమోదించిన తీర్మానం పునరుద్ఘాటించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఈ ప్రాంత శాంతి, అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేయడం కొనసాగించాలని అఖిలపక్ష సమావేశంలో నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, గులాం నబీ ఆజాద్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు యూసఫ్ తరిగామి, కాంగ్రెస్, పిడిపి, బిజెపి, ఇతర పార్టీల అగ్ర నాయకులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఏకపక్ష ధోరణులు, టారిఫ్‌లతో శాంతి సుస్థిరతలకు ముప్పు

- అభివృద్ధి పునాదులు కదిలిపోతాయి
- ఐక్యరాజ్య సమితి సమావేశంలో 80కి పైగా దేశాల ఆందోళన



ఐక్యరాజ్య సమితి : ఏకపక్ష వాదం, టారిఫ్‌లు వంటి చర్యల వల్ల అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకూ ముప్పు పొంచి వుందని దేశాలు హెచ్చరించాయి. వీటి ప్రభావం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై వుంటుందని, కానీ అది అక్కడికే పరిమితం కాదని పేర్కొన్నాయి. బుధవారం ఇక్కడ జరిగిన ఐక్యరాజ్య సమితి సమావేశంలో 80కి పైగా దేశాల ప్రతినిధులు దీనిపై ఆందోళనలు వ్యక్తం చేశారు. ఈ ఏకపక్ష వాణిజ్య చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు గ్లోబల్ సౌత్ పేర్కొంది. ఇలాంటి చర్యల వల్ల తీవ్రంగా దెబ్బతినేది వర్ధమాన దేశాలేనని పేర్కొంది. టారిఫ్‌లతో సహా ఇలా ఏకపక్ష వాణిజ్య చర్యలు పెరుగుతుండడమనేది కొత్త రకం 'ఆర్థిక, రాజకీయ బలవంతపు' చర్యలేనని ఐక్యరాజ్య సమితిలో వెనిజులా శాశ్వత ప్రతినిధి శామ్యూల్ మోంకాడా వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో టారిఫ్‌లు లక్షిత దేశాలపై అలాగే అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, దీని పట్ల అత్యంత అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు. క్యూబా ప్రతినిధి ఎర్నెస్టో గుజ్‌మన్ మాట్లాడుతూ, ఈ చర్యల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఈ వాణిజ్య యుద్ధాలు, టారిఫ్‌లనేవి అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు.

యూరప్ దేశాలు కూడా ఇదే రీతిలో ఆందోళనలు వ్యక్తం చేశాయి. టారిఫ్‌లను విస్తరించడం వల్ల అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థకు విఘాతం కలుగుతుందని హెచ్చరించాయి. గ్రీస్, డెన్మార్క్ దేశాల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. బహిరంగ అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ అనేది ఒక ఆర్థిక సాధనం లేదా నమూనానే కాదని, బహుళపక్షవాదం పట్ల మనందరి నిబద్ధత అని డెన్మార్క్ ప్రతినిధి వ్యాఖ్యానించారు. చైనా శాశ్వత ప్రతినిధి ఫూ కాంగ్ బుధవారం నాటి సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఏకపక్ష ధోరణి పెరుగుతుండడం పట్ల హెచ్చరించారు. బెదిరింపు చర్యలు విశృంఖలంగా పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల సుస్థిర అభివృద్ధి పునాది తుడిచిపెట్టుకుపోతుందని, ప్రపంచ శాంతి భద్రతలు ప్రమాదంలో పడతాయన్నారు.

సుంకాలతో అమెరికా బెదిరింపులు : చైనా

ప్రపంచ దేశాలను అమెరికా సుంకాల బూచి చూపించి బెదిరిస్తోందని చైనా ఆరోపించింది. ఐక్యరాజ్యసమితిలో చైనా రాయబారిగా పనిచేస్తున్న ఫూ కాంగ్ ఐరాస భద్రతా మండలి అర్రియా-ఫార్ములా సమావేశంలో ప్రసంగిస్తూ అమెరికా వైఖరిని ఎండగట్టారు. ప్రతీకార చర్యలు, నిస్పాక్షికత ముసుగులో అమెరికా ఆట ఆడుతోందని, ప్రపంచ దేశాలపై సుంకాలను విధించి అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య క్రమాన్ని అస్తవ్యస్తం చేస్తోందని మండిపడ్డారు. ఏదో మంచి చేస్తున్నట్లు చెబుతూ తన ప్రయోజనాలను కాపాడుకుంటోందని, వివిధ దేశాల చట్టబద్ధమైన ప్రయోజనాలను ఫణంగా పెట్టి తన ఆధిపత్య ఆకాంక్షలను ముందుకు తీసుకుపోతోందని దుయ్యబట్టారు. అమెరికా నిర్ణయాలకు ప్రతిగా చైనా నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటోందని కాంగ్ ప్రశంసించారు. ట్రంప్ ప్రభుత్వం సుంకాల వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని ఆయన విమర్శించారు. సెంటర్ ఫర్ చైనా అండ్ గ్లోబలైజేషన్ (సిసిజి) వ్యవస్థాపక అధ్యక్షులు వాంగ్ హుయావో కూడా అమెరికాపై విమర్శలు సంధిస్తూ డోనాల్డ్ ట్రంప్ సుంకాల విధానాలతో యావత్ ప్రపంచంపై అమెరికా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించిందని చెప్పారు.

టారిఫ్‌లతో జిడిపికి దెబ్బ

- భారత వృద్ధి అర శాతం తగ్గొచ్చు
- ఆర్థిక కార్యదర్శి అంచనా



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన హెచ్చు టారిఫ్‌లు భారత వృద్ధిని దెబ్బతీయనున్నాయని ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేత్ అన్నారు. సుంకాల వల్ల భారత జిడిపి 0.2 శాతం నుంచి 0.5 శాతం మేర తగ్గే అవకాశం ఉందని విశ్లేషించారు. వాషింగ్టన్‌లో జరుగుతున్న ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)ల సంయుక్త సమావేశం అనంతరం అజయ్ సేత్ మాట్లాడుతూ.. జిడిపి తగ్గుదలకు స్పష్టమైన సంకేతాలు కనబడుతున్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.5 శాతానికి పరిమితం కావొచ్చున్నారు. వాణిజ్య సంక్షోభం ప్రపంచం వృద్ధిని మందగించేలా చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో భారత్ సగటున ఏడు శాతం వృద్ధి సాధించవచ్చున్నారు. ఇందుకోసం ఆర్థిక వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అమెరికాతో వాణిజ్య చర్చలు జరపడానికి భారత ప్రతినిధి బృందం వాషింగ్టన్‌లో ఉందన్నారు. దేశంలో మూలధన వ్యయాల తగ్గుదలకు తోడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో బలహీనత, అమెరికా విధాన అనిశ్చితి నేపథ్యంలో భారత జిడిపి 0.4 శాతం తగ్గి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల ప్రపంచబ్యాంక్ విశ్లేషించింది. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) కూడా భారత జిడిపి 6.2 శాతానికి పరిమితం కావొచ్చని అంచనా వేసింది. ఇంతక్రితం 6.5 శాతం అంచనాతో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని ఐఎంఎఫ్ పేర్కొంది.

వాణిజ్య చర్చలు ప్రారంభం..

భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు వాషింగ్టన్‌లో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగనున్న ఈ చర్చల్లో టారిఫ్ అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం ద్వారా తమ వస్తువులకు భారత్‌లో మార్కెట్ చేసుకునే అవకాశం లభిస్తుందని అమెరికా ఆశిస్తుంది. అదే జరిగితే ఇక్కడి కంపెనీలు, శ్రామికవర్గం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విద్యాసంస్థల్లో కుల వివక్ష నిర్మూలన మార్గదర్శకాల రూపకల్పనకు గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో పాతుకుపోయిన కుల వివక్షను నిర్మూలించేందుకు నిబంధనలు ఖరారు చేసి, నోటిఫై చేయాల్సిందిగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)ను అత్యున్నత న్యాయస్థానం గురువారం అనుమతించింది. ఉన్నత విద్యా సంస్థల్లో నెలకొన్న కుల వివక్షను ప్రస్తావిస్తూ వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు, వారు ఎదుర్కొంటున్న వివక్ష, అలాగే మానసిక సమస్యలపై పరిశీలన జరిపి వాటినెదుర్కొనేందుకు సూచనలు చేయాలని కోరుతూ జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ నేతృత్వంలో జాతీయ టాస్క్‌ఫోర్సును గత నెల్లో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది. ఈ టాస్క్ ఫోర్స్ సమగ్ర నివేదిక ఇచ్చేవరకు యుజిసి ముసాయిదా నిబంధనలను నోటిఫై చేయడాన్ని ఆపాలని పిటిషనర్లు కోరారు. అయితే ముసాయిదా నిబంధనల నోటిఫికేషన్‌కు అనుమతించింది.

ఇజ్రాయిల్ తూటాల కొనుగోలు చేయం

- వామపక్షం చొరవతో స్పెయిన్ ప్రకటన

మాడ్రిడ్ : ఇజ్రాయిల్ సంస్థ నుండి తమ పోలీసు బలగాల కోసం తూటాలను కొనుగోలు చేసే ఒప్పందాన్ని స్పెయిన్ ప్రభుత్వం రద్దు చేసుకుంది. తమ సంకీర్ణ కూటమిలోని వామపక్ష భాగస్వామి నుండి ఎదురవుతున్న ఒత్తిడి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు గురువారం తెలిపాయి. ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ విధానాలను స్పెయిన్, దీర్ఘకాలంగా, తీవ్రంగా విమర్శిస్తూ వస్తోంది. గాజాలో హమాస్‌తో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయించడాన్ని నిలిపివేయాలని 2023 అక్టోబరులో స్పెయిన్ నిర్ణయించింది. అలాగే ఇజ్రాయిల్ నుండి ఆయుధాలు కొనుగోలు చేయడాన్ని కూడా నిలిపివేస్తూ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

51 వేలు దాటిన పాలస్తీనా మృతులు

కాగా గత 24గంటల్లో గాజాలో ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో 50మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. దీంతో ఇప్పటివరకు ఇజ్రాయిల్ సైనిక చర్యలో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 51,355కి చేరిందని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఇంకా అనేకమంది బాధితులు శిధిలాల కిందే చిక్కుకుని వున్నారని, సహాయక సిబ్బంది అక్కడకు వెళ్ళలేకుండా వున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

మహారాష్ట్రలో 32 శాతం పెరిగిన రైతుల ఆత్మహత్యలు

ముంబయి : మహారాష్ట్రలో మహాయుతి పాలన అక్కడి రైతులను తీవ్ర కష్టాల్లోకి నెడుతున్నది. మరఠ్వాడ ప్రాంతంలో అన్నదాతల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాదిలో రైతుల సూసైడ్‌లు పెరిగాయి. జనవరి నుంచి మార్చి మధ్య ఇక్కడ 269 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. డివిజనల్ కమిషనర్ కార్యాలయ నుంచి వచ్చిన నివేదిక ప్రకారం.. గతేడాది ఇదే కాలంలో 204 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ సమయంతో పోలిస్తే ఈ సారి రైతన్నల ఆత్మహత్యలు 32 శాతం పెరుగుదలను చూడటం ఆందోళనకరం. మరఠ్వాడలోని 8 జిల్లాల్లో.. బీడ్‌లో ఈ కేసులు అత్యధికంగా పెరిగాయి. 2025 మొదటి మూడు నెలల్లో ఈ జిల్లాలో 71 మంది రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయి. 2024లో ఆ సంఖ్య 44గా ఉన్నది. ఛత్రపతి శంభాజీనగర్‌లో జనవరి-మార్చి మధ్య కాలంలో 50 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నాందేడ్‌లో ఈ సంఖ్య 37, పర్భానీలో 33, ధరాశివ్‌లో 31, లాతూర్‌లో 18, హింగోలిలో 16, జాల్నాలో 13 మంది రైతు ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. రైతుల ఆత్మహత్యల విషయంలో అక్కడి బిజెపి నేతృత్వంలోని మహాయుతి సర్కారుపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. లోక్‌సభ మాజీ ఎంపీ, రైతు బృందం షెట్కారి సంఘటన చీఫ్ రాజు శెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందనీ, కానీ దానిని పాటించలేదని ఆయన అన్నారు. ఇది మోసపు చర్యగా అభివర్ణించారు. 2001 నుంచి మహారాష్ట్రలో 39,825 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఒక ప్రముఖ ఆంగ్ల వార్తా సంస్థ కథనం. వీటిలో 22,193 మంది రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభం కారణంగానే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నారు.

'ఇ-నామ్'కు ఆధార్ తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఇ-నామ్) పథకం కింద సబ్సిడీలు, ప్రయోజనాలు పొందాలంటే ఇకపై ఆధార్ తప్పనిసరి. సబ్సిడీ పంపిణీ పారదర్శకత, పంపిణీ సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో తీసుకున్న ఈ నిర్ణయం ఈనామ్ ప్లాట్‌ఫామ్ ఆపరేషనల్ ఫ్రేమ్‌వర్క్‌పై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. వ్యవసాయ వస్తువుల కోసం ఏకీకృత జాతీయ మార్కెట్‌ను సృష్టించటంలో కేంద్రంగా ఉన్న ఈనామ్ పథకం.. ఇప్పుడు రైతులు వివిధ ప్రయోజనాలను పొందేందుకు వారి ఆధార్ వివరాలను లింక్ చేయాల్సి ఉంటుంది. సబ్సిడీ పంపిణీని క్రమబద్ధీకరించటానికి, చట్టబద్ధమైన లబ్దిదారులకు వనరులు సమర్ధవంతంగా కేటాయించబడుతున్నాయని నిర్ధారించటానికి ఈ అవసరం ఉద్దేశించబడినట్టు సమాచారం.

భారతీయ విద్యార్థులకు ఊరట

- వీసాలు పునరుద్ధరించిన అమెరికా న్యాయస్థానం

జార్జియా : భారతీయులు సహా 133 మంది విదేశీ విద్యార్థుల వీసాలను తాత్కాలికంగా పునరుద్ధరిస్తూ జార్జియాలోని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీరి సెవిస్ (స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) రికార్డులను పునరుద్ధరించాలని న్యాయమూర్తి ఆదేశించారు. వీసా పునరుద్ధరణలు పొందిన విద్యార్థులలో భారతీయులే అధిక సంఖ్యలో ఉన్నారు. విదేశీ విద్యార్థుల వీసాలను, సెవిస్ రికార్డులను అమెరికా విదేశాంగ శాఖ (డిఒఎస్), ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) రద్దు చేయడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. విద్యార్థులు చట్టాలను ఉల్లంఘించినందునే వారి వీసాలు రద్దు చేశామని అమెరికా చెబుతోంది. అయితే వీరిలో చాలా మందికి ఎలాంటి నేర చరిత్ర లేదు. న్యాయస్థానం ఇచ్చిన తాత్కాలిక ఆదేశాలు విద్యార్థులకు ఎంతో ఊరట ఇస్తున్నాయి. వీరి వీసాలు రద్దు చేయడం అన్యాయమని, తీవ్రత లేని కారణాలతో వీరిపై చర్యలు చేపట్టారని ఇమ్మిగ్రేషన్ న్యాయవాదులు తెలిపారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో 'క్యాచ్ అండ్ రివోక్' కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత వీసాల రద్దు మొదలైంది. విద్యార్థి వీసాలు ఉన్న వారిని కృత్రిమ మేధ సాయంతో తనిఖీలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం కింద 300కు పైగా వీసాలు రద్దు చేశామని రూబియో గతంలో ప్రకటించారు.

జమ్మూకాశ్మీర్ వెళ్లొద్దు

- అమెరికా పర్యాటక ఆదేశాలు జారీ

న్యూయార్క్ : ఉగ్రదాడులు, భారత్-పాకిస్తాన్ సరిహద్దులకు 10 కిలోమీటర్ల పరిధిలో సాయుధ ఘర్షణలు జరిగే అవకాశం ఉన్న కారణంగా జమ్మూకాశ్మీర్‌కు వెళ్లవద్దని అమెరికా పౌరులకు ఆ దేశ ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ గురువారం పర్యాటక ఆదేశాలు జారీ చేసింది. కేంద్రప్రాంతమైన జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడులు, సాయుధ ఘర్షణలకు అవకాశం ఉందని తెలిపింది. కాబట్టి ఈ ప్రాంత పర్యటనకు వెళ్లవద్దు అని పేర్కొంది. అయితే తూర్పు లఢక్ ప్రాంతం, లేహ్ దీనికి మినహాయింపుగా తెలిపింది. ఇక్కడ కూడా హింస జరుగుతుంటుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. కానీ, నియంత్రణ రేఖ వెంబడి హింస సాధారణం. శ్రీనగర్, గుల్మార్గ్, పహల్గాంల్లో కూడా హింస జరుగుతుందని హెచ్చరించింది.

గగన తలాన్ని మూసివేసిన పాక్

- వాణిజ్య, ద్వైపాక్షిక ఒప్పందాలన్నీ రద్దు

ఇస్లామాబాద్ : పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న చర్యలు, నిర్ణయాలపై పాకిస్తాన్ గురువారం స్పందించింది. ప్రతిగా పలు చర్యలను ప్రకటించింది. భారత్‌కి చెందిన విమానాలేవీ ప్రవేశించకుండా గగనతలానిన మూసివేస్తునట్లు తెలిపింది. ఈ మేరకు ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ) ఒక ప్రకటన జారీ చేసింది. భారత్‌తో గల వాణిజ్య, ద్వైపాక్షిక, గగనతల ఒప్పందాలన్నింటినీ నిలుపుచేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అలాగే 1972 నాటి సిమ్లా ఒప్పందాన్ని కూడా నిలుపు చేసింది. భారత్‌తో గల వాఘా సరిహద్దును తక్షణమే మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మార్గం ద్వారా భారత్ నుండి వచ్చే రవాణా అంతా కూడా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. చట్టబద్ధమైన పత్రాలతో సరిహద్దు దాటిన వారు ఏప్రిల్ 30లోగా వెనక్కి రావాలని గడువు విధించింది. సార్క్ వీసా మినహాయింపు పథకం (ఎస్‌విఇఎస్) కింద భారతీయులకు జారీ చేసిన అన్ని వీసాలను రద్దు చేసింది. వాటి రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటించింది. 48 గంటల్లోగా వారు దేశం వీడాలని పేర్కొంది. అయితే సిక్కు యాత్రికుల వీసాలను మినహాయించింది. అలాగే దౌత్య సిబ్బందిని కూడా 30కి కుదించింది. భారత్ చర్యలపై సమీక్షించేందుకు గురువారం ఇస్లామాబాద్‌లో జరిగిన జాతీయ భద్రతా కమిటీ (ఎన్‌ఎస్‌సి) సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రక్షణ, విదేశాంగ, హోం మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారు, త్రివిధ దళాల చీఫ్‌లు, ప్రభుత్వ, సైనిక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బుధవారం భారత ప్రభుత్వం ప్రకటించిన చర్యలను సమీక్షించింది. ఆ చర్యలను ఏకపక్షమైనవని, అన్యాయమైనవని, రాజకీయ దురుద్దేశపూరితమైనవని వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ ఒప్పందాలను పట్టించుకోకుండా, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలను విస్మరించి భారత్ వ్యవహరించిన ఈ తీరు బాధ్యతారాహితంగా వుందని విమర్శించింది.

మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

611 పోస్టుల భర్తీకి టిడిపి ప్రభుత్వం జిఒ 10ని జారీ చేసింది. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ వెలువడలేదు. ఆదివాసీ ప్రాంతంపై ప్రభుత్వాల ఉదాసీనతకు తోడు అధికారుల అలసత్వంతో ఆదివాసీ ప్రాంతంలో విద్య, సంక్షేమం, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగోన్నతులు లొసుగులమయంగా మారాయి.

జిఒ 3 రద్దుతో తీవ్ర నష్టం

ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీలకు వంద శాతం ఉద్యోగాలు కల్పించే జిఒ 3ని సుప్రీంకోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టివేయడంతో ఉద్యోగ నియామకాల్లో ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతోంది.జిఒ 3కి ప్రత్యామ్నాయం కోసం గత వైసిపి ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. జిఒ 3 రద్దు తరువాత గిరిజన ప్రాంతంలోని కెజిబివిలు, ఏకలవ్య మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయులు, మినిమం టైం స్కేల్ టీచర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను సైతం గిరిజనేతరులతో ప్రభుత్వం భర్తీ చేశారు. తాము అధికారంలోకి వస్తే జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరిస్తామని గత ఏడాది జనవరి 20న అరకులో జరిగిన ఎన్నికల సభలో ప్రతిపక్షనేతగా చంద్రబాబు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌తో ఆదివాసీ నిరుద్యోగులకు తీరని నష్టం జరిగింది. నాడు ఐదవ షెడ్యూల్ పరిధిలో నోటిఫై ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, ఉద్యోగాలు శత శాతం గిరిజనులకే ఇవ్వాలని పేర్కొంటూ జిఒ నెంబర్ 3 అమలు చేశారు. తరువాత రద్దయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిఒ 3కి ప్రత్యామ్నాయంగా ఆదివాసీల ప్రయోజనాలను కాపాడుతూ ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి గిరిజన స్పెషల్ డిఎస్‌సికి వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీ నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే వారు ఇటీవల పాడేరు, హుకుంపేట వంటి ప్రాంతాల్లో ఆందోళనలు చేశారు.

స్పెషల్ డిఎస్‌సితోనే పోస్టులు భర్తీ చేయాలి

గిరిజన స్పెషల్ డిఎస్‌సితోనే ఆదివాసీ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. ఇటీవల ఇచ్చిన మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌తో మాకు దక్కాల్సిన ఉద్యోగాలు దక్కకుండా తీరని నష్టం జరుగుతోంది. జిఒ 3కి ప్రత్యామ్నాయంగా వాటి ప్రయోజనాలను కాపాడుతూ వేరే జిఒ జారీ చేయాలి లేదా ఆదివాసీ షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలి.

ఆర్.రఘు, నిరుద్యోగి, పాడేరు

తాజా నోటిఫికేషన్ నిరాశపర్చింది

2018లో తొలిసారి డిఎస్‌సి రాశాను. ఏడేళ్ల నుంచి మళ్లీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నాను. ఇంటికి దూరంగా ఉంటూ ప్రిపేరవుతున్నాను. ప్రతినెలా కనీసం నాలుగు నుంచి ఐదు వేల రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులుఉన్నా నాపై ఎంతో నమ్మకంతో మా వాళ్లు నన్ను చదివిస్తున్నారు. వారి నమ్మకాన్ని నిజం చేసేందుకు కష్టపడుతున్నాను. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఎస్‌టిలకు తక్కువ పోస్టులు కేటాయించడంతో నిరాశ చెందాను.

-బి.సుందర్ కుమార్, నిరుద్యోగి, పాడేరు

అన్యాయం చేయడం తగదు

తాజా నోటిఫికేషన్‌లో మాకు అన్యాయం జరిగింది. గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులు సాధించవచ్చని ఎంతోమందిమి ఆశతో ఉన్నాం. టిడిపి కూటమి ప్రభుత్వం మమ్మల్ని నిరాశపరిచింది. గత హామీని చంద్రబాబు విస్మరించారు. తక్షణమే గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి.

-గంప సుకన్య, ఎంఎ, బిఇడి, నిరుద్యోగిని, హుకుంపేట

భద్రతా వైఫల్యాల బాధ్యత ఎవరిది?

(మొదటి పేజీ తరువాయి)

నిలబడాలని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒకే గొంతుతో మాట్లాడాలనే ఏకాభిప్రాయం అన్ని రాజకీయ పార్టీల్లో ఉందని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, ఎస్ జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజుతో పాటు బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, డిఎంకె ఎంపి తిరుచ్చి శివ, సిపిఎం ఎంపి బికాష్ రంజన్ భట్టాచార్య, ఎన్‌సిపి ఎంపి ప్రఫుల్ పటేల్, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియా సూలే, ఎస్‌పి ఎంపి రామ్ గోపాల్ యాదవ్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి సంజయ్ సింగ్, ఆర్‌జెడి ఎంపి ప్రేమ్ చంద్ గుప్తా, టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు, వైసిపి ఎంపి పివి మిథున్ రెడ్డి, తృణమూల్ ఎంపి సుదీప్ బందోపాధ్యాయ, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, బిజెడి ఎంపీ సస్మిత్ పాత్ర, శివసేన (షిండే) ఎంపి శ్రీకాంత్ షిండే తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో డేటా లేక్

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్చర్యంగా చూశామని, ఇప్పుడు స్టార్టప్‌లు రూ.30 కోట్లతో ఉపగ్రహాలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ అన్ని విభాగాల్లోనూ కృత్రిమ మేధ, సాంకేతిక వినియోగం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేదిశగా వర్కుషాపు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ అంశంపై ఇప్పటికే 200కుపైగా కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి 9000 మందికిపైగా అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎపి తొలి ఐటి కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 1996లో ఐటి గురించి మాట్లాడిన తొలి సిఎం చంద్రబాబునాయుడేనని అన్నారు. గుడ్ గవర్నెన్స్‌లో ఐటి పాత్ర అత్యంత కీలకమైందని తెలిపారు. ప్రభుత్వ ఐటి సెక్రటరీ కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వర్కుషాపు ఉపయోగపడుతుందని తెలిపారు. వాద్వాని సెంటర్ సిఇఒ ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం తమ సంస్థను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులను ఎఐ ఛాంపియన్లుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి శిక్షణలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

పహల్గాంలో భద్రత విస్మరణ

- ప్రత్యక్ష సాక్షుల వెల్లడి
- ఉగ్రదాడి ఒమర్ సర్కార్ వైఫల్యమంటూ బిజెపి నెపం
- 2019 నుంచి అక్కడి భద్రతా వ్యవస్థపై కేంద్రానిదే పట్టు



శ్రీనగర్‌లోని దాల్ సరస్సు వద్ద పహారా కాస్తున్న కేంద్ర పారామిలటరీ దళానికి చెందిన జవాను

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదదాడి దేశ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా, జమ్మూకాశ్మీర్ ప్రజలు భయం గుప్పిట్లో ఉంటున్నారు. రాజకీయంగానూ ఇది తీవ్ర చర్చకు దారి తీస్తున్నది. ఎందుకంటే.. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కలిగించే ఆర్టికల్ 370 రద్దును కేంద్రంలోని మోడీ సర్కారు అప్పట్లో ఒక పెద్ద విజయంగా చెప్పుకున్నది. ఉగ్రవాదం తగ్గుదలను చూసిందని గణాంకాలు చెప్పింది. ప్రస్తుత పహల్గాం ఉగ్రదాడితో మోడీ సర్కారు వాదనలకు పెద్ద ఎదురుదెబ్బ తాకినట్టయ్యింది. ఈ దాడి భద్రతా వైఫల్యం కారణంగానే జరిగిందని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి నుంచి జవాబుదారీతనాన్ని కోరుతున్నారు.

'బిజెపి మీడియా' తప్పుడు ప్రచారాలు

బిజెపి అనుకూల సోషల్ మీడియా మాత్రం ఉగ్రదాడిని మరొక కోణంలో ప్రచారం చేస్తున్నది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకాశ్మీర్ రెండు కేంద్ర పాలిత ప్రాంతా(యుటి)లుగా విడిపోయిందని, లెఫ్టినెంట్ గవర్నర్ల ద్వారా అక్కడ కేంద్ర పాలనలో శాంతియుతంగా ఉందని, అయితే జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడి నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధికారంలోకి రావడం..ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి కావడం తదనంతర పరిణామాల వల్లే ప్రస్తుత పరిస్థితి తలెత్తిందని బిజెపి మీడియా తప్పుడు కథనాలు వండివార్చుతోంది. ఉగ్రదాడికి ఒమర్ అబ్దుల్లా పాలనే కారణమంటూ కేంద్రం బాధ్యతను తప్పించేందుకు కుటిల యత్నాలు చేస్తోంది.

వాస్తవానికి జమ్మూకాశ్మీర్ రాష్ట్రంగా ఉన్నప్పుడు సైన్యంతో సహా శాంతి భద్రతలు ముఖ్యమంత్రి నేతృత్వంలోని ఏకీకృత హైకమాండ్ కింద ఉండేది. కానీ, కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రస్తుతం మారిన జమ్మూకాశ్మీర్‌లో భద్రతా వ్యవస్థ కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నరు నేతృత్వంలోనే ఉంటుంది. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్నికైన ప్రభుత్వానికి శాంతిభద్రతలు, భద్రతా వ్యవస్థపై అధికార పరిధి లేదు.

కాశ్మీర్ లోయలోని నిఘా సంస్థలు కేంద్ర ప్రతినిధి ఎల్జీ మనోజ్ సిన్హాకు నివేదిస్తాయి. ఆర్టికల్ 370 రద్దు పేరుతో 2019 నుంచి కేంద్రం జమ్మూకాశ్మీర్‌లోని భద్రతా వ్యవస్థపై తన పట్టును పెంచుకున్నది. 2024లో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జమ్మూకాశ్మీర్ పోలీసుల బడ్జెట్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్నది. గతంలో ఒక రాష్ట్రంగా జమ్మూకాశ్మీర్‌లో ఒక లక్షకు పైగా ఉన్న పోలీసులు తమ జీతాలు, పెన్షన్‌ను రాష్ట్ర బడ్జెట్ నుంచి తీసుకునేవారు. 2019 నుంచి ఇక్కడ పోలీసులు కేంద్రం నియంత్రణలో ఉన్నారు. వాస్తవానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా భద్రతా సమీక్ష సమావేశాలను నిర్వహించారు. దాని నుంచి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను మినహాయించటం కూడా గమనార్హం. జమ్ముకాశ్మీర్‌లో శాంతిభద్రతల విఘాతానికి కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

బైసరన్‌కు భద్రతేది?

లోయలోని పర్యాటక ప్రదేశాలను సాధారణంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), సశస్త్ర సీమా బల్, జమ్మూకాశ్మీర్ పోలీసులు వంటి పారామిలిటరీ దళాలు పహారా కాస్తాయి. భద్రతను అందిస్తాయి. అయితే, ముష్కరుల దాడి జరిగిన మంగళవారం నాడు బైసరన్‌లో ఎలాంటి బలగాలూ లేవని చాలా మంది ప్రత్యక్ష సాక్షులు చెప్తుండటం గమనార్హం. ఈ పరిస్థితి ఉగ్రవాదులకు మంచి అవకాశాన్ని కల్పించినట్టయ్యిందనీ, అమాయకుల ప్రాణాలు తీసి అక్కడి నుంచి స్వేచ్ఛగా తప్పించుకున్నారు. ఉగ్రదాడి తర్వాత ఘటనాస్థలికి మొదట స్థానికులు వచ్చారనీ, భద్రతా దళాలు కావని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఆ ప్రాంతంలో భద్రతా దళాల ఉనికి ఉంటే ఒకవేళ ఉగ్రదాడి జరిగినా.. ప్రమాద తీవ్రత తక్కువగా ఉండేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

దాడి సమయంలో అక్కడ 500-600 మంది పర్యాటకులు ఉన్నారని సమాచారం. గతంలో పహల్గామ్‌లో ఉగ్రదాడుల చరిత్ర ఉన్నది. అయినప్పటికీ.. అక్కడ భద్రతా దళాలను ఎందుకు మోహరించకపోవటంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది. అమర్‌నాథ్ మందిరం నుంచి 50 కిలో మీటర్ల దూరంలోనే ఉన్న ప్రమాద ప్రదేశం ఇంతటి తీవ్రమైన ఉగ్రదాడికి గురవటం పట్ల ఆందోళన కలుగుతున్నది.

ఉగ్రదాడిని ఖండించిన ఎఐకెఎస్

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడిని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజల కుటుంబాలకు హృదయపూర్వక సంతాపాన్ని ప్రకటించింది. ఈ దాడిలో గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వ్యక్తులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. బాధితుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. జమ్మూకాశ్మీర్‌లో పోలీసుల్ని, భద్రతా దళాలను నియంత్రిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ క్రూరమైన దాడిపై సమర్థవంతంగా దర్యాప్తు చేసి దోషుల్ని అరెస్టు చేయాలని కూడా ఎఐకెఎస్ విజ్ఞప్తి చేసింది. దాడిపై అన్ని కోణాలను పరిశోధించాలని తెలిపింది. అలాగే సైనిక రంగంలో అనుభవజ్ఞులు, క్షేత్రస్థాయిలో అనుభవం ఉన్న ఇతర నిపుణులు ప్రస్తావిస్తున్న తీవ్రమైన భద్రతా లోపాలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. అలాగే, ఉగ్రదాడి సమయంలో బాధితులకు మద్దతు, సహాయం ఇవ్వడానికి కాశ్మీరీ సమాజం ముందుకు వచ్చిందని ఎఐకెఎస్ పేర్కొంది. అయితే కొంత మంది ఈ విషాదాన్ని ఉపయోగించి సమాజంలో మతపరమైన విభజనలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని ఎఐకెఎస్ విమర్శించింది.

'ముద్రాపోర్టు' హెరాయిన్‌కు ఎల్ఇటితో లింక్

- సుప్రీంకోర్టులో ఎన్ఐఎ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఇతర బిజెపి పెద్దలకు అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీ గ్రూపునకు చెందిన గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో గతంలో పట్టుబడిన డ్రగ్స్‌కు పాక్ కేంద్రంగా పనిచేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థ 'లష్కరే ఎ తోయిబా' (ఎల్ఇటి)కి సంబంధమున్నట్లున్న జాతీయ నిఘా సంస్థ (ఎన్ఐఎ) వెల్లడించింది. 2021 సెప్టెంబర్‌లో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ).. ముంద్రా పోర్టులో 2988 కిలోల హెరాయిన్ సరుకును స్వాధీనం చేసుకుంది. దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఎల్ఇటి ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులుగా సమకూర్చటానికి ఉపయోగించారని ఎన్ఐఎ సుప్రీంకోర్టుకు నివేదించింది. దీంతో దేశంలో గుట్టు చప్పుడు కాకుండా జరిగే మాదకద్రవ్యాల సరఫరా విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఎన్ఐఎ తరఫున వాదనలు వినిపించారు. ఈ కేసులో కీలక నిందితుడు ఢిల్లీకి చెందిన హర్‌ప్రీత్ సింగ్ తల్వార్ అలియాస్ కబీర్ తల్వార్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ తన వాదనలను న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కె సింగ్‌లతో కూడిన ధర్మాసనం ముందు వినిపించారు. ఈ కేసులో కీలక సాక్షుల్లో ఒకరైన రిటైర్డ్ కస్టమ్స్ అధికారి అనుమానాస్పద స్థితిలో చనిపోయారని ఎఎస్‌జీ చెప్పారు. నిందితుడు తల్వార్ తరఫున సీనియర్ న్యాయవాది సిఎ సుందరం వాదించారు. హెరాయిన్ స్మగ్లింగ్ ఆరోపణలతో ఆయనకు సంబంధం ఉన్నదని చెప్పటానికి ఎలాంటి ఆధారాలూ లేవని ధర్మాసనానికి వివరించారు. ఇరువైపులా వాదనాలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. తన తీర్పును రిజర్వ్ చేసింది.

జర్నలిస్ట్‌పై బిజెపి కార్యకర్తల దాడి

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి విషయంలో వచ్చే పలు అనుమానాలు, ప్రశ్నలను బిజెపి నాయకులు, కార్యకర్తలు సహించలేకపోతున్నారు. ఈ విషయంలో ప్రశ్నలు సంధించిన జర్నలిస్టులపైనా కాషాయ మూకలు దాడికి దిగుతున్నారు. జమ్మూకాశ్మీర్‌లోని కథువా జిల్లాలో బిజెపి చేపట్టిన నిరసనలను కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించడంతో అక్కడి బిజెపి కార్యకర్తలు వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ నిరసనల్లో బిజెపి శాసనసభ్యులు దేవిందర్ మాన్యాల్, రాజీవ్ జస్రోటియా, భరత్ భూషణ్ పాల్గొన్నారు. ముష్కరుల దాడికి దారి తీసిన భద్రతా లోపాల గురించి జర్నలిస్టు రాకేశ్ శర్మతో పాటు ఇతర జర్నలిస్టులు కూడా ప్రశ్నలు లేవనెత్తారు. ఇలా అడగటాన్ని జీర్ణించుకోలేని బిజెపి ఎమ్మెల్యేలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జర్నలిస్టులు వేర్పాటువాద భాషను మాట్లాడుతున్నారని బిజెపి నేత హిమాన్షు శర్మ ఆరోపించారు. దీనిపై జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆగ్రహానికి గురైన బిజెపి కార్యకర్తలు రాకేశ్ శర్మపై దాడి చేశారు. ప్రస్తుతం ఈ దాడికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ దాడి నుంచి డిఎస్‌పి రవీందర్ సింగ్ తనను కాపాడారనీ, ఆ తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారని బాధితుడు రాకేశ్ శర్మ తెలిపారు.

సంక్షేమ బోర్డులను పునరుద్ధరించాలి

- రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా రొడ్డెక్కారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని నినదించారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందుతున్న సహాయాన్ని నిలిపివేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో లక్షలాది మంది కార్మికులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే సంక్షమ బోర్డును పునరుద్ధరిస్తామని టిడిపి కూటమి నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

విశాఖలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దగల లలిత జ్యూయలర్స్ సెంటర్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ భవన నిర్మాణ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. వారినుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం వెల్ఫేర్ బోర్డును టిడిపి కూటమి ప్రభుత్వం పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఏలూరులోని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రమణారావు మాట్లాడారు. కార్మికులకు సంక్షేమ పథకాల అమలుకు ఆటంకంగా ఉన్న 1412 మెమోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆస్పత్రి సెంటర్ వరకూ నిరసన ర్యాలీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని కార్మిక శాఖ ఉప కమిషనర్ కార్యాలయం ఎదుట, తిరుపతి, విజయనగరం కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ అలంకార్ సెంటరులోని ధర్నాచౌక్, కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ధర్నా చౌక్‌ల వద్ద కార్మికులు ఆందోళనలు చేపట్టారు.

ప్లకార్డులు చేతబట్టి తమ సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు నుండి దొడ్డి దారిలో తీసుకున్న డబ్బులను తిరిగి బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని గాంధీ పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. గుంటూరు అరండల్‌పేటలోని డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే భవన నిర్మాణ కార్మికులు ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.





విశాఖలో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు , శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

విడదల రజని మరిది అరెస్టు

- అవినీతి ఆరోపణలపై ఎసిబి విచారణ
- స్టోన్ క్రషర్స్ నుంచి రూ.2.20 కోట్ల లంచం తీసుకున్నట్టు కేసు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి



విడదల గోపి (ఫైల్ ఫొటో)

మాజీ మంత్రి విడదల రజని మరిది విడదల గోపిని ఎసిబి అధికారులు గురువారం హైదరాబాద్‌లో అరెస్టు చేసి తాడేపల్లి ఎసిబి కార్యాలయానికి తరలించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం విశ్వనాధుని కండ్రికలో లక్ష్మీ బాలజీ స్టోన్ క్రషర్ యజమాన్యం నుంచి రూ.2.20 కోట్ల ముడుపులు తీసుకున్నారని వచ్చిన ఆరోపణలపై ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. విడదల రజినితోపాటు గతంలో గుంటూరులో విజిలెన్సు జిల్లా అధికారిగా పనిచేసిన జాషువా, రజని మరిది గోపి, పిఎ డి.రామకృష్ణ తదితరులపై స్టోన్ క్రషర్ యజమానుల ఫిర్యాదు చేయగా ఎసిబి అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తొలుత విజిలెన్సు అధికారులు దర్యాప్తు చేయగా తరువాత ఈ కేసులో అవినీతి జరిగిందని ప్రాథమిక నిర్ధారణ రావడంతో కేసును ఎసిబికి అప్పగించారు. టిడిపి కూటమి ప్రభుత్వం రాగానే స్టోన్ క్రషర్ యజమానులు చలపతిరావు, శ్రీనివాసరావుల ఫిర్యాదు మేరకు తొలుత విజిలెన్సు విచారణ జరిగింది. ఈ విచారణలో అవినీతి జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు ఉండడంతో విజిలెన్సు అధికారుల నివేదిక మేరకు ఎసిబి విచారణకు ప్రభుత్వం గత మే 22న ఆదేశించింది. ఈ కేసులో విడదల రజనితోపాటు ఐపిఎస్ అధికారి జాషువా, ఆమె మరిది గోపి, డి రామకృష్ణలను నిందితులుగా పేర్కొంటూ ఎసిబి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో తొలి విడత విడదల గోపిని అరెస్టు చేశారు. తొలుత అప్పటి మంత్రి పిఎగా ఉన్న డి.రామకృష్ణ, విజిలెన్సు ఎస్‌పి కలిసి స్టోన్ క్రషర్ యజమానులను బెదిరించినట్టు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా స్టోన్ క్రషర్స్ నిర్వహణలో లోపాలు ఉన్నాయంటూ విజిలెన్సు జిల్లా అధికారి జాషువా వీటిని తనిఖీకి వెళ్లారు. ఇందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోలేదని,. తనిఖీ పూర్తయిన తరువాత ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదని జాషువాపై కేసు నమోదైంది. రామకృష్ణ స్వయంగా బెదిరించారని ఆధారాలను దర్యాప్తులో సేకరించినట్లు అధికారులు చెప్తున్నారు. విడదల గోపి వచ్చి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదుదారులు తగిన ఆధారాలు చూపడంతో ఎసిబి కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం వీరంతా హైకోర్టును ఆశ్రయించినా ఇంకా బెయిల్ రాలేదు. గోపిని గురువారం అరెస్టు చేసి విజయవాడ ఎసిబి కోర్టులో హాజరు పరిచామని ఎసిబి అధికారులు తెలిపారు.

గోరంట్ల మాధవ్‌కు రిమాండ్ పొడిగింపు

- ముగిసిన పోలీసు కస్టడీ

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్ పై దాడి చేసిన, పోలీసులు విధులకు ఆటంకం కలిగించిన కేసుల్లో అరెస్ట్ అయిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రెండు రోజుల పోలీసు కస్టడీ గురువారం ముగిసింది. పోలీసుల అంతర్గత విచారణ అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన్ను స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరు పర్చగా కోర్టు ఆయనకు మరో 14 రోజుల రిమాండ్ విధించింది. తొలుత ఈనెల 11న ఆయన్ను పోలీసులు కోర్టులో హాజరు పర్చగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

తరువాత ఆయన్ను ఐదు రోజుల కస్టడీకి పోలీసులు పిటీషన్ దాఖలు చేయగా రెండు రోజుల కస్టడీకి పోలీసులకు అనుమతి ఇచ్చారు. ఈమేరకు బుధవారం రాజమండ్రి జైలు నుంచి అదుపులోకి తీసుకున్న గుంటూరు పోలీసులు రెండు రోజుల పాటు విచారించారు. గోరంట్ల మాధవ్‌తోపాటు ఈ కేసులో అరెస్టు అయిన మరో ఐదుగురిని కూడా విచారించారు. విచారణ అనంతరం మాధవ్‌తో సహా ఆరుగురు నిందితులను తిరిగి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారు.

వక్ఫ్ చట్ట సవరణపై నిరసనాగ్రహం

- రద్దు చేయాలని ఆదోనిలో భారీ ప్రదర్శన
- మద్దతు తెలిపిన సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- ఆదోని (కర్నూలు జిల్లా), శ్రీకాకుళం

వక్ఫ్ చట్ట సవరణను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఆందోళనలు కొనసాగాయి. జాతీయ జెండాలు, నల్ల జెండాలతో కర్నూలు జిల్లా ఆదోనిలో తిక్కస్వామి దర్గా నుండి పోలీస్ కంట్రోల్ రూమ్ మీదుగా సబ్‌కలెక్టరేట్ వరకూ ముస్లిములు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు అందజేశారు. వీరి నిరసనకు సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ అల్లాబకష్, షేక్ జిక్రియా, ధూల్ షా పహల్వాన్ మసీదు ముతవల్లి మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సమంజసం కాదని తెలిపారు ముస్లిములే టార్గెట్‌గా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ప్రకటించడం దురదృష్టకరమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ముస్లిములకు, దళితులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిముల హక్కుల సాధనకు భవిష్యత్తులో చేపట్టే ఆందోళన కార్యక్రమాలకూ సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి హాజరై సంఘీభావం ప్రకటించారు. ముస్లిములకు అండగా ఉంటామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, అడ్వకేట్ మన్సూర్ అహ్మద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హల్తాఫ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఆదోనిలో నిర్వహిస్తున్న ర్యాలీ

వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ శ్రీకాకుళంలో ముస్లిం మైనార్టీ సంఘాల జెఎసి, పౌర, ప్రజాసంఘాల ఆధ్వర్యాన జాతీయ జెండాలో డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్ల కూడలి, జిల్లా పరిషత్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె మోహనరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తాండ్ర ప్రకాష్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, పలు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

'ఉక్కు' దీక్షలకు షర్మిల మద్దతు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



షర్మిలకు వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1533వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరానికి పిసిసి అధ్యక్షులు షర్మిల విచ్చేసి కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆమెకు ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తోందని, కార్మికులకు పోరాట సమయంలో ఇచ్చిన ఏ హామీనీ నెరవేర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా అరకొర జీతాలనే ఉక్కు కార్మికులకు చెల్లిస్తున్నారని షర్మిలకు తెలిపారు. అత్యంత శ్రమకోర్చి కార్మికులు ఉత్పత్తిలో భాగస్వాములవుతున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దుందుడుకుగా ముందుకెళ్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, రమణమూర్తి, ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘాల ప్రతినిధులు నమ్మి రమణ, మంత్రి రవి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

హామీల అమల్లో కూటమి వైఫల్యం

- మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి
- వైసిపి ప్రజాప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



కూటమి పాలకులు ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల వైసిపి ప్రజాప్రతినిధులతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడారు. హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే భయం పట్టుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నిటినీ పూర్తిగా విధ్వంసం చేశారని, కూటమి పాలనలో వ్యవసాయం, విద్య, వైద్య రంగాలు నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. అధికారం చేపట్టిన ఏడాదిలో నాలుగు లక్షల పెన్షన్లు కట్ చేశారని, రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని అన్నారు. గుడి, బడిపక్కనే బెల్టుషాపులు ఏర్పాటు చేశారని, ఇష్టం వచ్చిన రేట్లకు మద్యం అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు యుద్ధవాతావరణంలో బతుకుతున్నారని, దుర్మార్గమైన రెడ్‌బుక్ పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అంత సులువు కాదని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బలం లేకపోయినా టిడిపి పోటీకి దిగిందని, గతంలో చంద్రబాబును చంద్రగిరిలో ఓడించారని పేర్కొన్నారు. ఆ ఓటమితో కుప్పం పారిపోయారని అన్నారు. అమరావతి నిర్మాణ టెండర్లలో అవినీతి జరిగిందని, చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారని పేర్కొన్నారు.

'పిపిఎ'లపై జ్యుడీషియల్ విచారణ

- సెకి ఒప్పందంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు, ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి సంస్థల మధ్య జరిగిన అన్ని విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు (పిపిఎ), సరఫరా ఒప్పందాలు(పిఎస్ఎ)పై సుప్రీంకోర్టు, లేదా హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యాన జ్యుడీషియల్ కమిటీ వేసి లోతైన దర్యాప్తు జరపాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) - అదానీ - విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య జరిగిన ఒప్పందంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, సీనియర్ ఐపిఎస్ అధికారితో పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లో ఐదేళ్లకు మించి మెగా విద్యుత్ ఒప్పందాలు చేసుకోకూడదని తెలిపారు.

ఐదేళ్ల తరువాత భవిష్యత్ తరాలపై ప్రభావం చూపే అన్ని ప్రభుత్వ నిర్ణయాలపై ఏకాభిప్రాయం సాధించాలని, ప్రజాక్షేత్రంలో విస్తృత చర్చ జరిగిన తరువాతే ముందుకెళ్లాలని కోరారు. ప్రతిపక్షంలో ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత తప్పించుకుంటోందన్నారు. ఒప్పందం రద్దు వల్ల పెట్టుబడిదారుల్లో నమ్మకం పోతుందని చెబుతూ ప్రజలపై భారాలు మోపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధమవడం సరికాదన్నారు. 'సెకి - అదానీ ఒప్పందం నుంచి రాష్ట్రాన్ని కాపాడాలి' అనే అంశంపై సెంటర్ ఫర్ లిబర్టీ (సిఎఫ్ఎల్) ఆధ్వర్యాన విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో గురువారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి సిఎఫ్ఎల్ ఛైర్మన్ ఎన్ చక్రవర్తి అధ్యక్షత వహించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ సెకి ఒప్పందంలో అవినీతి జరిగిందని అమెరికాలో కేసు నమోదైనా ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అదానీ ఒప్పందాల్లో అవినీతి జరిగిందని కెన్యా, శ్రీలంక వంటి దేశాలు వాటిని రద్దు చేసుకున్నాయని, దేశంలో మాత్రం అలాంటి చర్యలు లేవని అన్నారు. జగన్ ప్రభుత్వ అవినీతిని మొన్నటి వరకు ప్రధాని నరేంద్రమోడీ కాపాడితే ప్రస్తుతం రాష్ట్రంలోని టిడిపి కూటమి కాపాడుతోందని అన్నారు. ఒక పక్క సెకి ఒప్పందం, మరోపక్క స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లతో విద్యుత్ రంగాన్ని అదానీకి అప్పగిస్తున్నారని విమర్శించారు.

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి పివి రమేష్ మాట్లాడుతూ సెకి అవినీతిపై నిగ్గు తేల్చేందుకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తిల్లో ప్రభుత్వ పెట్టుబడి తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం వల్ల పంపిణీ సంస్థలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయని చెప్పారు. ప్రస్తుతం లాభాల్లో ఉన్న ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ నాయకులు, అధికారులు అవినీతి చేస్తూ ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారని అన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను వికేంద్రీకరణ చేయాలని, రైతులే వీటిని ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు కొలను కొండ శివాజి మాట్లాడుతూ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. సిపిఐ నాయకులు రవీంద్రనాథ్ మాట్లాడుతూ సెకి ఒప్పందం రద్దు కోసం రూ.2,900 కోట్లు పెనాల్టీ చెల్లించాలనేది అర్థరహిత వాదన అని అన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలోని బిజెపికి ఊడిగం చేస్తు న్నాయని విమర్శించారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్, బిఎస్‌పి నాయకులు పుష్పరాజ్, జన చైతన్యవేదిక నాయకులు లక్ష్మణరెడ్డి, పౌరసంఘం నాయకులు లక్ష్మీనారాయణ, ఖాన్ యదాని, భవాని ప్రసాద్, ఒపిడిఆర్ నాయకులు భాస్కర్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శిపై ఉండి ఎమ్మెల్యే వ్యాఖ్యలు దారుణం

- నేడు పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నిరసనలకు పిలుపు : గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా సిపిఎం చేస్తున్న న్యాయమైన పోరాటంపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించిన తీరు చాలా దారుణమని సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ గట్లపై ఉన్న పేదల వల్లే నీరు కలుషితమవుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఆయన కోరినట్లుగానే ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీ వేసి పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు గోపాలన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇళ్లు కట్టిస్తామని ప్రభుత్వం చెబుతుంటే... ఇళ్లను కూల్చే పనిలో రఘురామకృష్ణరాజు బిజీగా ఉన్నారని, ప్రభుత్వం ఆయన్ను నియంత్రిస్తుందా? లేదా? అనేది తేల్చాలని పేర్కొన్నారు. కూల్చిన ఇళ్లకు ప్రత్యామ్నాయం చూపించామని చెబుతున్నారని, ఆ వివరాలు బహిర్గతం చేయాలని కోరారు. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిపై ఆయన వాడిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, ఆయన తిట్లు, శాపనార్థాల వల్ల కమ్యూనిస్టులకు పోయేదేమీ లేదని తెలిపారు. ఎమ్మెల్యే అసలు రూపమేమిటో ప్రజలకు అర్థమవుతుందన్నారు. తిట్టినా, చంపినా కమ్యూనిస్టులు బెదిరిపోరని, పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాడతారని తెలిపారు. రఘురామకృష్ణరాజు భాష, అహంకారపూరిత వైఖరిని నిరసిస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలు, పట్టణాల్లో నిరసనలు, ఆందోళనలు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కాశ్మీర్‌ను కాపాడుకోవాలి

- రాష్ట్రవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు
- ఉగ్రవాదానికి మతం రంగు పులమొద్దు : వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

జమ్మూ కాశ్మీర్‌ను కాపాడుకోవాలని, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. టెర్రరిస్టుల కాల్పుల్లో 26 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, అమాయకమైన ప్రజలను ఇలా ఉగ్రవాదులు హతమార్చడం హేయమైన చర్య అన్నారు. దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తోందని, వారి కుటుంబాలకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతకంగా ఈ చర్యలను ఖండించాలని, దేశ ప్రజలంతా ఒకతాటిపైకి వచ్చి ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న చర్యలు ఏ మాత్రమూ సరిపోవన్నారు. కాశ్మీర్‌లో భద్రత సరిగా లేదని విమర్శించారు. ఉగ్రవాద వ్యతిరేక ఉద్యమం నిర్మించాలని, దీనికి మతం రంగు పులమకూడదన్నారు. ఉగ్రవాదానికి మతం, కులం, లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఉగ్రదాడిని నిరసిస్తూ తిరుపతిలో రాజ్యాంగపరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు పాల్గొన్నారు. విజయవాడ లెనిన్ సెంటరులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. విశాఖలో కొవ్వొత్తుల జంక్షన్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండించారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో గాంధీ బొమ్మ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రవాదం నశించాలి, మత సామరస్యాన్ని కాపాడాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు నినదించారు. విజయనగరం కోట జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం, కొమరాడలో ర్యాలీ నిర్వహించారు. కర్నూలు సుందయ్య సర్కిల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ర్యాలీ నిర్వహించారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నూజివీడులో సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.



మధుసూదన్‌రావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు

ఉగ్రవాద దాడుల్లో మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కావలి (నెల్లూరు జిల్లా)

కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడుల్లో మృతి చెందిన కావలి వాసి సోమిశెట్టి మధుసూదన్‌రావు కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. గురువారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలోని మధుసూదన్‌రావు ఇంటికెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మధుసూదన్‌రావు చిత్రపటానికి పూలమాలేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టూరిస్టులకు రక్షణ కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఉగ్రవాద దాడిని ఆయన ఖండించారు. ఈ కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మూలె వెంగయ్య, మంగళ పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్‌బీ, పసుపులేటి పెంచలయ్య, సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, కెవిపిఎస్ నాయకులు జాన్, తదితరులు ఉన్నారు.

భద్రతా వైఫల్యం

- పహల్గాం ఘటనపై మాజీ మంత్రి వడ్డే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భద్రతా వైఫల్యం వల్లే పహల్గాంలో ఉగ్రదాడి జరిగిందని, ముందస్తు సమాచారం ఉన్నా భద్రతా దళాలు తగు బందోబస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఉగ్రవాదులు కాల్పులు జరిపారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం వద్ద పెద్ద సంఖ్యలో మిలటరీ హెలికాప్టర్లు ఉన్నాయని వాటిల్లో సైనికులను పంపాలని అప్పటి జమ్మూకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చెప్పినా కేంద్రం పెడచెవిన పెట్టిందని గుర్తు చేశారు. ఫలితంగా పుల్వామా వద్ద దాడి జరగడం అనంతరం జరిగిన ఎన్నికల్లో బిజెపి గెలవడం వెంట వెంటనే జరిగాయని పేర్కొన్నారు. కేంద్రం తెచ్చిన సిఎఎ, ఎన్ఆర్‌సి, వక్ఫ్ ఎమెండ్‌మెంట్ చట్టం, బుల్డోజర్ల విన్యాసాలు పరిస్థితులను సహజంగా పాకిస్థాన్ ఉపయోగించుకుని భారత్‌లో అశాంతిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అడవులను అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను ఆదివాసీలను, షెడ్యూలు తెగల ప్రజలను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వారికి మావోయిస్టులని ముద్రవేసి ఆపరేషన్ ఖగార్ పేరుతో వందలమందిని కాల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లోలిత కాశ్మీర్లో యాత్రికులకు రక్షణగా సైన్యాన్ని తోడు పంపించకపోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఇకనుండైనా జమ్ము, వైష్ణోదేవి, కాశ్మీర్ ఛార్‌దామ్, మానస సరోవరం, ఇతర పుణ్యక్షేత్రాల సందర్శకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు.

మానవత్వానికి మచ్చ : లక్ష్మణరెడ్డి

కాశ్మీర్లో ఉగ్రదాడి మానవత్వానికి మాయని మచ్చని జన చైతన్యవేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఇలాంటి దాడుల వల్ల కాశ్మీర్‌కు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రపంచదేశాలు భారత్‌కు మద్దతు పలకడం అభినందనీయమని అన్నారు.

ఉపాధి వేతనంలో విజయనగరం లీస్ట్

- ఏప్రిల్ 1 నుంచి 21 వరకు సరాసరిన రూ.172
- గతేడాదితో పోలిస్తే రూ.52 తగ్గుదల
- ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలోనే అతి తక్కువ ఉపాధి వేతనం అందుకుంటున్న జిల్లాగా విజయనగరం, ఎక్కువ వేతనం అందుకుంటున్న జిల్లాగా కోనసీమ గుర్తింపు పొందాయి. ఏప్రిల్ ఒకటి నుంచి 21వ తేదీ వరకు సరాసరి వేతనం పరిశీలిస్తే విజయనగరం జిల్లాకు రూ.172.2 లభించింది. గతేడాదితో పోలిస్తే ఒకేసారి రూ.54 తగ్గిపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది మధ్య సమన్వయం లోపించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

రాష్ట్రంలో 70.39 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఆయా కుటుంబాల్లో కోటికిపైగా కార్మికులు ఉపాధి పనులపై ఆధారపడ్డారు. కొన్ని కుటుంబాలకైతే ఉపాధి హామీ పనులే జీవనాధారంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో ఈ చట్టం అమల్లోకి వచ్చాక వలస కుటుంబాల సంఖ్య కొంతమేర తగ్గిందనడంలో సందేహం లేదు. ఏటా వంద రోజుల పనిదినాలు ఉపయోగించుకుంటున్న జిల్లాల్లో విజయనగరం అగ్రస్థానంలో ఉంది. ఇందులో భాగంగానే ఎన్నో జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు, రివార్డులు కూడా అధికారులు అందుకున్నారు. ఏటా లక్ష్యానికి మించి పనులు చేపట్టిన విజయనగరం జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 1.81 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా 1.70 కోట్ల పనిదినాలకే పరిమితమైంది. ఈ ఏడాది ప్రారంభంలోనే పని కల్పనతోపాటు వేతనాలు గిట్టుబాటు అయ్యేవిధంగా కార్మికులను ప్రోత్సహించడంలోనూ అధికార యంత్రాంగం విఫలమైంది. సాధారణంగా ఈ జిల్లాలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు (మొదటి త్రైమాసికం) 40 శాతం పనులు జరుగుతాయి. ఈ లెక్కన ఏప్రిల్ నెలలో 53.85 లక్షల పనిదినాలు కల్పించాలని అధికారులు లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 8.47 లక్షల పనిదినాలు మాత్రమే కల్పించారు. ఇంకా 45.38 లక్షల పనిదినాలు పది రోజుల్లో పూర్తిచేయాల్సి వుంది. దీన్ని బట్టి ఈ ఏడాది ఆరంభం నుంచే పని కల్పనలో వెనుకబాటు కనిపిస్తోంది. పని కల్పనలో ఒకటి లేదా రెండవ స్థానంలో ఉండే జిల్లా ప్రస్తుతం ఏడవ స్థానానికి పడిపోయింది. మరోవైపు ప్రభుత్వం లెక్కల ప్రకారం రోజువారీ వేతనం రూ.307 అందాల్సివుండగా, జిల్లా సరాసరి వేతనం రూ.172.2కు పరిమితమైంది. 2024-25లో సరాసరి వేతనం రూ.226.15 చొప్పున వేతనాలు అందాయి. తాజా లెక్కల ప్రకారం గతేడాదితో పోలిస్తే రూ.54 తగ్గింది.


ఉపాధి పనులు చేస్తున్న కార్మికులు

అంతకు ముందు 2023-24లో 229.43, 2022-23లో రూ.207.86, 2021-22లో రూ.208.63, 2020-21లో రూ.238.13 చొప్పున సరాసరి వేతనాలు అందినట్టు డ్వామా రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మూడేళ్ల క్రితం వరకు విజయనగరం జిల్లాలో అంతర్ భాగంగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా వేతనం కూడా ప్రస్తుతం రూ.260గా ఉంది. శ్రీకాకుళంలో రూ.232 వేతనం ఉంది. అత్యధికంగా కోన సీమ జిల్లాలో రూ.294, ఎన్‌టిఆర్ జిల్లాలో రూ.293, అల్లూరి జిల్లాలో రోజువారీ వేతనం రూ.290 చొప్పున కనిపిస్తోంది. ఇది కూడా కష్టానికి తగిన ఫలితం కాదంటూ ఉపాధి కార్మికులు గగ్గోలు పెడుతున్న తరుణంలో జిల్లాలో రూ.172కు పడిపోవడం ఇక్కడి కార్మికులను కలవర పెడుతోంది. వేతనం పెంపుదలకు కృషి చేస్తామని డ్వామా పిడి శారదదేవీ తెలిపారు.

ఏప్రిల్ ఒకటి నుంచి 21వ తేదీ వరకు వేతనం

జిల్లా పేరు	రోజువారీ వేతనం	జిల్లా పేరు	రోజువారీ వేతనం
కోనసీమ	రూ.294	బాపట్ల	రూ.273
ఎన్‌టిఆర్	రూ.293	అన్నమయ్య	రూ.272
అల్లూరి సీతారామరాజు	రూ.290	చిత్తూరు	రూ.272
తిరుపతి	రూ.284	కర్నూలు	రూ.265
పశ్చిమగోదావరి	రూ.284	వైఎస్ఆర్	రూ.264
కృష్ణా	రూ.283	నంద్యాల	రూ.262
ఏలూరు	రూ.281	విశాఖపట్నం	రూ.261
సత్యసాయి	రూ.281	పార్వతీపురం మన్యం	రూ.260
అనంతపురం	రూ.280	ప్రకాశం	రూ.244
అనకాపల్లి	రూ.278	గుంటూరు	రూ.243
తూర్పుగోదావరి	రూ.278	నెల్లూరు	రూ.241
పల్నాడు	రూ.277	శ్రీకాకుళం	రూ.232
కాకినాడి	రూ.274	విజయనగరం	రూ.172

తిరుమలలో ముమ్మర తనిఖీలు

- ఆక్టోపస్ బలగాల మాక్‌డ్రిల్

ప్రజాశక్తి -తిరుమల

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఉగ్రవాదుల ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలను దృష్టిలో పెట్టుకున్న టిటిడి యంత్రాంగం భద్రతను పెంచింది. అలిపిరి నుంచి ఆలయం వరకు భద్రతను కట్టుదిట్టం చేసింది. అలిపిరి తనిఖీ కేంద్రంతో పాటు ఘాట్ రోడ్డులోనూ చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసింది. ప్రయాణికుల లగేజీతో పాటు ప్రతి బ్యాగ్‌ను సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. టిటిడి సివిఎస్ఓ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ.. తిరుమలలోని అన్ని ప్రాంతాల్లో అధునాతన టెక్నాలజీతో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టామన్నారు. మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆక్టోపస్ బలగాలు మాక్‌డ్రిల్ నిర్వహించాయన్నారు. మాక్ డ్రిల్‌లో పోలీసు, విజిలెన్స్, ఆక్టోపస్ బలగాలు పాల్గొన్నాయని తెలిపారు.

ఫోన్‌పేలో పసిడి ఆఫర్లు

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పేలో అక్షయ తృతీయ సందర్భంగా 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన డిజిటల్ గోల్డ్‌పై అద్భుతమైన క్యాష్‌బ్యాక్ ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది. ఫోన్‌పే ప్లాట్‌ఫామ్‌లో కనీసం రూ.2,000 విలువైన డిజిటల్ గోల్డ్‌ను కొనుగోలు చేసిన యూజర్లకు 1 శాతం లేదా గరిష్టంగా రూ.2,000 క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఆఫర్ ఏప్రిల్ 30న జరిపే ఒక్క లావాదేవీకి మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది.

అవినీతి, ఆశ్రిత పక్షపాతం

- టిడిపి కూటమి పాలనపై పి. మధు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

టిడిపి కూటమి పాలనలో అవినీతి, అశ్రిత పక్షపాతం రాజ్యమేలుతున్నాయని సిపిఎం మాజీ పార్లమెంట్ సభ్యులు పి. మధు విమర్శించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం వంటి వెనుకబడిన జిల్లాల గురించి గడిచిన ఏడాది కాలంలో ఒక్కసారి కూడా సమీక్ష చేయకపోవటం, బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవటం ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోందన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు, అమలవుతున్న తీరుకు సంబంధం లేకుండా ఉందన్నారు. ఇసుక, మద్యం, మైనింగ్, విద్యుత్ తదితర రంగాలలో అవినీతి దందాలు అదుపుతప్పి పోయాయని, ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రతి పనికీ లెక్కలు కట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకునే నాధుడు రాష్ట్రంలో కరువయ్యారని, ప్రభుత్వ కార్యకలాపాలలో అవినీతి తాండవిస్తోందని విమర్శించారు. ప్రజల చేతిలో డబ్బులు లేవని, కొనుగోలు శక్తి పడిపోయిందని, కష్టజీవులకు వేతనాలు పెరగడం లేదని, ఆఖరుకు కనీస వేతన జిఓలు సవరించి 15 ఏళ్లు కావస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సెకీ విద్యుత్ ఒప్పందంలో యూనిట్ రెండున్నర రూపాయలకే కొనుగోలు చేయాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ ఒప్పందం వల్ల రాష్ట్రానికి ఒకటిన్నర లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని చంద్రబాబు స్వయంగా ప్రకటించి శ్వేత పత్రం విడుదల చేశారని, అలాంటి చంద్రబాబు యాక్సిస్ ఎనర్జీ కంపెనీతో యూనిట్ రూ. 4.50లకు ఒప్పందం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కాశ్మీరు ఘటనలో అమాయకులైన 28 మంది భారతీయ పౌరులు అన్యాయంగా చంపబడ్డారని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ఎంఎస్ఎంఇలతోనే రాష్ట్ర సాధికారత సాధ్యం

- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-కడప అర్బన్

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ)ల సాధికారతతోనే రాష్ట్ర సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లాలోని ఎంఎస్ఎంఇ, సెర్ప్ కార్యకలాపాలపై అధికారులతో గురువారం కడప కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పరిశ్రమలలో ఒక భాగంగా ఉన్న ఎంఎస్ఎంఇ విభాగాన్ని ఒక ప్రత్యేక పారిశ్రామిక రంగంగా ఒక పాలసీని తీసుకొచ్చామని,అందుకు సంబంధించి "ఉద్యం" పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టామన్నారు. వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరూ ఉద్యం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని.. ప్రభుత్వం నుంచి రాయితీలను పొందేలా ప్రజల్లో అవగాహన పెంచాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్త తయారు కావలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అని పేర్కొన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న ఇండస్ట్రీలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇండస్ట్రీలో మ్యాన్ పవర్ అవసరం చాలా ఎక్కువగా ఉందని తెలిపారు. జమ్మలమడుగు, కమలాపురం ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, కృష్ణ చైతన్యరెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, ఇండస్ట్రియల్ జిఎం చంద్ బాషా, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నీటి మడుగులో పడి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్ (అనంతపురం జిల్లా)



వంశీ, గోవిందరాజులు (ఫైల్)

ప్రమాదవశాత్తు నీటి మడుగులో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి గ్రామానికి చెందిన గోవిందరాజులు (17), వంశీ (16) కలిసి ఎద్దులను శుభ్రం చేసేందుకు ఎద్దుల బండితో సహా గ్రామ సమీపంలో ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లారు. ఎద్దుల బండిపై గోవిందరాజులు, వంశీ ఉన్నారు. ఎద్దుల బండిని నీటి కుంట చివరకు తీసుకెళ్లి ఎద్దులకు నీళ్లు తాగిస్తున్నారు. ఈ సమయంలో ఎద్దులు ఒక్కసారిగా బండితోసహా నీటిలోకి పరుగులు తీశాయి. అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో ఎద్దులతో సహా బండి కూడా మునిగిపోయింది. ఎడ్ల బండిపై ఉన్న విద్యార్థులు బయటకు రాలేక నీటిలో మునిగి మృతి చెందారు. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఈ ఘటనలో ఓ ఎద్దు కూడా మరణించింది. మృతి చెందిన యువకులు ఇద్దరూ ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాశారు. హెచ్ఎల్సీ ఆధునీకరణ నిమిత్తం మట్టి కోసం దాదాపు 3 ఎకరాల్లో 20 అడుగుల లోతు వరకు ఈ కుంటను తవ్వారు. ఇప్పటికే ఈ కుంటలో పడి దాదాపు ఆరుగురు మరణించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ కుంటను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి విడుదల చేయాలని రాస్తారోకో

ప్రజాశక్తి - అరకులోయ, హుకుంపేట (అల్లూరి జిల్లా)

స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన అరకులోయ మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్‌సిలో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో 400 పోస్టులను నోటిఫై చేయగా ఆదివాసీలకు 24 పోస్టులే దక్కుతున్నాయని తెలిపారు. స్పెషల్ డిఎస్‌సి విషయమై గత ఎన్నికల హామీని చంద్రబాబు ప్రభుత్వం నెరవేర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీలకు శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కోసం ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, నాయకులు జి.బుజ్జిబాబు, కిల్లో జగన్నాథం పాల్గొన్నారు. హుకుంపేట మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.



అరకులోయలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఏడు రోజుల లాభాలకు బ్రేక్

ముంబయి : వరుసగా ఏడు సెషన్లలో లాభాల్లో సాగిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలను చవి చూశాయి. మెటల్, ఫార్మా మినహా అన్ని రంగాల సూచీలు నేల చూపులు చూశాయి. వరుస లాభాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 315 పాయింట్లు పతనమై 79,801కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 82 పాయింట్లు తగ్గి 24,247 వద్ద ముగిసింది. దాదాపు 1869 షేర్లు రాణించగా.. 1921 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఇంతక్రితం ఏడు సెషన్లలో సెన్సెక్స్ 6,269 పాయింట్లు లాభపడింది.

ఆఫీసుకు రాకుంటే ఉద్యోగం మానాల్సిందే

- గూగుల్ హెచ్చరిక

వాషింగ్టన్ : తమ ఉద్యోగులు ఆఫీసులకు రాకుంటే ఉద్యోగం మానుకోవాల్సిందేనని టెక్ దిగ్గజం గూగుల్ హెచ్చరించింది. వ్యయ నియంత్రణలో భాగంగా ఉద్యోగుల తగ్గింపునపై ఇప్పటికే దృష్టి సారించిన గూగుల్ పలు విభాగాల్లో ఇంటి నుంచి పని విధానానికి పూర్తిగా స్వస్తి చెబుతోందని సమాచారం. ఈక్రమంలోనే 'రిటర్న్ టు ఆఫీసు' విధానాన్ని పూర్తిస్థాయిలో అమలుకు సిద్ధమయ్యిందని రిపోర్టులు వస్తోన్నాయి. పూర్తిగా ఇంటి నుంచి పని చేస్తోన్న వారు ఇక హైబ్రిడ్ వర్క్ మోడల్‌కు మారాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఒప్పో ఎ5 ప్రో విడుదల

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో ఎ5 ప్రో 5జిని భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దీనిని 50 మెగాపిక్సెల్ కెమెరా, 5800ఎంఎహెచ్ బ్యాటరీ, ఎఐ ఫీచర్లలో ఆవిష్కరించింది. 8జిబి, 128జిబి వేరియంట్ ధరను రూ.17,999గా, 8జిబి,256 జిబి ధరను రూ.19,999గా ప్రకటించింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో లభించనున్న 6.67 అంగుళాల డిస్ప్లే కలిగిన ఈ ఫోన్‌లో సెల్ఫీ కోసం 8ఎంపి కెమెరాను అమర్చింది. పలు కార్డులపై రూ.1500 వరకు క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నట్లు తెలిపింది.



ఒబెన్ ఎలక్ట్రిక్ 'ప్రొటెక్ 8/80' బ్యాటరీ ప్లాన్

హైదరాబాద్ : ఒబెన్ ఎలక్ట్రిక్ కొత్తగా 'ప్రొటెక్ 8/80'ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇది దేశంలోనే అత్యంత సరసమైన, చౌకైనా బ్యాటరీ ప్లాన్ అని వెల్లడించింది. రూ.9999 ధరతో కూడిన ప్రొటెక్ ప్లాన్‌లో 8 సంవత్సరాలు లేదా 80,000 కిలోమీటర్ల సమగ్ర బ్యాటరీ వారంటీ కవరేజ్‌తో పాటు ఒబెన్ ఎల్ఎఫ్‌పి టెక్నాలజీని అందిస్తున్నట్లు పేర్కొంది. ఇది మే 1 నుంచి తమ అన్ని 36 షోరూంలలో అందుబాటులో ఉంటుందని తెలిపింది.

వడదెబ్బతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం (అనంతపురం జిల్లా)

వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలంలో గురువారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్.కోనాపురం గ్రామానికి చెందిన కురుబదండు కరేగౌడ (45) కళ్యాణదుర్గంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట అరటికాయల వ్యాపారం చేస్తుంటారు. నాలుగు రోజుల క్రితం గార్లదిన్నెలోని తన చెల్లెలు ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం గార్లదిన్నె అక్షర స్కూల్ వద్ద ఎండకు తాళలేక అస్వస్థతకు గురై కింద పడిపోయారు. స్థానికులు ఆస్పత్రికి తరలించేలోపు ఆయన మరణించారు. మృతుని వద్ద ఆధారాలతో ఆయన్ను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కరేగౌడకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



అదిల్ మృతదేహం వద్ద విలపిస్తున్న అతని తల్లి

మెదడుకు మేత



'తాతయ్యా 'మెదడుకు మేత' అంటే ఏంటో చెప్పవా?' అని అడిగాడు జున్ను బాబు. 'మనం పనిచేయాలంటే శక్తి కావాలి. ఆ శక్తి ఆహారం (మేత) ద్వారా లభిస్తుంది. అలాగే మన మెదడు చురుగ్గా పనిచేయాలంటే పొడుపు కథలు విప్పాలి, తమాషా ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి, ప్రహేళికలకు జవాబులు ఆలోచించాలి. ఇవే మెదడుకు మేత' అని చెప్పాడు తాతయ్య.

'సరే అయితే నాకో పొడుపు కథ చెప్పు. జవాబు చెప్తాను' అన్నాడు జున్ను బాబు.

'పూర్వం పిఠాపురంలో భోగేసు, లచ్చిమి దంపతులు నివసిస్తూ ఉండేవారు. భోగేసు ప్రతి రోజూ దగ్గరలో ఉన్న అడవికి వెళ్లి పిట్టలను వేటాడి వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో జీవనం సాగించేవాడు. ఒకరోజు లచ్చిమి భర్త దగ్గరకు వెళ్ళి 'పిఠాపురం చిన్నోడా, పిట్టల వేటగాడా, బతికిన పిట్టను కొట్టా వద్దు, చచ్చిన పిట్టను తేనూ వద్దు, కూరకు లేకుండా రానూ వద్దు' అని చెప్పింది.

భార్య చెప్పిన మాటలు భోగేసుకు అర్థం కాలేదు. బతికిన పిట్టలను కొట్టకూడదు. చచ్చిన పిట్టలను తేకూడదు అనుకుంటూ అడవిబాట పట్టాడు. దారిలో ఒక పెద్ద మనిషి ఎదురయ్యాడు. అతడికి విషయమంతా చెప్పి పరిష్కారం చూపమని ప్రాధేయపడ్డాడు.

పెద్ద మనిషి ఆలోచించి అతడి భార్య చెప్పిన దాని ప్రకారం... కూరకి ఏమి తీసుకు వెళ్ళాలో చెప్పాడు. అతడికి కృతజ్ఞతలు తెలిపి భోగేసు అడవికి వెళ్ళాడు. కావలసినవి సేకరించి భార్యకి ఇచ్చి కూర చెయ్యమని చెప్పాడు.

'ఇంతకూ భోగేసు భార్యకు ఏమి ఇచ్చాడో చెప్పు' అని అడిగాడు తాతయ్య జున్ను బాబుని.

'వెదురు కొమ్ములు తాతయ్య' అన్నాడు జున్ను బాబు. 'కాదు'. 'దుంపలు తాతయ్య'. 'కాదు'. 'మాంసం తాతయ్య'. 'కాదు'. 'పక్షి గుడ్లు తాతయ్యా'.

'నీ బుర్రకి పని చెప్పావు. సరిగ్గా జవాబు చెప్పావు మనవడా!' అన్నాడు తాతయ్య.

'భలే భలే.. మెదడుకు మేతను వేశా. పొడుపు కథని విప్పేసా అని పాడుకుంటూ స్నేహితుల దగ్గరికి పరుగు తీశాడు జున్ను బాబు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

నేను గీసిన బొమ్మ




ఆర్.లీలాధర్,
8వ తరగతి,
అరవింద హైస్కూల్
సిబిఎస్ఇ, కుంచనపల్లి,
గుంటూరుజిల్లా.



తేడాలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మల్లో ఐదు తేడాలున్నాయి. కనిపెట్టండి చూద్దాం.



గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా మే 1 నుంచి 'చిన్నారి' పేజీ 'వేసవి విడిది'గా ముస్తాబవుతుంది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తున్నాం. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు చిన్నారి మెయిల్‌కి/ వాట్సాప్ నెం : 83329 25496కి పంపండి.

- ఎడిటర్

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మూర్ఖులు మృత్యువులయ్యారు మనుషులు కాపాడారు ...!

అందాల కాశ్మీర్ పచ్చిక బయళ్ల మధ్య రక్తం చిందింది. తోడుని కోల్పోయిన నవవధువులు, తండ్రులని కోల్పోయిన పసిబిడ్డలు, భర్తలను కోల్పోయిన భార్యల రోదనలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. ఇంత మారణహోమం జరిగిన వేళ, దేశంలో రెండు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఉగ్రదాడిని చూసి, ఒక కన్ను కన్నీరు కారుస్తోంది. మరో కన్ను ఈ దాడికి మతం రంగు పులిమి, విపరీతాలకు పాల్పడుతున్న వారిని చూసి ఆందోళనతో ఎరుపెక్కుతోంది. దాడి జరిగిన క్షణం నుండి ఈ ఘాతుకానికి తెగబడ్డ వ్యక్తులు హిందువులని లక్ష్యం చేసుకున్నారన్న వార్తలతో మీడియా హోరెత్తిపోయింది. బిజెపి పెద్దలైతే ఒకడుగు ముందుకేసి ఈ మొత్తం ఉగ్రదాడిని హిందూ-ముస్లిం మధ్య వైరిగా చిత్రీకరించేశారు. తీవ్రవాదానికి మతం రంగు పులుముతున్న ఈ పాలకులు దాడి చేయొద్దని ఆగంతకులకు ఎదురొడ్డి ప్రాణాలొదిన హార్స్ రైడర్ సయ్యద్ అదిల్ హుస్సేన్ మృతిని మాత్రం ఎక్కడా వినిపించడం లేదు. ఈ దాడిని నిరసిస్తూ మరణించిన హిందూ సోదరులకు సంఘీభావంగా కాశ్మీర్ వీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీలు చేసిన ముస్లిం కుటుంబాల వార్తలు కూడా ఎక్కడా చూపించడం లేదు.

అందాల కాశ్మీర్ చుట్టూ ఇప్పుడు విద్వేష వాదప్రతివాదాలు మిన్నంటుతున్నాయి. వాస్తవానికి దేశ పర్యాటక రంగంలో కాశ్మీర్‌ది ప్రత్యేకస్థానం. అక్కడ ఎంతోమంది ప్రజలు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పర్యాటకుల రాక వారికి పెద్ద పండుగని తెచ్చి పెడుతుంది. ఇంట్లో ఖర్చులకు, పిల్లల బట్టలకు, కడుపునిండా తినడానికి అవసరమైన డబ్బులు వాళ్ల వల్లే వస్తాయి. అలాంటి వారికి కాశ్మీరీలు వినమ్రంగా సేవలు చేస్తారు.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మహిళ వీడియో

భాషాభేదాలు, కులమతాల పట్టింపులు లేకుండా ప్రేమలు కురిపిస్తారు. కాశ్మీర్‌కి వచ్చినప్పటి నుంచి తిరిగివెళ్లేదాకా అతిథులకు లోటు లేకుండా సేవలు చేయడంలో పోటీలు పడతారు. అంతటి ప్రేమాభిమానాలు చూపించే ఆ కాశ్మీరీలు ఇప్పుడు ఒక్కసారిగా యావత్ దేశానికి శత్రువులుగా మారిపోయేలా చేస్తున్నారు. మతం పేరుతో ఆ అమాయకులను ఇంతలా వేధించడం వెనుక నిలువెల్లా విషం నిండిన పాముల్లాంటి వ్యక్తులు ఇప్పుడు దేశమంతా ఆక్రమించేస్తున్నారు.

దాడిలో హతుడైన అదిల్ మృతదేహం ఇంటికి చేరడానికి కొన్ని గంటల ముందు అక్కడి వాతావరణం ఎలా ఉందో పరిశీలిస్తే, పర్యాటకంపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కాశ్మీరీల జీవన దృశ్యాలు కళ్ల ముందు మెదులుతాయి.

హపాంతార్ గ్రామం నుంచి అదిల్ రోజు కూలీ చేసేందుకు పహల్గామ్‌కి వెళ్తాడు. అక్కడ పర్యాటకులను బైసరన్ క్యాంపుకి చేర్చే హార్స్ రైడర్‌గా పనిచేస్తాడు. రోజంతా పనిచేస్తే అతనికి వచ్చే కూలీ కేవలం రూ.300 నుంచి 400 మాత్రమే! తల్లిదండ్రులు, భార్య, ఐదుగురు తోడబుట్టిన వాళ్ల బాధ్యత ఉన్న ఇంటి పెద్ద కొడుకు అదిల్. ఇప్పుడు అతని మరణం ఆ ఇంటిని దిక్కులేనిది చేసింది.



అరవింద్ అగర్వాల్ మిత్రబృందం

'నా కొడుకు ఎప్పటిలాగే పని నుండి ఇంటికి తిరిగి వస్తాడనుకున్నాం. కానీ ఇలా జరిగింది. ఇప్పుడు మాకు దిక్కెవరు? అంటూ అదిల్ తల్లీదండ్రీ రోదిస్తున్న తీరు చుట్టుపక్కల చేరిన జనాల్ని కూడా కన్నీరు కార్చేలా చేసింది.

అదిల్‌తో పాటు కోటి ఆశలతో ఆ ఇంటికి వచ్చిన అతని భార్య (కొత్త కోడలు)ని ఓదార్చడం అక్కడున్న వారి తరం కావడం లేదు. అదిల్ మృతదేహం ఇంకొన్ని నిమిషాల్లో అక్కడికి చేరుకుంటుంది అనగానే అక్కడున్న వారి మౌనంతో ఆ ప్రాంతంలో నిశ్శబ్దం తాండవించింది. అదిల్‌కి మద్దతుగా ఓ ముస్లిం పెద్దావిడ 'మా అదిల్‌తో పాటు మరణించిన మిగిలిన హిందూ బిడ్డలందరికీ మా సంతాపం తెలుపుతున్నాం' అనగానే అక్కడ గుమిగూడిన ముస్లిం కుటుంబాలన్నీ ఒక్కసారిగా ఆమెతో గొంతు కలిపారు. ఏడుస్తున్న అదిల్ కుటుంబం కూడా వారితో స్వరం కలిపింది. ఎందుకంటే మరణించే ముందు అదిల్ కూడా తన పర్యాటకులను కాల్చి చంపొద్దని ఉగ్రవాదులతో మొరపెట్టుకున్నాడు. 'ఇది తప్ప'ని వారించాడు.



పర్యాటకులకు ఉచిత ఆటో సర్వీస్ చేస్తున్న ఆటోడ్రైవర్లు

ఇది కదా అసలు భారతదేశం. సుహృద్భావానికి, సౌభ్రాతృత్వానికి ఇదే సంకేతం!

ఇలాంటి ఉదంతాలు ఇప్పుడు అక్కడ ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. దాడి సమయంలో నాలుగు హిందూ కుటుంబాలని రక్షించేందుకు ఓ ముస్లిం వ్యక్తి ఎంతో చాకచక్యంగా వ్యవహరించాడు. అరవింద అగర్వాల్ అనే అతడు తన సోషల్ మీడియాలో ఇలా రాశాడు : 'నీ ప్రాణాలను అడ్డం పెట్టి మా ప్రాణాలను కాపాడినందుకు ధన్యవాదాలు నజఖత్ భాయ్. ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలను'.

అరవింద్ తనకు సాయం చేసిన వ్యక్తిలో మతం చూడలేదు. మానవత్వాన్ని చూశాడు. నజఖత్ రక్షించిన వారిలో అరవింద్‌తో పాటు శివాంశ్ జైన్, హ్యాపీ వధావన్, కుల్దీప్ స్థాపక్ ఉన్నారు. వారంతా 'నజకత్ వల్లే మేము ప్రాణాలతో బయటపడ్డాం' అని ముక్తకంఠంతో ప్రశంసించారు. బైసరన్ లోయకి చేరుకునేందుకు కొంతమంది పర్యాటకులు హార్స్ రైడింగ్‌ని ఉపయోగిస్తే, మరికొంతమంది ముస్లిం గైడ్‌ల వీపులపై ప్రయాణిస్తూ పర్యాటక ప్రదేశానికి చేరుకోవడం అక్కడ చూస్తాం.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక మహిళ ఆ వీడియోలో ఇలా చెబుతోంది : 'నీవు హిందువువా ముస్లింవా అని అడిగి హిందువులను చంపారు' అని ప్రచారం జరుగుతూ ఉండడం విచారకరం. అది ఏమాత్రం వాస్తవం కాదు. నేను ఈ రోజు ఉదయమే కాశ్మీర్ నుండి వచ్చాను. దాడి జరిగిన రోజు నా వెంట ఉన్న ముస్లిం డ్రైవర్ 'నువ్వు భయపడకు చెల్లీ, మా ప్రాణాలు అడ్డుపెట్టి నిన్ను రక్షిస్తాం' అని నాకు భరోసా ఇచ్చాడు. కాశ్మీర్‌లో ముస్లింల వల్ల హిందువులకు ప్రమాదం లేదు, అలాగే హిందువుల వల్ల ముస్లింలకు ప్రమాదం లేదు. పర్యాటకులకు ఇక్కడ హిందువులు, ముస్లింలు అండగా ఉన్నారు. ప్రజలలోని ఈ మానవత్వం, ఈ సంఘీభావం కలకాలం ఉంటుందని నమ్ముతున్నాను' అని ఆమె మీడియా ముందు ప్రకటించింది.



బాధితుడ్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న ముస్లిం వ్యక్తి


ఉగ్రవాద సంఘటన జరిగినప్పటి నుంచి టూరిస్టులను ఎయిర్ పోర్ట్‌కూ బస్ స్టాండుకూ ఉచితంగా తరలిస్తున్న ఆటో వాలాలు ఇప్పుడు అక్కడ కనిపిస్తున్నారు. ఈ ఉదంతం గురించి వారు ఏం అంటున్నారంటే, 'కాశ్మీర్‌కి వచ్చే పర్యాటకుల వల్లే మేము బతుకుతున్నాం. ఇక్కడికి వచ్చిన దగ్గర నుండి వారిని క్షేమంగా సురక్షిత ప్రాంతాలకు తరలించడం మా పని. మాలో చాలామంది పర్యాటకుల కోసం ఆటోలు, వ్యానులు నడుపుతారు. వారి కోసమే ఇక్కడ అంగళ్లు కొలువుదీరతాయి. ఈ ఉగ్రదాడి ఇప్పుడు మా కడుపు కొట్టింది' అంటున్న వారి మాటల్లో కాశ్మీరీల జీవనభృతికి ఉగ్ర ఘాతుకం వల్ల ఎంత తీవ్ర నష్టం వాటిల్లిందో తెలుస్తుంది.

ఉన్మాదం తలకెక్కిన వాళ్లు ఏ మతంలో ఉన్నా ప్రమాదమే! వాళ్లు దేశ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. మృతులకు సంతాపాన్ని, మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలపాల్సిన వేళ .. వాళ్లు ఉన్మత్త వ్యాఖ్యలతో మనుషులను విభజించే కుట్రకు పాల్పడుతున్నారు. మానవత్వంతో కూడిన స్పందనే వారికి సమాధానం!



ఆ సినిమాపై నిషేధం

పాకిస్థానీ నటుడు ఫవాద్ ఖాన్ నటించిన బాలీవుడ్ చిత్రం అబిర్ గులాల్‌పై నిషేధం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలిపింది. 'ఈ నిషేధానికి ప్రధాన కారణం, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి' అని పేర్కొన్నారు. ఫవాద్ ఖాన్ గతంలో ఖూబ్సూరత్ (2014), కపూర్ అండ్ సన్స్ (2016), ఏ దిల్ హై ముష్కిల్ (2016) వంటి బాలీవుడ్ చిత్రాల్లో నటించి భారత ప్రేక్షకుల్లో ప్రజాదరణ పొందారు. 2016లో 'ఏ దిల్ హై ముష్కిల్' చిత్రం విడుదల సమయంలో కూడా ఈ వివాదం రేగింది. సినిమా ఓనర్స్ అండ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ చిత్రాన్ని మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, గోవాలోని సింగిల్-స్క్రీన్ థియేటర్లలో ప్రదర్శించకూడదని నిర్ణయించింది. అప్పుడు జరిగిన ఉరి దాడి తర్వాత భారత్-పాకిస్థాన్ సంబంధాలు దిగజారడం దానికి కారణం. 2023లో బొంబాయి హైకోర్టు పాకిస్థానీ కళాకారులపై నిషేధాన్ని అధికారికంగా విధించేందుకు దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించింది, సాంస్కృతిక సామరస్యం, శాంతిని ప్రోత్సహించడం ముఖ్యమని తీర్పులో పేర్కొంది.



సెప్టెంబర్ 5న ఓజీ విడుదల

పవన్‌కళ్యాణ్ నటిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమాకు సంబంధించిన ప్యాచ్ వర్కులు ఇంకా కొనసాగుతున్నాయి. ఇవి పూర్తికాగానే మే 9న ఈ సినిమా విడుదల చేస్తామని చిత్ర నిర్మాతలు ప్రకటించారు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతు న్నాయి. ఇదే సినిమా నుంచి రెండో పార్టు కూడా ఏకకాలంలో సిద్ధమవుతోంది. 'ఓజీ' సినిమా కూడా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ సినిమా కూడా రెగ్యులర్ షూటింగ్ జరిపి సెప్టెంబర్ 5వ తేదీ నాటికి పూర్తిచేయాలనే ఆలోచన చిత్ర యూనిట్ ఉన్నట్లుగా సమాచారం. ఈ క్రమంలోనే విజయవాడ, మంగళగిరి పరిసర ప్రాంతాల్లోనే పవన్‌కళ్యాణ్ సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి.

'శివ శంభో'ను ఆదరించాలి : గోరటి



సంగీతం, సాహిత్యం, నృత్యం నేపథ్యంలో రూపొందిన సినిమా 'శివ శంభో' అనీ, ఆ సినిమా అన్ని తరగతుల ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని తీశారని శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న అన్నారు. తనికెళ్ల భరణి, సుమన్, కృష్ణ ఇస్లావత్, సాయి చక్రవర్తి, కేశవర్ధిని బేబీ రిషిత ప్రధాన పాత్రల్లో నటించారు. నర్సింగ్‌రావు దర్శకత్వం వహిం చారు. అనంత ఆర్ట్స్ బ్యానర్‌పై బొజ్జ రాజగోపాల్, దోరవేటి సుగుణ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్‌ఈవెంట్‌లో గోరటి వెంకన్న, తనికెళ్ల భరణి మాట్లాడారు. సంగీతం, సాహిత్యం, నృత్యం ప్రధానాంశాలుగా కలిగిన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. నిర్మాత, రచయిత, సంగీత దర్శకుడు దోరవేటి మాట్లాడుతూ, సినిమాలను థియేటర్లలో చూస్తేనే బాగుంటుంద న్నారు. శివ శంభో సినిమా సరికొత్తగా ఉంటుందన్నారు. చీకోటి ప్రవీణ్, సిద్ధేశ్వర గిరి స్వామీజీ, దామోదర ప్రసాద్, వల్లభనేని అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'ఎర్రచీర' కథ చెబితే బహుమతి



రాజేంద్ర ప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'ఎర్రచీర'. 'ది బిగినింగ్' అనేది ట్యాగ్ లైన్. సుమన్ బాబు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. కీలక పాత్రను కూడా పోషించారు. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ బ్యాక్ డ్రాప్‌తో రూపుదిద్దుకున్న ఈ సినిమా ఏప్రిల్ 25న విడుదల కావాల్సి ఉంది. ,సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. మే రెండో వారంలో విడుదల చేయబోతున్నట్టు దర్శక నిర్మాత సుమన్ బాబు తెలిపారు. 'మే నెలలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తాం. కామెడీ, హారర్, మదర్ సెంటిమెంట్, యాక్షన్ అన్నీ కలగలిపి ఎక్కడా బోర్ కొట్టకుండా ఈ చిత్రాన్ని సిద్ధం చేసుకున్నాం. ఈ సినిమాకి ఒక కాంటెస్ట్ ప్రకటిస్తున్నాం. ఈ సినిమా కథని కరెక్టుగా రిలీజ్‌కి ముందు ఎవరైనా చెబితే వారికి రూ.ఐదు లక్షలు ప్రైజ్ మనీ ఇస్తాం. 80192 46552 నంబర్‌కి కరెక్ట్ కథ చెప్పినవారికి ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆ నగదు అందజేస్తాం' అన్నారు.

విజయ్ సేతుపతితో 'పూరీ' సినిమా



దర్శకుడు పూరీ జగన్నాథ్ మరో కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఆయన తీసిన 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' నిరాశపరిచిన నేపథ్యంలో - కొంత విరామం తర్వాత విజయ్ సేతుపతితో 'బెగ్గర్' మూవీని పూరీ జగన్నాథ్ తెరకెక్కించనున్నారు. కథానాయిక రాధిక ఆప్టే. కీలకపాత్రలో టబు నటిస్తున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభించి, ఏకధాటిగా కొనసాగించబోతున్నారు. సినిమా మొత్తాన్ని రెండు షెడ్యూళ్లలో 60 రోజుల్లో పూర్తిచేయాలని చిత్ర యూనిట్ నిర్ణయించింది. గతంలో పూరీ తీసిన సినిమాల్లో ఎక్కువ భాగం రెండు, మూడు నెలల్లో పూర్తయినవే. మహేష్‌బాబుతో 'బిజినెస్‌మెన్' సినిమాను అతితక్కువ సమయంలో తీసి అరుదైన రికార్డును అందుకున్నారు.

కోహ్లి, పడిక్కల్ అర్ధసెంచరీలు

- **రాజస్తాన్‌పై బెంగళూరు గెలుపు**



బెంగళూరు: ఐపిఎల్ సీజన్-18లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) బ్యాటర్లు మరోసారి కదం తొక్కారు. చిన్నస్వామి స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు జట్టు 14పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటర్లు రాణించడంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 9 వికెట్ల నష్టపోయి 194 పరుగులే చేసింది. రాజస్తాన్ బ్యాటర్లలో ధృవ్ జురెల్(47), జైస్వాల్(49) రాణించగా.. హేజిల్‌వుడ్‌కు నాలుగు, కృనాల్ పాండ్యాకు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు బెంగళూరు బ్యాటర్లు విరాట్ కోహ్లి (70; 42బంతుల్లో 8ఫోర్లు, 2సిక్సర్లు), దేవ్‌దత్ పడిక్కల్ (50; 27 బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు) వరుసగా రెండో మ్యాచ్‌లో అర్ధ శతకాలు బాదారు. ఫిల్ సాల్ట్ (26; 23బంతుల్లో 4ఫోర్లు), జితేశ్ శర్మ (20నాటౌట్), టిమ్ డేవిడ్ (23) పరుగులు చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు సాల్ట్, కోహ్లి శుభారంభం అందించారు. ఈ జోడీ నిలకడగా బౌండరీలు బాది తొలి వికెట్‌కు 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మొదటి రెండు ఓవర్లలో చెరో ఫోర్ బాదగా.. ఆర్చర్ వేసిన మూడో ఓవర్‌లో కోహ్లి వరుసగా రెండు బౌండరీలు రాబట్టాడు. ఫిల్ సాల్ట్ తుషార్ దేశ్‌పాండేకు వరుసగా రెండు బౌండరీలతో స్వాగతం పలికాడు. ఈ క్రమంలో పవర్ ప్లే ముగిసేసరికి బెంగళూరు జట్టు వికెట్లేమీ నష్టపోకుండ 58పరుగులు చేసింది. తర్వాత బంతి అందుకున్న హసరంగ తన తొలి ఓవర్‌లో ఫిల్ సాల్ట్‌ను వెనక్కి పంపి మూడే పరుగులు ఇచ్చాడు. అనంతరం పడిక్కల్‌తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. సందీప్ బౌలింగ్‌లో విరాట్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీ (32 బంతుల్లో) అందుకున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లీకిది ఐదో అర్ధ శతకం. ఆ తర్వాత విరాట్, పడిక్కల్ జోరు పెంచారు. పరాగ్ బౌలింగ్ చెరో సిక్స్ రాబట్టారు. తుషార్ దేశ్‌పాండే వేసిన 15 ఓవర్‌లో పడిక్కల్ రెండు సిక్స్‌లు కొట్టి 26 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో కోహ్లి ఒక సిక్స్ బాదాడు. దీంతో 15 ఓవర్లకు బెంగళూరు వికెట్ నష్టానికి 156 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే, స్వల్ప వ్యవధిలో బెంగళూరు మూడు వికెట్లు కోల్పోయింది. కోహ్లిని ఆర్చర్ ఔట్ చేయగా.. సందీప్ ఒకే ఓవర్‌లో పడిక్కల్, రజత్ పటీదార్ (1)ని వెనక్కి పంపాడు. చివరి మూడు ఓవర్లలో ఆర్సీబీ 38 పరుగులు రాబట్టింది. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ, జోఫ్రా ఆర్చర్, హసరంగ చెరో వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హేజిల్‌వుడ్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)..
బెంగళూరు : 205/5 (20ఓవర్లలో)
(కోహ్లి 70, పడిక్కల్ 50; సందీప్ శర్మ 2/45)
రాజస్తాన్ : 194/9 (20ఓవర్లలో)
(జైస్వాల్ 49, జురెల్ 47; హేజిల్‌వుడ్ 4/33)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	+1.10
ఢిల్లీ	8	6	2	12	+0.65
బెంగళూరు	9	6	3	12	+0.48
ముంబయి	9	5	4	10	+0.67
పంజాబ్	8	5	3	10	+0.17
లక్నో	9	5	4	8	-0.05
కోల్‌కతా	8	3	5	6	+0.21
రాజస్తాన్	9	2	7	4	-0.62
సన్‌రైజర్స్	8	2	6	4	-1.36
చెన్నై	8	2	6	4	-1.39

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు
చెన్నై సూపర్ కింగ్స్ x సన్‌రైజర్స్ హైదరాబాద్
వేదిక: చెన్నై; రాత్రి 7.30గం॥లకు

200మీ. పరుగులో అనిమేశ్ జాతీయ రికార్డు



కొచ్చి: జాతీయ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఒడిషాకు చెందిన అనిమేశ్ కుజుర్ 200మీ. పరుగులో జాతీయ రికార్డును బ్రేక్ చేశా డు. గురువారం జరిగిన 200మీ. పరుగు పందెం ఫైనల్లో అనిమేశ్ 20.40సెకన్లలో గమ్యానికి చేరి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో గతంలో తన పేర ఉన్న 20.52సెకన్ల రికార్డు బద్దలైంది. దీంతో ఆసియా ఖండంలో కుజురు ప్రథమస్థానంలో నిలిచాడు. అలాగే ప్రపంచంలోనే 200మీ. పరుగులో అత్యుత్తమ 35వ అథ్లెట్‌గా నిలిచాడు.

ట్రిపుల్ జంప్‌లో చిత్రవేల్ కూడా..

మహరాజా కాలేజీ స్టేడియంలో జరిగిన పురుషుల ట్రిపుల్ జంప్‌లో చిత్రవేల్ తన పేర ఉన్న జాతీయ రికార్డును సమం చేశాడు. గురువారం జరిగిన ట్రిపుల్ జంప్ ఫైనల్లో చిత్రవేల్ 17.37మీ. దూకాడు. దీంతో క్యూబాలోని హవానా వేదికగా 2023లో జరిగిన కాన్ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీల్లో చిత్రవేల్ తొలుత ఈ రికార్డును నెలకొల్పాడు.

పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లపై భవిష్యత్తులో చర్చ కూడా ఉండదు: బిసిసిఐ

ముంబయి: భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులోనూ పాకిస్తాన్ క్రికెట్ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోమని ప్రకటించింది. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో బిసిసిఐ గురువారం కీలక ప్రకటన విడుదల చేసింది. బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడే అంశం గురించి సమీప భవిష్యత్తులో కనీసం చర్చ కూడా ఉండదు. అయితే, ఐసిసి ఈవెంట్లలో మాత్రం నిబంధనలకు అనుగుణంగా పాకిస్తాన్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడుతుంది" అని తెలిపారు. ఇక దేవజిత్ సైకియా స్పందిస్తూ.. బిసిసిఐ తరపున ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాం అని పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఐపిఎల్-2025లో భాగంగా బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్-ముంబయి ఇండియన్స్ మధ్య మ్యాచ్ సందర్భంగా బీసీసీఐ బాధితులకు నివాళి అర్పించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68